హాస్యానందం

సంపూర్ణ హాస్య మాసపత్రిక
నవంబర్-2026 ₹25

యండమూరి వీరేంద్రనాథ్

ప్రత్యేక సంచిక

Brewstark®
Clothing
Classic Looks Timeless Style
MEN'S ESSENTIALS
TIMELESS STYLE
FOR EVERYDAY LIFE
SHIRTS | T-SHIRTS | TROUSERS
JEANS | & MORE
BEIGE
RED
BROWN
BLUE
PINK
PREMIUM FABRICS
QUALITY STITCHING
EVERYDAY VERSATIILITY
MODERN STYLES
Brewstark
S-17, Jubilee Hills Road no.10C,
Hyderabad-500033
Ph:
9063922411

నవంబర్-2026

24 వ సంవత్సరం ✦ 9 వ సంచిక

ముఖచిత్రం: ఆనందిని

సంవత్సర చందా	రూ.300
2 సంవత్సరాల చందా	రూ.600
జీవిత చందా రూ.5000	

Publisher & Editor
Ramu. P

Full pillar: Bnim

Well wishers
Dr. K.V.Ramanachary,(IAS.Retd.)
Dr. K.I.Varaprasada Reddy,
Sri Tanikella Bharani
Sri K.V.V.Satyanarayana
Sri Akshagna Vidya Venkat
Sri Bachi
Dr. V.V.Rama Kumar

Creative Team
Dr. K.Ramakrishna,
Kandlakunta Sarath Chandra
Sudhama, Sarasi, ERM.Raju,
Vadlamannati Gangadhar,
SatyaPrakash, Krishna,Gandhi,
GopalKrishna, Bomman, Nagisetty,
Dayakar, Venkat, Sangram

D.T.P: P.Rama Lakshmi, 9440304993
Digital Media Director: Surya

హాయ్...సానందంగా...

హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు దీపావళి శుభాకాంక్షలు!

ఆనందంగా ఉండటానికి మార్గదర్శకాలు ఏమిటి? సంతోషంగా ఉండటానికి షార్ట్‌కట్‌లు ఏమిటి?... ఇలా నానా రకాలుగా మన అన్వేషణ సాగుతూ ఉంటుంది. అయితే ఇక్కడ మనం ఒక చిన్న విషయాన్ని మరచిపోతుంటాము. మన చుట్టూ ఉన్న వాళ్ళలోనే చాలామంది ఆనందంగా, సంతోషంగా కాలం గడుపుతుంటారు. వాళ్ళని గమనిస్తే చాలు! చిన్న చిన్న సంఘటనలు ఎంత బాగుంటాయో మనకు తెలుస్తుంది. అయితే ఇక్కడ మరో ముఖ్యమయిన విషయం ఏమిటంటే జీవితంలో విజయాలను సాధించి, ఆనందానికి, సంతోషానికి మార్గదర్శకాలు చూపిన ప్రముఖుల జీవనవిధానం గమనించినా మనకు ఆనందం, సంతోషాల మూలాలు దొరుకుతాయి.

ఆ ప్రక్రియలో భాగంగానే మన తెలుగు ప్రఖ్యాత రచయిత **శ్రీ యండమూరి వీరేంద్రనాథ్** గారి పుట్టిన్రోజు సందర్భంగా ఈ ప్రత్యేక సంచిక రూపొందించటం జరిగింది. మనకు ఏం కావాలి? ఎంత వరకు కావాలి? దేనికోసం పరిగెత్తాలి? అనే మొదలయిన విషయాలు మనం ఈయన అనుభవాల నుంచి తెలుసుకుంటాం!

"ఆనందంగా ఉండటానికి ఏం చేయాలో అవన్నీ చేస్తూ వచ్చాను. నా జీవితానుభవం నేర్పింది మూడు విషయాలు: సంతోషం కోసం నిరంతరం పని చేస్తూ ఉండటం; ఆర్థికంగా సింగిల్ బెడ్రూమ్ నుంచి స్విమ్మింగ్ పూల్ దాకా ఎదగటం; ఆపై తాపత్రయాన్ని వదులుకోవటం." ఆయన చెప్పిన ఈ 'సూత్రాలు' అందరికీ మార్గదర్శకాలు!

ఈ సంచిక మిమ్మల్ని అలరిస్తుందనీ... ఆశిస్తూ...
అందరూ ఆనందంగా...
ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...

రాము.పి

Editorial Office- **Hasyanandam,**
#8-215/4, Near Ramalayam Centre,
YERRABALEM-522 503, Mangalagiri, Guntur Dist.
Ph:9849630636.
email: hasyanandam.mag@gmail.com
web: www.hasyanandam.com

Hyderabad & Secunderabad Distributors
M.Pandu Ranga, Risingsun News Agency
Abids, Hyderabad-1
Ph:9666680857,6301072906

Prize Sponcers
K.V.V.Satyanarayana,
P.Srikanth Sarma
Akshagna Publications,
Nimmi Madhubala,
K.Sundaresayya& Satyavathi,
Cartoonist Md.Raj Mohammed,
Cartoonist Ramsheshu

యండమూరి ప్రత్యేక సంచికలో ప్రత్యేకతలు...

డా. యండమూరి వీరేంద్రనాథ్-సంక్షిప్త పరిచయం -6
యండమూరి గురించి యండమూరి -8
ఆ ఒక్కటీ అడక్కు (కథ) -12
సినిమాల్లో యండమూరి -17
ప్రముఖ నటులు, దర్శకులు, కార్టూనిస్టులు, రచయితలు, రచయిత్రులు నిర్వహించిన యండమూరితో ఇంటర్వ్యూ -18
ఇమ్మెటీరియలిజం(కథ) -20
యండమూరి వీరేంద్రనాథ్ పుస్తకాలు -25
యండమూరికొన్ని జ్ఞాపకాలు -26
కొండ మీద నక్షత్రాలు(కథ) -28
ఈలా-ఇల్లాలు(కథ) -35
యండమూరితో చంద్ర ఇంటర్వ్యూ -42
ఉత్తిష్ఠంతు(కథ) -44
యండమూరి మహా(ప)దానందం -50

ఇంకా... 'యండమూరి వాణి' అక్కడక్కడ

కార్టూన్ శీర్షికలు.....

నవ్వుకొమ్మచ్చి	-సరసి	-14
నా ఇష్టం	-రాజు	-15
హే భగవాన్	-భగవాన్	-16
ప్రొఫెషనల్ ఫన్	-నాగిశెట్టి	-30
మిక్చర్ పొట్లం	-రామ్‌శేషు	-32
చిలుక జో(హా)స్యం	-శాయికృష్ణ	-36
నవ్వే ఆనందం	-గోపాలకృష్ణ	-38
బుడ్డోడు	-సుజయ్‌కృష్ణ	-46
నెల నెలా నవ్వుల వెన్నెల		-48

గమనిక: ఈ నెల యండమూరి ప్రత్యేక సంచికగా రూపొందించటం వలన రెగ్యులర్‌గా వచ్చే ధారావాహికలు, శీర్షికలు ఈ సంచికలో ప్రచురింపబడలేదు. వచ్చే సంచికలో యధాతథంగా ఇవి ప్రచురింపబడతాయి -సం॥

యండమూరి కార్టూన్స్:

✦ బాచి ✦ సంగ్రామ్ ✦ శర్మ✦ ప్రసిద్ధ ✦ గోపాలకృష్ణ ✦ వాడ్రేవు ✦ ఎమ్.ఎమ్.మురళి ✦ బీవీఎస్ ✦ నాగిశెట్టి

దీపావళి కార్టూన్స్:

✦ కామేష్ ✦అరుణ్ ✦ పద్మ✦ సాయికృష్ణ ✦ చక్రవర్తి ✦ భాను ✦ రాము

ప్రముఖ కార్టూనిస్టు

శ్రీ బాచి గారికి

'ఉషా జీవన సాఫల్య పురస్కారం'

విశాఖపట్నం, ఆంధ్రాయూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజి క్యాంపస్, డా॥ YVS మూర్తి ఆడిటోరియంలో సెప్టెంబర్ 3వ తేదీన జరిగిన ఉషా పత్రిక తృతీయ వార్షికోత్సవ సభలో ప్రముఖ కార్టూనిస్టు, ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం అధ్యక్షులు **శ్రీ బాచి గారికి** ఉషా పత్రిక, విజయ సుందర స్వధర్మ వేదిక ట్రస్ట్ సహకారంతో **'ఉషా జీవన సాఫల్య పురస్కారం'** అందజేసారు. 20,116/- రూపాయలు నగదు బహుమతితో పాటు అవార్డు అందజేశారు. శ్రీ బాచిగారికి హాస్యానందం అభినందనలు





అక్షరాల నడుమ ఆలోచనల తుఫాను,
పుట పుటలో పరుచుకున్న మలుపుల ప్రవాహం,
కలాన్ని కత్తిలా తిప్పిన సృజనశీలి,
తెలుగు నవలా ప్రపంచంలో విప్లవ తేజం!
'తులసిదళం'తో భయపు గడపలు దాటించి,
'వెన్నెల్లో గోదారి'తో మనసును తడిపి,
'అంతర్ముఖం'తో హృదయపు పొరలు విప్పి,
ప్రతి కథలోనూ కొత్త వెలుగులు నింపి...
కేవలం కథలే కాదు ఆయన రచనలు,
గెలుపు బాట చూపించే మార్గదర్శకాలు!
ఆలోచనలని సానబెట్టే ఆదర్శాలు,
యువతరం మనసును మేల్కొలిపే తంత్రాలు!
భయానికీ, కుతూహలానికీ నడుమ వంతెన కట్టి,
రచనా శైలికి కొత్త నిర్వచనం రాసి,
కోట్లాది పాఠకుల గుండెల్లో నిలిచారు,
సాహిత్య జగత్తులో చెరగని సంతకమయ్యారు!

హాస్యప్రియులైన హాస్యానందం పాఠకుల హాస్య చతురతకి, కార్టూనిస్టులకు యండమూరి కానుక!

వచ్చే సంచిక నుండి అంటే డిశంబర్ సంచికలో ప్రచురించిన కార్టూన్‌లోంచి మీకు నచ్చిన 3 కార్టూన్‌లు మాకు తెలియజేస్తే... మేము ఎంచుకున్న వాటికి అవి సరిపోతే మీకు అంటే పాఠకులకు యండమూరి రచించిన ఒక పుస్తకం బహుమానం!

అలాగే ఎంపికైన 3 కార్టూన్ల కార్టూనిస్టులకు 300 రూపాయలు చొప్పున నగదు బహుమతి!

మీరు ఎంపిక చేసిన కార్టూన్ పేజీనంబర్, కార్టూనిస్టు పేరు ఈ వాట్సాప్ నెంబరుకి పంపండి!

నెంబర్-9502630637

హలో... వచ్చే సంచిక నుండి ఈ పరీక్ష!

డా. యండమూరి వీరేంద్రనాథ్ - సంక్షిప్త పరిచయం

డా.యండమూరి వీరేంద్రనాథ్ తెలుగు సాహిత్యం, సినిమా, టెలివిజన్, వ్యక్తిత్వ వికాస రంగాల్లో విశిష్టమైన సేవలు అందించిన ప్రముఖ రచయిత. ఆయన దాదాపు 70 నాటకాలు, నవలలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు రచించారు.

ఆయన రచనలు తమిళం, కన్నడ, మలయాళం, ఇంగ్లీష్, హిందీ భాషల్లోకి అనువదించబడ్డాయి.

ఆయన రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డుతో కూడా సత్కరించింది. లోక్‌నాయక్ ఫౌండేషన్ అందించే ఆంధ్ర జ్ఞానపీఠ సాహిత్య పురస్కారం కూడా ఆయనకు లభించింది.

సాహిత్యం, సినిమా మాత్రమే కాకుండా సామాజిక సేవలో కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. గోదావరి సమీపంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో ఆశ్రమాన్ని నిర్మించి, గిరిజన విద్యార్థులకు ఉచితంగా విద్య అందించే కార్యక్రమాన్ని చేపట్టారు

బాల్యం – కుటుంబ నేపథ్యం

యండమూరి వీరేంద్రనాథ్ 1948 నవంబర్ 14న ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజోలు గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి ఆదాయపు పన్ను శాఖలో ఉద్యోగి కావడంతో బాల్యంలోనే భారతదేశంలోని వివిధ ప్రాంతాలను చూడటానికి అవకాశం లభించింది.

చిన్న వయస్సులోనే విభిన్న ప్రాంతాలు, భాషలు, జీవన విధానాలు పరిచయం కావడం ఆయన పరిశీలనా శక్తిని, మనుషుల మనస్తత్వాలపై ఆసక్తిని పెంచింది. ఈ అనుభవాలే తర్వాత ఆయన కథలు, నవలల్లో కనిపించే విస్తృత జీవన దృక్పథానికి పునాది అయ్యాయి.

విద్య

వీరేంద్రనాథ్ చార్టర్డ్ అకౌంటెన్సీ ప్యాసయ్యారు. ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ, వృత్తి ప్రపంచం గురించి వచ్చిన అవగాహన ఆయన రచనల్లో కనిపించే వాస్తవికతకు తోడ్పడింది.

ఉద్యోగ జీవితం

సాహిత్య రంగంలో పూర్తికాల రచయితగా స్థిరపడే ముందు ఆయన బ్యాంకింగ్ మరియు ఆర్థిక రంగాల్లో పని చేశారు. ఆంధ్రాబ్యాంక్‌లో ఉద్యోగం చేశారు.

ఉద్యోగ జీవితంలోనూ రచనను కొనసాగిస్తూ, క్రమంగా పాఠకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు.

'తులసీదళం' వంటి రచనలు విపరీతమైన ప్రజాదరణ పొందిన తర్వాత పూర్తి కాల రచనా జీవితాన్ని ఎంచుకున్నారు.

ఆయన రచించిన 'విజయానికి 5 మెట్లు'పుస్తకం దాదాపు మూడు కోట్ల రూపాయల అమ్మకాల రికార్డు సాధించింది.

భారతదేశంతో పాటు ఆస్ట్రేలియా, సింగపూర్, టాంజానియా, ఇండోనేషియా, అమెరికా, బ్రిటన్ దేశాల్లో ఆయన ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తరగతులు కూడా నిర్వహించారు.

సినీరంగంలో చిరంజీవి, విజయశాంతి, రమ్యకృష్ణ వంటి ప్రముఖులతో పని చేశారు. 'అభిలాష', 'ఛాలెంజ్', 'జగదేక వీరుడు అతిలోక సుందరి' వంటి చిత్రాలు ఆయన సినీ ప్రస్థానంలో ముఖ్యమైనవి.

ఆయన ఏడు టెలివిజన్ సీరియల్స్‌కు దర్శకత్వం వహించి మూడు గోల్డెన్ నంది అవార్డులు అందుకున్నారు.

'ఒక ఊరి కథ' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా భారత రాష్ట్రపతి అవార్డు పొందింది. కన్నడ చిత్రం 'బెలదింగలే బాలె' కర్ణాటక ప్రభుత్వ ఉత్తమ చిత్ర అవార్డుతో పాటు ఫిల్మ్‌ఫేర్ అవార్డును కూడా పొందింది.

1982లో ఆంధ్రజ్యోతి నిర్వహించిన అభిప్రాయ సేకరణలో ఎన్టీ రామారావు, దర్శకుడు బాపు తదితరులతో పాటు రాష్ట్రంలోని నలుగురు అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తుల్లో యండమూరి ఒకరిగా నిలిచారు.

సాహిత్యం, సినిమా మాత్రమే కాకుండా సామాజిక సేవలో కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. గోదావరి సమీపంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో ఆశ్రమాన్ని నిర్మించి, గిరిజన విద్యార్థులకు ఉచితంగా విద్య అందించే కార్యక్రమాన్ని చేపట్టారు

వృత్తిపరంగా ఆయన స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో ఐదేళ్లు, ఆంధ్రా బ్యాంకులో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పదేళ్లు పనిచేశారు.

నాలుగేళ్ల సీఏ కోర్సును మూడేళ్లలో పూర్తి చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు.

రచన, సినిమా, టెలివిజన్, వ్యక్తిత్వ వికాసం, విద్యా సేవ-ఇలా అనేక రంగాల్లో సమానంగా గుర్తింపు పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి డా. యండమూరి వీరేంద్రనాథ్.

✦ గొప్పవాడవటం అంటే, 'తప్పదు' అనుకుంటూ పొద్దున్నే జీవితాన్ని తిట్టుకుంటూ లేవటం కాదు. ఏడుస్తూ పని చెయ్యటం కాదు. రాత్రవగానే దిగులు పక్క మీద నిరాసక్త దిండు వేసుకుని పడుకోవటం కాదు. సుదూర తీరాల్లో కనపడే స్వర్గాన్ని ఊహించుకుంటూ వర్తమాన నరకంలో ఆశగా బ్రతకటం కాదు. భవిష్యత్తు గురించి ఆలోచించకుండా 'ఇప్పుడు బానే ఉంది కదా' అనుకుంటూ కంఫర్ట్ జోన్‌లో బ్రతికెయ్యటం అసలే కాదు. రేపటి సంతోషం కోసం వర్తమానంలో ఆనందంగా పని చెయ్యటం... చిన్న నిర్వచనం! కానీ ఆలోచించేకొద్దీ దాంట్లో లోతైన అర్థం ఉన్నది.

✦ గతం ఏమిటని కాదు. భవిష్యత్తు ఏమిటని ఆలోచన గెలుపుకి తొలిమెట్టు.

✦ మనిషి మనసులో ఎప్పుడూ రెండు విరుద్ధభావాలు ఉంటాయి. ఒకటి: చాతగానితనం.
రెండు: నమ్మకం. చాతగానితనం శక్తివంతమైనది.
అయితే నమ్మకం దానికన్నా శక్తివంతమైనది.
'చేతకానితనాన్ని' నాశనం చేసే శక్తివంతమైన ఆయుధం 'నమ్మకం'.
అయితే... నమ్మకం వేరు. అతి నమ్మకం వేరు.
రెండిటి తేడా తెలియక పోవటం వల్ల వచ్చే కష్టాలు స్టాక్‌మార్కెట్‌లో బయట పడతాయి.

యండమూరి వీరేంద్రనాథ్ రాసిన **'విజయానికి ఐదు మెట్లు'** నవల కాదు; ఇది తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రాచుర్యం పొందిన వ్యక్తిత్వ వికాస గ్రంథం.

1995లో విడుదలైన ఈ పుస్తకం లక్షలాది కాపీలు అమ్ముడై ఒక సంచలనం సృష్టించింది.

యండమూరి ఇందులో విజయం సాధించడానికి మనిషి దాటాల్సిన ఐదు మానసిక స్థాయిలను 'ఐదు మెట్లు'గా వర్గీకరించారు

1. గెలుపుకు పునాది ఓటమి: జీవితంలో ఎదురయ్యే భయం, ఆందోళన, కోపం, ఆత్మన్యూనతా భావాలను జయించి, ఓటమిని ఎదుర్కొనే మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవడం.

2. మానవ సంబంధాలు: సమాజంలో, కుటుంబంలో ఇతరులతో సత్సంబంధాలు కలిగి ఉండటం, అసూయ, స్వార్థం వీడి ఆరోగ్యకర మైన ఆకర్షణ, కమ్యూనికేషన్ పెంచుకోవడం.

3. మన ఆయుధాలు: జీవితంలో ముందడుగు వేయడానికి అవసరమైన లాజిక్, పాజిటివ్ థింకింగ్, టైమ్ మేనేజ్‌మెంట్, ఏకాగ్రత, ఆత్మావగాహన వంటి నైపుణ్యాలను పదును పెట్టుకోవడం.

4. డబ్బు సంపాదన: ఆచరణాత్మకమైన ఆలోచనలతో డబ్బును ఎలా సంపాదించాలి, ఆర్థిక నిర్వహణ ఎలా ఉండాలో వివరించడం.

5. అంతిమ విజయం: కేవలం డబ్బు, హోదా మాత్రమే విజయం కాదు; ప్రేమ, మానసిక ప్రశాంతత, సంతృప్తి పొందినప్పుడే అది 'సంపూర్ణ విజయం' అవుతుందని ముగించడం.

తన మార్కు శైలిలో అనుభవాలు, ఉదాహరణలు, ప్రాక్టికల్ చిట్కాలతో సైకాలజీని ఎంతో సులభంగా వివరించడంతో ఈ పుస్తకం యువతకు, ఉద్యోగార్థులకు గొప్ప మార్గదర్శిగా నిలిచింది.

యండమూరి గురించి యండమూరి

- నా కుటుంబం
- నా రచనా ప్రయాణం
- కార్టూనిస్టులతో నేను
- అలాంటి మిత్రులే మనకు కావాలి!
- నా రచనా జీవితంలోని వివిధ దశలకు సాక్షులు.
- నా తొలి కథ.
- నా తొలి నాటకం.
- నన్ను ప్రోత్సహించిన పత్రికా సంపాదకులు
- రచయితగా నా జీవితాన్ని మలుపు తిప్పిన వ్యక్తి
- పోటీలో ప్రత్యర్థులం; జీవితంలో స్నేహితులం.

ఆత్మన్యూనత నుంచి అక్షరాల వైపు నా రచనా ప్రయాణం...

నేను రచయితనవటానికి కారణం ఆత్మన్యూనతా భావం.

అవును! మీరు చదివింది కరెక్టే... ఆత్మన్యూనతా భావమే!

మేము నలుగురం అన్నదమ్ములం. నా ముగ్గురు తమ్ముళ్ళు నాకన్నా పొడుగు. ఆ విషయంలో నాలో ఉన్న ఆత్మన్యూనతే నన్ను ఏదో ఒక రకంగా, ఏదో ఒకటి సాధించాలనే పట్టుదలకు గురిచేసింది. ఆ పట్టుదలే నన్ను రాయడం వైపు నడిపించింది. తొలి కథ అచ్చయ్యాక వచ్చిన అభినందనలు చూసి, “రచయితనైతే చప్పట్లు కొడతారు కదా?” అనుకున్నాను.

రెండో కారణం... రచనల వల్ల ఆర్థికంగా కొంత సహాయం అందడం. ఆ రకంగా రాయడం ద్వారా జీవితంలో నిలదొక్కుకోవచ్చనే నమ్మకం నాకు కలిగింది. సింగిల్ బెడ్ రూమ్ స్థాయి నుంచి స్విమ్మింగ్ పూల్ ఉండే బెడ్‌రూమ్ కాన్సెప్ట్ అప్పుడే నాకు తెలిసింది.

నాకు తెలుగుతో పరిచయం పదవ తరగతి వరకే. బీ.కాం.లో సెకండ్ లాంగ్వేజ్ హిందీ. చార్టర్డ్ అకౌంటెన్సీలో అసలు తెలుగు ప్రసక్తే లేదు. కానీ మా నాన్నగారు శ్రీచక్రపాణిగారు కవి. ‘ఆ సమాధులలో’ అనే అద్భుతమైన పద్యాల పుస్తకం వ్రాశారు. ఆయన రామాయణాన్ని గేయ రూపంలో రచించారు. మా అమ్మగారు శ్రీమతి నరసాంబ కూడా కవే. ఇలా-ఇటు తండ్రి, అటు తల్లి వైపుల నుంచి సాహిత్యాభిరుచి వారసత్వంగా వచ్చింది. ఆ విధంగా చూస్తే, తెలుగు భాషని పాఠ్య పుస్తకాల ద్వారా నేర్చుకున్న దానికన్నా, జీన్స్ ద్వారా అందుకున్నదే ఎక్కువ అనిపిస్తుంది. నా మీద పోతన (సరళంశైలి) ప్రభావం ఎక్కువ ఉంది. నవలల్లో సస్పెన్స్‌కి ప్రేరణ-చిన్నప్పటి చందమామ మాసపత్రిక సీరియల్స్.

నా భార్య అనుగీత తెలంగాణ అమ్మాయి. ‘కుక్క’ నాటకంతో పాటు మరికొన్ని తెలంగాణ నేపథ్య కథల్ని ఆమె సహాయంతోనే వ్రాశాను.

మా అబ్బాయి ప్రణీత్, కోడలు కూడా చార్టర్డ్ అకౌంటెంట్స్. ఆ అమ్మాయి సి.ఎ.లో ఆల్ ఇండియా ర్యాంకర్. ప్రస్తుతం సింగపూర్‌లో ఉన్నారు. మనవలు ఆరుష్, ఆకాష్. ఒక మనవడికి టెన్నిస్, పియానో రెంటిలోనూ మంచి ప్రావీణ్యం ఉంది. రెండో మనవడు సింగపూర్ దేశం తరఫున క్రికెట్ జట్టులో ఆడుతున్నాడు. క్లుప్తంగా ఇదీ మా కుటుంబ పరిచయం.

ఈ ప్రయాణంలో నాకు పెద్ద ప్రేరణ యద్దనపూడి సులోచనారాణిగారు. ఆవిడ రాసిన ‘విజేత’ పుస్తకం చదివిన తర్వాతే... ద్రాక్షతోట, బోచ్చుకుక్క లేకపోయినా కనీసం ఒక

కారు అయినా కొనుక్కోవాలనే కోరిక కలిగింది. అంతేకాదు, ఆవిడ పుస్తకాల ప్రేరణతోనే నా రచనల్లోని చాలా వరకు హీరోయిన్లు ఎంతో ఆత్మాభిమానంతో ఉంటారు.

బలహీనత నుంచి మొదలైన నా ప్రయాణం, ఈ రోజు నన్ను ఒక రచయితగా నిలబెట్టింది.

నాకు కార్టూనిస్టుల్లో అత్యంత దగ్గరైనవాడు శంకు. నేను ఈ రోజు రచయితగా నిలబడటానికి చాలా వరకు తనే కారణమని చెప్పినా అతిశయోక్తి కాదు. నా రచనా ప్రయాణం మొదటి రోజుల్ని తలుచుకుంటే, ఆ జ్ఞాపకాల మధ్య శంకు తప్పకుండా కనిపిస్తాడు. నేను ఏదైనా కొత్తగా రాసి ఉత్సాహంగా చెబితే, ముందు మెచ్చుకోవడం కన్నా ఒక చిన్న చురక వేసేవాడు. ఆ చురకలోనే సలహా ఉండేది. నవ్వుకుంటూనే నేను దాన్ని స్వీకరించేవాణ్ని. బహుశా అలాంటి మిత్రులే మనల్ని మనకు తెలియకుండా తీర్చిదిద్దుతారేమో!

జయదేవ్‌తో నా అనుబంధం మరో రకం. మా పుస్తకాలకు అతను వేసిన బొమ్మలు చూస్తూ చాలా సార్లు, “నేను ఇన్ని పేజీలు రాసి చెప్పింది... ఇతను నాలుగు గీతల్లో చెప్పేశాడే!” అనిపించేది. దాదాపు నలభై సంవత్సరాలుగా మా ఇద్దరి స్నేహం కొనసాగుతోంది. కాలం మారింది, ముద్రణ మారింది, పుస్తకాల రూపం మారింది... కానీ మా మధ్య ఆప్యాయత మాత్రం మారలేదు. కొన్ని బొమ్మలు చూస్తే పుస్తకం గుర్తొస్తుంది; మరికొన్ని చూస్తే ముందుగా జయదేవే గుర్తొస్తాడు.

సరసి, ఎస్వీ, ప్రసిద్ధ –ఇలా నాకు ఇష్టమైన కార్టూనిస్టుల జాబితా చాలా పెద్దదే. వీళ్లలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి. ఒకరు రెండు గీతల్లో నవ్విస్తే, మరొకరు అదే రెండు గీతల్లో మనల్ని ఆలోచింపజేస్తారు. రచయితకు పేజీ కావాలి; కార్టూనిస్టుకు కొన్నిసార్లు ఒక్క వంకర గీత చాలు. ఆ విషయంలో వాళ్ల మీద నాకు కొంచెం అసూయ కూడా ఉంది!

తనికెళ్ళ భరణి గురించి చెప్పాలంటే... ఆయనతో సంభాషణే చాలా సార్లు ఒక చిన్న నాటకం లాంటిది. మాటలో చమత్కారం, మధ్యలో వ్యంగ్యం, చివర్లో మనం ఊహించని మలుపు. అలాంటి వాళ్లతో గడిపినప్పుడు “ఇది గుర్తుపెట్టుకోవాలి” అనుకుంటాం. కానీ ఇంటికి వచ్చేసరికి జోక్ మాత్రం గుర్తుంటుంది–దాన్ని ఎవరు చెప్పారో మరిచి పోతాం!

నిజానికి వీళ్లందరూ నాకు కేవలం కార్టూనిస్టులు, కళాకారులు మాత్రమే కాదు. నా రచనా జీవితంలోని వివిధ దశలకు సాక్షులు. వాళ్ల బొమ్మలు, మాటలు, చమత్కారాలు, స్నేహం–ఇవన్నీ కలిపితే నా జ్ఞాపకాల ఆల్బమ్‌లో ఒక ప్రత్యేక అధ్యాయం. కొన్ని స్నేహాలు ఫొటోలలో మిగులుతాయి. కొన్ని ఉత్తరాల్లో మిగులుతాయి. మా స్నేహాలు మాత్రం గీతల్లో, నవ్వుల్లో, పుస్తకాల పేజీల్లో ఇప్పటికీ జీవిస్తూనే ఉన్నాయి.

1967లో బి.కాం. రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు వ్రాసిన ‘ముసురు పట్టిన రాత్రి’ అనే కథ నా తొలి ఆ కథ. దానికి ప్రథమ బహుమతి కూడా వచ్చింది. ఆ వార్త తెలిసినప్పుడు ఆకాశంలో ఇంద్ర ధనుస్సులు విరియ లేదు, కోయిలలు కూయలేదు, ప్రపంచం ఒక్క క్షణం ఆగి నన్ను అభినందించలేదు.... కారణం చాలా చిన్నది.

అది చేతివ్రాత మా తండ్రిగారు పని చేసే ఆదాయపు పన్ను కాకినాడ శాఖలో ఉద్యోగుల కోసం ప్రతినెలా వెలువడే ‘చేతివ్రాత పత్రిక’! మొదటి బహుమతి పాతిక రూపాయలు.

మా తండ్రిగారి దస్తూరి చాలా అందంగా ఉండేది. అందువల్ల ఆ పత్రిక మొత్తాన్నీ ఆయనే చేతితో రాసేవారు. ఆ విధంగా– తండ్రి చేతి వ్రాతలో తొలి కథ ప్రచురితమైన తొలి రచయితను తెలుగు సాహితీ చరిత్రలో బహుశా నేనేనేమో...

వారపత్రిక కవర్ పేజీ మీద రచయితల బొమ్మలు వేసి, పాఠకులకు ప్రముఖంగా పరిచయం చేసే సంప్రదాయం కనకాంబరరాజుతోనే ప్రారంభమై, దాదాపు ఆయనతోనే ముగిసిపోయింది. ‘తులసీదళం’, ‘వెన్నెల్లో ఆడపిల్ల’వంటి అత్యంత విజయవంతమైన సీరియల్స్‌తో పాటు ‘ఆనందోబ్రహ్మ’, ‘ప్రార్థన’వంటి నవలలను కూడా ఆయన ప్రచురించారు. రచయితను నమ్మితే చివరి వరకు నిలబడేవారు. నా రచనా జీవితంలో కనకాంబర రాజు పాత్రను ఒక్క మాటలో చెప్పాలంటే... ఆయన నాకు కేవలం సంపాదకుడు కాదు; రచయితగా నాలో ఉన్న అవకాశాన్ని గుర్తించి, దానికి విశాలమైన వేదిక ఇచ్చిన వ్యక్తి.

మరెవరైనా ఉన్నారేమో తెలియదు.

తొలి కథ ప్రచురితమైన ఆనందంతో పాటు, దాన్ని తండ్రి స్వయంగా వ్రాశారనే జ్ఞాపకం మరింత అపురూపమైనది.

అప్పుడు నా వయసు పద్దెనిమిది. ఆ సంవత్సరమే (1967) భారత దేశం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తయారుచేసిన ‘రోహిణి’ రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించింది. మొదటి కథ అచ్చయిన ఉత్సాహంతో, ఆ వయసులో ఉన్న సహజ ఉత్సుకతతో / రచయితకు ఉండాల్సిన పరిశీలనా పరిజ్ఞానంతో– ‘పైపైకి పోయే రాకెట్ల... జాకెట్ల యుగంలో...’ అంటూ ఓ గేయం వ్రాసి మరుసటి నెల అదే పత్రికకు ఇచ్చాను. ఎడిటరుగారు ఒప్పుకున్నా, నాన్నగారు చిరాకు పడి దాన్ని చింపేశారు. అలా నా గేయరచనా ప్రస్థానం పైకి వెళ్ళకుండా తాత్కాలికంగా అక్కడే ఆగింది. ఎడిటరు ఒప్పుకున్నదాన్ని ప్రింటరు(!) ఆపటం

కూడా సాహితీ చరిత్రలో తొలిసారే అనుకుంటాను.

ఆ తర్వాత కొన్ని సంవత్సరాల పాటు కథలు రాస్తూనే ఉన్నాను.

ఆ రోజుల్లో కథ వ్రాసినప్పుడు వాటిని ప్రభ, పత్రిక, జ్యోతి లాంటి పత్రికలకి ఎలా పంపించాలో కూడా తెలియదు. అప్పుడు నాతోపాటు చార్టర్డ్ అకౌంటెన్సీ చదువుతున్న ఎస్.బి.శంకర్ కుమార్ ఆ కథలను పత్రికలకు పంపించడంలో స్టాంపులు అంటించటం, హామీ పత్రం వ్రాయటం మొదలైన విషయాల్లో సహాయం చేసేవాడు.

ఆ శంకర్ కుమారే తర్వాతి కాలంలో 'కార్టూనిస్ట్ శంకు'గా ఎంతో ప్రసిద్ధి చెందారు. చదువు పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్‌లో ఇద్దరం కలిసి పనిచేశాం. అనంతరం ఆయన బాపుగారి దర్శకత్వంలో 'మిస్టర్ పెళ్ళాం' చిత్రాన్ని నిర్మించారు. చదువుకునే రోజుల్లో మొదలైన మా సహచర్యం ఎన్నో సంవత్సరాలు కొనసాగి, ఆయన మరణంతో ముగి సింది. కానీ శంకు మాత్రం ఇప్పటికీ నా జ్ఞాపకాల్లో సజీవంగానే ఉన్నారు.

> **నాటకాల కోసం ఊరూరూ తిరుగుతూ, దొరికిన చోట కూర్చుని, చోటు లేకపోతే నేలమీద పడుకుని ప్రయాణించిన రోజులవి. ఒకవైపు రంగస్థలం మీద ఒకరిని మించి మరొకరు నిలబడాలనే తీవ్రమైన పోటీ; మరోవైపు రైలులో తలుపు దగ్గరా, టాయిలెట్ పక్కనా సర్దుకుని ప్రయాణించే స్నేహం. అవి సౌకర్యాల కోసం తిరిగిన రోజులు కావు. నాటకం కోసం తిరిగిన రోజులు. పోటీలో ప్రత్యర్థులం; జీవితంలో స్నేహితులం.**

తొలిరోజుల్లో నా కథలు ఐదారు ఆంధ్రప్రభలో వెలువడ్డాయి. అదే సమయంలో చందమామలో కూడా కొన్ని కథలు ప్రచురితమయ్యాయి. ఆ రోజుల్లో బేతాళ కథలు రాయటం కొంచెం కష్టమైన పని. ప్రశ్న మనమే వేసి, దానికి సమాధానం కూడా మనమే చెప్పాలి. చాలా కొద్దిమంది రచయితలు మాత్రమే బేతాళ కథలు రాసేవారు. ఆ విభాగంలో ఐదారు కథలు రాయటం నాకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఆ సమయంలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన నాటక పోటీకి 'గులక రాళ్లు–గులాబీ ముళ్లు' అనే నాటకాన్ని పంపితే బహుమతి వచ్చింది. అదే నా తొలి నాటకం.

ఈ సందర్భంగా పురాణం సుబ్రహ్మణ్యశర్మగారి గురించి ప్రస్తావించాలి. ఆ రోజుల్లో ఆయన నన్నెంతో ప్రోత్సహించేవారు. నా తొలి నాటకానికి బహుమతి ఇచ్చి, దాన్ని ప్రదర్శింపజేసి, ప్రచురించారు. ఆ కృతజ్ఞతతోనే ఆ తరువాత నా దర్శకత్వంలో వచ్చిన అగ్నిప్రవేశం సినిమాలో ఆయనను నటుడిగా పరిచయం చేసి, కొంతవరకు నా కృతజ్ఞత తీర్చుకున్నాను.

నవలల విషయానికి వస్తే, నా తొలి నవలను ప్రచురించిన వ్యక్తి– స్వాతిబలరాంగారు. ఆ తరువాత 'దేవుడా! నీ కులమేమిటి?' నవలకు మూడో బహుమతి ఇచ్చి ప్రచురించారు.

పత్రికా సంపాదకుల్లో నన్ను మరింతగా ప్రోత్సహించిన మూడో వ్యక్తి పొత్తూరి వెంకటేశ్వరరావుగారు. అంతకుముందే 'నిశ్శబ్దం నీకూ నాకూ మధ్య' అనే నవల ఆంధ్రప్రభలో ప్రచురితమైంది.

'తులసిదళం'వచ్చిన రోజుల్లో ఒక ప్రసిద్ధ రచయిత్రి, దాన్ని క్షుద్ర రచనగా పేర్కొంటూ అసభ్యమైన భాషతో వ్యంగ్యంగా విమర్శిస్తూ పత్రికల్లో వ్యాసాలు రాసేవారు. అప్పుడొక ఆలోచన వచ్చి, నా భార్య పేరుతో 'వేపమండలు'అనే సీరియల్ రాశాను. పొత్తూరిగారు దాన్ని ఆంధ్రప్రభలో ప్రచురించారు. అది చాలా పెద్ద హిట్ అయింది.

యండమూరి వ్యతిరేకులందరూ ఆ సీరియల్‌ను మెచ్చుకున్నారు. నన్ను విమర్శిస్తూ ఉత్తరాలు రాసిన ఆ రచయిత్రి కూడా ఆంధ్ర ప్రభకు ఫోన్ చేసి, "ఆ అమ్మాయి ఎవరో భలే రాస్తుందండీ! ఆ క్షుద్ర రచయితకు దీటుగా రాస్తోంది" అన్నారట.

ఆ విషయాన్ని పొత్తూరిగారు నాకు చెప్పారు. ఆ తర్వాత అది నేనేనని తెలిసి, అంతగా మెచ్చుకున్నందుకు నొచ్చుకుని, నాలు క్కర్చుకున్నారు.

రచయితగా నా జీవితాన్ని మలుపు తిప్పిన వ్యక్తి ఆంధ్రభూమి సంపాదకుడు కనకాంబర రాజు. ఆ మాటకొస్తే, ఆయన నన్నొక్క డినే కాదు... చాలామంది రచయితలను శిఖరం మీద నిలబెట్టారు. అంతవరకూ కలం పట్టని కొందరి చేత కూడా రాయించి, సాహిత్య రంగంలోకి తీసుకొచ్చిన ఘనత ఆయనది.

'పర్ణశాల'స్క్రిప్టు ఇవ్వడానికి ఒకరోజు ఆంధ్రభూమి ఆఫీసుకు వెళ్లాను. ఆ ఆఫీసు చూడటం అదే మొదటిసారి. అప్పటికే నా 'ఋషి', 'నిశ్శబ్దం నీకు నాకు మధ్య', 'చెంగల్వ పూదండ' నవలలు వివిధ పత్రికల్లో సీరియల్స్‌గా వచ్చాయి. 'పర్ణశాల' నాలుగో నవల.

ఈ నవలను అంతకు ముందు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి తిరస్కరించాయి. కథ సీరియస్‌గా ఉండటం ఒక కారణం కావచ్చు. హీరో సర్వం కోల్పోవడం, భార్య అతన్ని వదిలేయడం, చెల్లెలు వ్యభిచార గృహంలో చేరడం వంటి సంఘటనలు అప్పటి పత్రికా సంపాదకులకు నచ్చకపోయి ఉండవచ్చు.

ఆఖరి ప్రయత్నంగా ఆంధ్రభూమికి తీసుకెళ్లాను.

ఆయన నా కళ్ల ముందే 'పర్ణశాల' చదివారు. చదవడం పూర్తయ్యాక "అద్భుతంగా రాశారు. మీ పేరు?" అని అడిగారు.

"యండమూరి వీరేంద్రనాథ్" అన్నాను.

అక్కడ మొదలైన మా పరిచయం త్వరలోనే గాఢమైన స్నేహంగా మారింది. ఆయన మరణించే వరకు ఆ స్నేహం అలానే, అంత బలంగా కొనసాగింది.

వారపత్రిక కవర్ పేజీ మీద రచయితల బొమ్మలు వేసి, పాఠకులకు ప్రముఖంగా పరిచయం చేసే సంప్రదాయం కనకాంబర రాజుతోనే ప్రారంభమై, దాదాపు ఆయనతోనే ముగిసిపోయింది.

'తులసీదళం', 'వెన్నెల్లో ఆడపిల్ల'వంటి అత్యంత విజయవంతమైన సీరియల్స్‌తో పాటు 'ఆనందోబ్రహ్మ', 'ప్రార్థన'వంటి నవలలను కూడా ఆయన ప్రచురించారు. నా రచనా జీవితంలో కనకాంబరరాజు పాత్రను ఒక్క మాటలో చెప్పాలంటే... ఆయన నాకు కేవలం సంపాదకుడు కాదు; రచయితగా నాలో ఉన్న అవకాశాన్ని గుర్తించి, దానికి విశాలమైన వేదిక ఇచ్చిన వ్యక్తి.

కొన్నికథలు రాసిన తర్వాత నాటక రచనవైపు అడుగులు పడ్డాయి.

వాటిలో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి 'శివరంజని', 'మనుషులొస్తున్నారు జాగ్రత్త', 'రుద్రవీణ', 'కుక్క'.

సినిమా రచయిత అవటానికి ముందుగా నాటక రచయిత కావడం వల్ల కొన్ని ప్రత్యేకమైన సౌలభ్యాలు ఉంటాయి. పాత్ర చిత్రణ, సంభాషణల్లో క్లుప్తత, నాటకీయత, సంఘర్షణ, ప్రీ-క్లైమాక్స్, క్లైమాక్స్ వంటి అంశాలపై సహజంగానే పట్టు ఏర్పడుతుంది. ఆ నాటకానుభవం తర్వాతి కాలంలో సినిమా రచనకు ఎంతో ఉపయోగపడింది.

అప్పట్లో ఆంధ్ర నాటక రంగంలో పోటీతత్వం చాలా ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా రాజమండ్రిలలితకళానికేతన్ (ఎల్.కె.ఎన్) నిర్వహించే నాటక పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు ఉండేది. ఆంధ్ర ప్రదేశ్ నలుమూలల నుంచి ప్రముఖ నాటక బృందాలు వచ్చి పాల్గొనేవి. ఒకరకంగా చెప్పాలంటే, ఆ రోజుల్లో నాటక రంగంలోని ప్రముఖులందరినీ ఒకేచోట చూడగలిగే వేదిక అది.

ఆ పోటీలకు మేము'పుట్ట'అనే నాటకం, 'కుక్క'అనే నాటిక తీసుకెళ్లాం. పరుచూరి 'సమాధి కదుతున్నాం-చందాలు ఇవ్వండి' అనే నాటకం జంధ్యాల 'సంధ్యారాగంలో శంఖారావం'అనే నాటకం తీసుకొచ్చారు. అందులో హీరోయిన్‌గా నటించిన అన్నపూర్ణ (ఉమ) ఆ తరువాత సినిమాల్లో తల్లి పాత్రలతో ఎంతో ప్రసిద్ధి చెందారు. విశాఖపట్నం నుంచి మిశ్రో, గణేష్‌పాత్రో బృందాలు వచ్చాయి. గణేష్ పాత్రో 'పావలా', 'కొడుకు పుట్టాల' వంటి నాటికలు అప్పట్లో మంచి పేరు తెచ్చుకున్నాయి.'పావలా'లో నటించిన శ్యామల 'పావలాశ్యామల' గానే ప్రసిద్ధి చెందారు. ఆలపాటి లక్ష్మి, శివపార్వతి గార్లు కూడా రంగస్థలం నుంచి వచ్చినవారే.

ఆ పోటీల్లో పరుచూరి వెంకటేశ్వరరావు నాటకానికి ప్రధమ బహుమతి, మా 'కుక్క'కు ఉత్తమ నాటిక బహుమతి వచ్చాయి.

అలాంటి పోటీలో బహుమతి రావడం అంటే ఒక షీల్డ్ అందుకోవడం మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా నాటకరంగంలో ఒక రచయిత పేరు వినిపించడానికి అది గొప్ప గుర్తింపు.

ఎవరి నాటకం గెలవాలి, ఎవరి నాటికకు బహుమతి రావాలి అన్న విషయంలో మా మధ్య పోటీ మాత్రం చాలా తీవ్రంగా ఉండేది. కానీ ఆ పోటీ రంగస్థలం వరకే. వ్యక్తిగతంగా పరుచూరి, జంధ్యాల, నేనూ చాలా మంచి స్నేహితులం.

- ✦ ఒకటి కావాలంటే మరొకటి వదులు కోవాలనే విషయం తెలియని మనిషి జీవితంలో పైకి రావటం కష్టం.
- ✦ పీనాసితనం వేరు. డబ్బు పట్ల బాధ్యత వేరు. కోరిక ఉండాలి గానీ, అత్యాశ ఉండకూడదు.
- ✦ నీకెంత డబ్బు ఉన్నదని కాదు. దాన్ని నువ్వు ఎలా ఖర్చు పెడుతున్నావన్నది నీ ఐశ్వర్యాన్ని సూచిస్తుంది.
- ✦ నా చిన్నప్పుడు ఒక కారు కొనుక్కోవాలంటే నాలుగు ఎకరాల పొలం అమ్మాల్సి వచ్చేది. ఇప్పుడు ఒక ఎకరం అమ్మితే నాలుగు కార్లు వస్తున్నాయి. దేనికోసం దేన్ని ఉంచుకోవాలో, దేన్ని పెంచటం కోసం దేన్ని అమ్మాలో తెలుసుకున్నవాడే మంచి బిజినెస్ మాన్.
- ✦ ఐశ్వర్యం వేరు. తృప్తి వేరు. ఐశ్వర్యం వల్ల సుఖం వస్తూండవచ్చేమో కానీ కేవలం ఐశ్వర్యం ద్వారా తృప్తి రాదు.
- ✦ పని చేసే కొద్దీ శరీరం అలసిపోతుందనుకుంటారు చాలామంది. కానీ చేస్తున్న పనిలో ఉత్సాహం ఉంటే జెనెరేటర్ ద్వారా కరెంటు ప్రవహించినట్టు మెదడు ద్వారా శరీరానికి శక్తి ప్రవహిస్తుంది.

దానికి గుర్తుగా ఇప్పటికీ నాకు ఒక రైలు ప్రయాణం స్పష్టంగా గుర్తుంది. అదే ఎల్.కె.ఎన్. పోటీలకు వెళ్లడానికి నేను, పరుచూరి హైదరాబాద్ నుంచి రాజమండ్రికి బయలుదేరాం. అప్పట్లో రైళ్లలో థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్లు ఉండేవి. సీట్లు చాలా తక్కువ; ప్రయాణికులు మాత్రం కిక్కిరిసి పోయి ఉండేవారు.

పరుచూరి కంపార్ట్‌మెంట్ తలుపు దగ్గర ఎలాగో సర్దుకుని కూర్చున్నాడు. నేను తన ఒళ్లో తల పెట్టుకుని కాళ్లు టాయిలెట్లోకి చాపుకుని నిద్రపోయాను. రైలు అర్ధరాత్రి విజయవాడ చేరేసరికి జంధ్యాల కూడా మా ప్రయాణంలో చేరాడు. రాజమండ్రి దాకా తను కూడా ఆ ఇరుకు ప్రదేశంలోనే ప్రయాణించాడు.

నాటకాల కోసం ఊరూరా తిరుగుతూ, దొరికిన చోట కూర్చుని, చోటు లేకపోతే నేలమీద పడుకుని ప్రయాణించిన రోజులవి. ఒకవైపు రంగస్థలం మీద ఒకరిని మించి మరొకరు నిలబడాలనే తీవ్రమైన పోటీ; మరోవైపు రైలులో తలుపు దగ్గరా, టాయిలెట్ పక్కనా ముగ్గురం సర్దుకుని ప్రయాణించే స్నేహం.

అవి సౌకర్యాల కోసం తిరిగిన రోజులు కావు. నాటకం కోసం తిరిగిన రోజులు. పోటీలో ప్రత్యర్థులం; జీవితంలో స్నేహితులం. అదీ నాటకం మీద మాకున్న ప్రేమ. మా స్నేహం కూడా అంతే.

కథ
ఆ ఒక్కటీ అడక్కు

యండమూరి వీరేంద్రనాథ్

రాత్రి ఎనిమిదయింది.

దూరంగా కొండమీద మంచు కురవటం మసగ్గా కనబడుతూంది. వచ్చిన దారి పాములా చీకట్లో కలిసిపోతూంది. చలి వణికిస్తూంది.

సిమ్లా మత్తుగా నిద్రపోవటానికి ఉపక్రమించబోతూంది.

కారుని ఓక్‌ల్యాండ్ స్కూలు పక్కన ఆపాడు రావు.

హేండ్ బ్రేక్ లాగి, క్రిందకు దిగి... చక్రం కింద రాయి పెట్టాడు. జారిపోతే కింద కొండల్లోకే.

"కూలీ సాబ్! "

రావు తలూపి వెనగ్గా వెళ్ళి డిక్కీ తెరిచి రెండు సూటుకేసులూ వాడికి ఇచ్చాడు.

సుమిత్ర కారు ముందుసీట్లో కూర్చొని అంతా చూస్తోంది. ఆమె కోపంగా ఉందని అతడికి తెలియాలని ఆమె తాపత్రయ పడ్తోందని అతడికి తెలుసునని ఆమెకి తెలుసు. అయినా బింకంగానే వుంది.

బింకం ఏమిటి– నిజంగానే ఒళ్ళు మండిపోతూంది ఆమెకి. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అది జరిగినప్పట్నుంచీ ఈ గొడవ ప్రారంభమయింది. ఆ ఊళ్ళో వున్న రెండ్రోజులూ రావుకి ఉపవాసమే.

రావు కిటికీలోంచి చూసి– "దిగు!" అన్నాడు.

"కారు ఇక ఊళ్ళోకి వెళ్ళదు. ఇక్కడ్నుంచి నడిచే వెళ్ళాలి."

ఆమె దిగి, కారు డోరు అతని మొహం మీద చప్పుడయ్యేలా ధడేలున వేసింది. అదిరిపడి దాన్ని పైకి కన్పించకుండా షాల్ ఆమె భుజాల మీద సర్దుతూ "బాగా చలిగా వుంది కదూ?" అన్నాడు.

ఆమె అతడి చెయ్యి విదిలించి ముందుకు నడిచింది కూలీ వెనగ్గా.

రావు ఆగి, జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకొని ఓ క్షణం అలానే నిలబడ్డాడు... లాభంలేదు... ఈ సిమ్లా ట్రిప్పు చాలా బేవార్సుగా ముగియబోతోంది.

అతడు తలెత్తి చూశాడు. ఆకాశం కొద్దిగా మేఘావృతమై వుంది. ఓ కొండ అంచుల్లో ఇళ్ళపైన, కప్పులమీద మంచు తెల్లటి కుచ్చు టోపీలా వుంది. నల్లటి చెట్ల మీద తెలుపు గుర్తు తెలియని చిత్రకారుడి అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌లా వుంది. దూరంగా కొండవంపులో ఓ ఇరవై ఏళ్ళ కుర్రాడూ, పద్దెనిమిదేళ్ళ అమ్మాయి చాలా దగ్గరగా ఒకళ్ళ చేతుల్లో ఒకళ్ళు పాల్ అండ్ మిశ్చర్‌లా నడచి వెళుతున్నారు.

రావ్‌కి తనమీద తనకే జాలేసింది. తొందరగా సుమిత్రని మంచి చేసుకోకపోతే రెండువేలూ గంగలో పోసినట్టే.

ముందు కూలీ సునాయాసంగా పైకి ఎక్కుతున్నాడు. సుమిత్ర వెనుకే నడుస్తూంది. ఆమె పచ్చటి షాల్–ఎర్రటి చీరపైన నల్లని చీకట్లో, తెల్లటి మంచు బాక్‌గ్రౌండ్‌లో అందంగా వుంది. సన్నటి నడుం మీద నుంచి క్రిందికి జారిన చీర హిమాలయాల్లో మందాకిని. బలమైన కోర్కె మనసులో సముద్రకెరటం.

హోటల్ బైట రిసెప్షన్‌లో క్లర్క్ నిద్రలోకి జోగుతున్నాడు. అలికిడికి కళ్ళు తెరిచేడు.

"మిసెస్ అండ్ మిస్టర్ రావ్... రిజర్వేషన్!"

క్లర్క్ ఒకసారి తలెత్తి ఇద్దరివైపూ చూసి రిజిస్టర్ తీసి చూసి పెన్‌తో వ్రాశాడు. రావు సంతకం పెట్టి, కారిడార్‌లోకి నడిచేడు. బోయ్ రూమ్ తలుపు తెరిచాడు.

డబుల్‌రూమ్ ఒక మూల ష్లవంవేజ్, బల్లమీద ఫోన్, రెండు పక్కలు – గార్డెన్‌చైర్ స్ప్రింగ్ ప్యాడ్‌తో సహా.

అతడు సంతృప్తిగా తల పంకించాడు. సుమిత్ర సూట్‌కేస్‌లోంచి చీర తీసుకొని బాత్‌రూంలోకి వెళ్ళింది.



అతడికి మాత్రం నూట అరవయి మైళ్ళు డ్రైవ్ చేసినా అలసటగా లేదు. ఫ్రెష్ యాజ్ రోజెస్. సుమిత్ర ఉడుక్కోవటానికి వున్న శత కోటి కారణాల్లో ఇదొకటి. ఆమె ప్రక్కన అతడు తమ్ముడిలా వుంటాడు.

అతడు బూట్లు విప్పి మంచం క్రిందికి తోసి, కిటికీ తలుపులు తెరచి ఒక్కక్షణం ఏదో అపురూపమయిన దృశ్యాన్ని చూస్తున్నట్టు అలానే వుండిపోయాడు. ఎత్తయిన కొండ ఛాయలో మెలికలు చుట్టుకొని నిద్రపోతున్న కొండచిలువలా వుంది సిమ్లా. భూమిలో బాణాలు పాతినట్లు చెట్లు.

తలుపు చప్పుడయింది.

బాత్‌రూమ్‌లోంచి సుమిత్ర వచ్చింది.

వెనగ్గా వచ్చి భుజం మీద తల ఆన్చి, కిటికీలోంచి బయటికి చూడటం అందమైన అనుభూతి. అతడు ఊపిరి బిగపట్టాడు. ఉహు. ఆమె అడుగుల చప్పుడు దగ్గరవలేదు. పక్కమీద వాలి ఫిల్మ్‌ఫేర్ తీసి చదవటం ప్రారంభించింది.

అతడు కనుకొలుకుల్లోంచి ఆమెని చూశాడు. మంచుకప్పిన పర్వతంలా మోకాలి మీదనుంచి క్రిందికి జారిన షిఫాన్ చీరె కేవలం తనని కవ్వించటం కోసమే.

అతడు దగ్గరగా వెళ్ళి చెయ్యి మీదవేసి "సుమిత్రా!" అన్నాడు.

చెయ్యి విదిలించి కొట్టింది. అతడికి నవ్వొచ్చింది.

"ఎందుకింత పంతం చెప్పు?"

"మీకు మాత్రం ఎందుకంత పంతం?"

"నాకేం పంతంలేదు!"

"అయితే మరెందుకు చెప్పకూడదు?"

ఆ చెప్పదల్చుకొన్నది తల్చుకుంటేనే పొరలు పొరలుగా నవ్వొచ్చింది అతడికి.

అతడు నవ్వడం చూసి ఆమె మరింత ఉక్రోషపడి- "అదిగో! అదే ఒళ్ళు మండుతూంది." అన్నది.

అతడు నవ్వడం మానేసి "సరేలే నవ్వనులే!" అన్నాడు.

"అయితే చెప్పండి" మోచేతి మీద లేచి ఆత్రంగా కూర్చుంది.

"ఏం చెప్పను?"

"అదే... ఎయిర్‌పోర్టులో ఆ అమ్మాయి మీతో ఏమిటన్నది?"

"ఏమీలేదు!"

ఆమె విసురుగా వొళ్ళోంచి తలగడ విసిరికొట్టి మంచంమీద నుంచి లేచి కిటికీ దగ్గరికి వెళ్ళి నుంచుని బయటకు చూసింది.

ఒకవైపు రావుకి ఆమె కోపం చూసి నవ్వొస్తోంది. ఎందుకు చెప్పాలి అని పంతం ఇంకోవైపు. అసలు ఎయిర్‌పోర్ట్‌లో ఆ అమ్మాయెవరో తన ప్రాణం తీయటానికి తనని పిల్చినట్టుంది. ఢిల్లీలో దిగేసరికి సాయంత్రం అయిదయింది. ఎయిర్‌బస్ చాలా రష్‌గా వుంది.

రావూ, సుమిత్రా బ్యాగేజీ కోసం నిలబడ్డారు.

అప్పుడొచ్చింది ప్రళయం.

సుమిత్ర మాటిమాటికి రావువైపు చూస్తోంది.

గ్రే సూట్‌లో అతడు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాడు. అందమైన మగవాడు చూడటానికి బావుంటాడు. కానీ వాడే మొగుడైతే ప్రతి క్షణమూ వాణ్ణి పరిరక్షించుకోవటానికే టైమ్ సరిపోతుందని సుమిత్ర తన పద్నాలుగేళ్ళ వైవాహిక జీవితంలో అనుభవపూర్వకంగా గ్రహించింది.







అందులో ఆ రోజు సూట్‌దీలో అతడు మరీ బావున్నాడు. స్తంభానికి ఆనుకొని నిలబడి సిగరెట్ వెలిగించుకొంటూంటే చూడముచ్చటగా.

అయితే సుమిత్ర అతణ్ణి చూడటంలేదు. అక్కడికి పదిగజాల దూరంలో ఓ చిన్నది చేతిలో పేరుకి పుస్తకం పట్టుకొని, దానిపై నుంచి రావ్‌ని ఓరగా చూస్తోందని గమనించింది.

రావ్‌కి ఆ అమ్మాయి తనని చూస్తూందని కూడా తెలుసు. అందుకే అవసరమైన దానికంటే ఎక్కువ కాన్‌సన్‌ట్రేషన్‌తో వస్తున్న బ్యాగేజీ వైపు చూడసాగేడు.

ఆ అమ్మాయి తన మొగుడివైపు అలా చూడటం సుమిత్రకస్సలు నచ్చలేదు. కొరకొరా చూసింది. అయినా లాభం లేకపోయింది.

అయిదు నిమిషాల్లో బ్యాగేజి వచ్చేసింది.

అవి తీసుకొని బైటకొస్తుంటే ఆ అమ్మాయి చేత్తో దగ్గరగా రమ్మన్నట్టు సైగచెయ్యటం... రావు తననేనా అన్నట్టు చూడటం... ఆ అమ్మాయి తలూపటం... అతడు ఆ అమ్మాయి దగ్గరకి వెళ్ళటం... సుమిత్ర చూస్తుండగానే జరిగిపోయాయి.

ఆ అమ్మాయి నవ్వుతూ ఏదో అనటం–రావు మొహం ఎర్రబడటం–అతడూ నవ్వటం, ఏదో అని వెనక్కి తిరగటం కన్నుమూసి తెరిచేంతలో జరిగిపోయేయి.

భార్య దగ్గరకొచ్చి "పద!" అన్నాడు.

కారు ఇంద్రప్రస్థ మార్గ్‌వైపు వెళుతూండగా సుమిత్ర కంఠాన్ని చాలా క్యాజువల్‌గా పెట్టి– "ఏమిటి ఆ అమ్మాయి అంటున్నదీ?" అంది.

రావు అంతకన్నా మామూలుగా "ఏమీలేదు!" అని అన్నాడు.

"చెప్పకూడదా ఏమిటి?"

"ఏం లేదన్నాగా..."

కారు హోటల్ ముందు ఆగటంతో ఆ టాపిక్ ఆగిపోయింది. అయితే ఆ రాత్రి మళ్ళీ వచ్చింది.



"ఆ అమ్మాయి మీకు... ఇంతకుముందే తెలుసా?"

"ఏ అమ్మాయి?"

"అదే...ఎయిర్‌పోర్టు అమ్మాయి!"

"తెలీదే!"

"మరేం మాట్లాడింది?"

రావుకి అది తల్చుకొంటే నవ్వొచ్చింది.

"ఏంలేదు!" అన్నాడు. మళ్ళీ నవ్వొచ్చింది.

సుమిత్ర వుక్రోషంతో– "చెప్పకూడదేమిటి పెద్ద!" అన్నది అతడి నవ్వు చూసి.

"ఏం లేదంటున్నాగా!"

సుమిత్ర అతడివైపు చిత్రంగా చూసి "ముక్కు మొహం తెలియని పిల్ల దగ్గరకి పిల్చి వూరికే 'హలో హౌ డూ యు డూ?' అన్నదా?"

"నేనబద్ధం చెప్పనన్న విషయం నీకు తెలుసు."

ఆ విషయం మాత్రం నిజం. రావు అబద్ధం చెప్పడు. పెళ్ళవగానే తన పూర్వ పరిచయాల గురించిన వివరాలన్నీ చెప్పాడు. సుమిత్రకి నచ్చిన గుణాల్లో అదొకటి.

"మీరబద్ధం చెప్పరు! ఆ అమ్మాయి మీకు ఇంతకు ముందు తెలీదు. ఆ విషయం ఒప్పుకుంటాను. మరి ఆ అమ్మాయి మీతో ఏం అన్నది?... ఢిల్లీలో ఫలానా చోట వుంటున్నాను... సాయంత్రం రండి!" అన్నది కదూ!"

"కాదు!"

"పోనీ హోటల్ దగ్గర వెయిట్ చేస్తూ వుంటాను అన్నదా?"

రావు నవ్వి "కాదు!" అన్నాడు.

"మరేమన్నది? లిఫ్ట్ ఇమ్మన్నదా?... చెక్ ఇన్ ఎక్కడో అడిగిందా?... ఫ్లైట్ ఎంత ఆలస్యమో అడిగిందా?"

"అవేమీ కావు!"

"మరి?"

రావు చెప్పబోయాడు...

అంతలో "సిమ్లా బానే వుంది. మీతో కంపెనీయే బాలేదు. నేను కొద్దికాలం పుట్టింట్లో వుండాలనుకొంటున్నాను!" అంది.

"నువ్వు చాలా చిన్న విషయాన్ని పెద్దది చేస్తున్నావు!"

"చిన్న విషయమా?... భర్తతో పరాయి స్త్రీ ఏం మాట్లాడిందో తెలుసుకోవాలనుకోవటం చిన్న విషయమా? దాన్ని మీరు దాచిపెట్టి, పైగా అడిగితే నవ్వులాటగా తీసుకొంటారా? ఏం, ఆ మాత్రం హక్కులేదా నాకు? ఇంత చిన్న విషయాన్నే దాచినవారు ఇంకా ఎంత పెద్ద పెద్ద విషయాల్ని దాస్తున్నారో? అదే నాతో ఎవరో అబ్బాయి అలా నవ్వుతూ మాట్లాడితే మీరు సహిస్తారా? చెప్పేవరకూ ప్రాణం తీయరూ? ఒకవేళ చెప్పినా అది నిజమో కాదో అని అనుమానంతో వేధించరూ– నేనేమీ అలా మిమ్మల్ని చంపటంలేదే! సరదాగా అడిగాను. దానికింత రాద్ధాంతం దేనికి? పోనీ ఆ అమ్మాయి మీతో చెప్పింది నాతో చెప్పకూడనిదయితే చెప్పొద్దులెండి– కానీ భార్యా భర్తల మధ్య ఇలాటి చిన్న చిన్న విషయాలే నెమ్మది నెమ్మదిగా వాళ్ళని దూరం చేస్తాయని గ్రహించండి చాలు!"

రావ్ ఆమె వేపు నిదానంగా చూశాడు.

ఆమె కళ్ళు వర్షించటానికి సిద్ధంగా వున్నాయి. రెండ్రోజుల్నుంచీ నిద్రలేనట్టూ మొహం పీక్కుపోయింది.

అతడికి ఒక్కసారిగా భార్య మీద అమితమైన జాలి పుట్టుకొచ్చింది.

"ఓ.కె." అన్నాడు.



"చెప్తాను సరేనా?"

ఆమె తలెత్తి చూసింది.

అతడు కాగితం పెన్నూ తీసుకున్నాడు.

"చాలా సిల్లీగా నీకు అనిపించవచ్చు. కానీ జరిగింది మాత్రం ఇది. మరి దీంట్లో ఆ అమ్మాయి అభిప్రాయం ఏమిటో నాకు తెలియదు"

ఆమె వూపిరి బిగపట్టి "ఏమిటది?" అంది.

"హు- నేను నోటితో చెప్పలేను" అతనికి నవ్వొస్తూంది మళ్ళీ.

ఆ అమ్మాయి అన్నది తల్చుకుంటే చాలు నవ్వొస్తూంది.

"కాగితం మీద వ్రాసిస్తాను చదువుకో, కానీ ఓ షరతు. జరిగింది జరిగినట్టు వ్రాస్తాను. దానిమీద డిస్కషను అనవసరం. 'మీరేం చేశారు, మీరేం అన్లేదా? అని ప్రశ్నలు అడక్కూడదు. సరేనా?"

సుమిత్ర కూడా నవ్వింది.

"సరే, మీరు మీ పంతం వదులుకొని అది చెప్తే, ఐమీన్ వ్రాస్తే- ఇక దాని గురించి ఏమీ అడగనని... మీరు వ్రాయగానే మీరు దాని విషయం మర్చిపోవచ్చుననీ హామీ ఇస్తున్నాను. మనకు పుట్టబోయే పాపమీద ఒట్టు. సరేనా".

రావ్ తలూపి బాత్‌రూమ్‌కి వెళ్ళాడు.

షేవింగ్‌మిర్రర్ కింద వత్తుపెట్టి ఆ అమ్మాయి తనతో అన్నదీ... తను విన్నదీ వివరంగా వ్రాశాడు.

కాగితం అక్కడ పెట్టి రూమ్‌లోకి వచ్చాడు.

సుమిత్ర అతణ్ణే చూస్తూంది.

అతడు రాగానే లేచి నిలబడింది.

అతడు తలూపాడు.

ఆమె లోపలికి వెళ్ళబోయి అతడి దగ్గరగా ఆగింది. చటుక్కున అతడి భుజాల మీద చేతులు వేసి-"రియల్లీ యూ ఆర్ ఎ నైస్ హబ్బీ." అని సుతారంగా ముద్దు పెట్టుకుని లోపలికి వెళ్ళింది.

రావ్ ఊపిరి బిగపట్టి నిలబడ్డాడు. ఆమె లోపల్నించి బయటకొచ్చే క్షణంకోసం, ఆమె ముఖకవళికలు చూడటం కోసం.

నిముషం తర్వాత తలుపు దగ్గర అలికిడి వినిపించింది.

ఆమె వస్తూంది. అతడు టెన్షన్‌తో ఆమె వేపు చూశాడు.

కానీ ఆమె మొహం నిరాశతో పాలిపోయి వుంది.

"నీకు బుద్ధిలేదు రావ్!" అన్నది.

అతడు తెల్లబోయి- "ఏం!?" అన్నాడు.

"కాగితం మీద వత్తు పెట్టొద్దా- అందులోనూ బాత్‌రూంలో!"



రావు చప్పున వంగి ప్రక్కకి చూశాడు.

అతడు వ్రాసిన కాగితం, గాలికి ఎగిరి బాత్ టబ్‌లో నిండుగా పట్టిన నీళ్ళమీద పడవలా తేలుతూంది.

రావు ఆమె వైపు నిజాయితీగా చూశాడు.

"నేను నిజంగా వ్రాశాను!" అన్నాడు.

"చూశాను! అక్షరాలున్నాయి, కానీ అలుక్కు పోయాయి"

"పోన్లే నేనే చెప్తాను... అసలేం జరిగిం దంటే..." చెప్పబోయాడు.

"వొద్దు! ఆ విషయం ఇక మాట్లాడనని పాప మీద ఒట్టు పెట్టుకొన్నాగా!" అంది సుమిత్ర.

(ఆంధ్రప్రభ -1970)

సం.		చిత్రం	పాత్ర
1.	1977	ఒక ఊరి కథ	మాటలు
2.	1980	కుక్క	కథ (నాటిక)
3.	1982	మంచు పల్లకి	మాటలు
4.	1983	అభిలాష	నవల
5.	1984	సంపూర్ణ ప్రేమాయణం	నవల
6.	1984	ఛాలెంజ్	డబ్బు పవర్ ఆఫ్ డబ్బు నవల
7.	1985	రక్త సిందూరం	నవల
8.	1986	కాష్మోరా	'తులసి' నవల
9.	1986	రాక్షసుడు	నవల
10.	1986	ఒక రాధ ఇద్దరు కృష్ణులు	నవల
11.	1987	దొంగ మొగుడు	నల్లంచు తెల్లచీర నవల
12.	1988	ఆఖరి పోరాటం	నవల
13.	1988	మరణ మృదంగం	నవల
14.	1988	త్రినేత్రుడు	స్క్రీన్‌ప్లే
15.	1988	రక్తాభిషేకం	నవల
16.	1989	విక్కీ దాదా	కథ
17.	1989	భలే దొంగ	స్క్రీన్‌ప్లే సహకారం
18.	1989	ముత్యమంత ముద్దు	థ్రిల్లర్ నవల
19.	1990	కొండవీటి దొంగ	స్క్రీన్‌ప్లే సహకారం
20.	1990	జగదేకవీరుడు అతిలోకసుందరి	కథా సహకారం
21.	1990	అగ్ని ప్రవేశం	కథ-దర్శకత్వం
22.	1991	స్టువర్టుపురం పోలీస్ స్టేషన్	కథ-దర్శకత్వం
23.	1992	అశ్వమేధం	స్క్రీన్‌ప్లే సహకారం
24.	1995	బెలదింగల బాల (కన్నడ)	వెన్నెల్లో ఆడపిల్ల నవల
25.	1997	హలో-ఐ లవ్ యూ	వెన్నెల్లో ఆడపిల్ల నవల
26.	1997	ప్రేమ రాగ హాడు గెలతి (కన్నడ)	నిశ్శబ్దం నీకూ నాకూ మధ్య నవల
27.	1997	ప్రియ రాగాలు	స్క్రీన్‌ప్లే సహకారం
28.	2000	ఆజాద్	స్క్రీన్‌ప్లే సహకారం
29.	2001	మృగరాజు	స్క్రీన్‌ప్లే సహకారం
30.	2005	సిరి చందన (కన్నడ)	'అతడు ఆమె ప్రియుడు' నవల
31.	2009	విలేజ్ లో వినాయకుడు	నటన
32.	2009	డైరీ	నటన
33.	2014	అనామిక	స్క్రీన్‌ప్లే సహకారం
34.	2019	కరి కంబళి ఎల్లి మిడినాగ(కన్నడ)	కథ-దర్శకత్వం
35.	2019	దుప్పట్లో మిన్నాగు	కథ-దర్శకత్వం
36.	2022	అతడు ఆమె ప్రియుడు	కథ-దర్శకత్వం

'విజయం అంటే...
సదా నవ్వుతూ ఉండటం....
రేపు కూడా ఇలా నవ్వగలననే
నమ్మకం ఉండటం'.

-యండమూరి

***1967**లో బహుమతి కథ తో మొదలయిన సాహితీ ప్రయాణంలో ఎన్నెన్నో సంచలనాలు...వెన్నెల్లో ఆడపిల్ల థ్రిల్ చేస్తూ ఏడ్పించినా... తులసీదళం భయ పెట్టినా... ఆనందోబ్రహ్మ మనసు మూలల్లో తడి చేసినా...చీకట్లో సూర్యుడు' విశ్వంతరాల్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసినా... అంతర్ముఖంలో మనమేంటో మనకే పరిచయం చేసినా... వ్యక్తిత్వ వికాసానికి మెట్లు వేసినా... ఇన్నీ భావోద్వేగాలను పండించిన ఒకే ఒక్క రచయిత ది ఒన్లీ ఒన్... **డా॥ యండమూరి వీరేంద్రనాథ్!** నవంబర్ 14 న పుట్టిన్రోజుని పురస్కరించుకుని ఈ ప్రత్యేక సంచికని రూపొందించటం జరిగింది. ఆయన భావాలు హాస్యానందం పాఠకులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ప్రముఖ నటులు, దర్శకులు, కార్టూనిస్టులు, రచయితలు, రచయిత్రులు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూ ఈ సంచికలో ప్రత్యేక ఆకర్షణ!*

✦ **తనికెళ్ల భరణి, ప్రఖ్యాత నటులు, రచయిత, దర్శకుడు**

నాటకం రాయడం కష్టమా? సినిమాకు రాయడం కష్టమా?

స: దర్శకుడిని కన్విన్స్ చేయడం కష్టం.

✦ **డా.గుండు సుదర్శన్, సినీ నటుడు**

ప్ర: ప్రశ్నలోనే జవాబు ఉండే ప్రశ్న ఏమిటంటారు? 'జీవితం' అని తాత్వికంగా చెప్పకుండా, హాస్య రసాత్మకంగా చెప్పండి సార్!?

స: "నా సమస్యలకు పరిష్కారంఎవరు చెపుతారు?" అని అడిగితే "నీ మొదటి అక్షరమే నీ ప్రశ్నలోని సమాధానం" అన్నాడట ఆ బౌద్ధ బిక్షువు. ఇంతకన్నా సర్రియలిస్టిక్ హాస్యం ఏమి ఉంటుంది?(వీలయితే ఇదే సంచికలోని 'ఇమ్మెటీరియలిజం' అన్న బాక్స్ ఐటం చదవండి).

✦ **జనార్ధన మహర్షి, రచయిత, దర్శకుడు**

ప్ర: మీరు పాఠకులకు మీ రచనల ద్వారా జ్ఞానం పంచారు, మీ కథల్లో ప్రధానపాత్రలు చాలా స్థితప్రజ్ఞతతో ఉంటారు. వాళ్ళు జీవితంలో సవాళ్లనీ ఎదుర్కొనే విధానం చాలా ఉత్తేజాన్ని కలిగిస్తాయి. మీ నాటకాలలో, నవలలో మీరు వేల పాత్రలు సృష్టించారు. అలాంటి మీరు మిమ్మల్ని ప్రశ్నించుకోవలసినవస్తే?...

స: ఏ ప్రశ్నలూ లేకుండా జీవించే స్థాయికి చేరడమే ఋషి తత్వం... మహర్షీ! మీకు చెప్పేదేముంది.

✦ **బ్నిం, రచయిత, కవి**

ప్ర: సస్పెన్స్ ఉన్న రచనలు రీడర్స్ బాగా చదువుతారు అను కుంటాం. రామాయణం తెలుసున్న కథ అయినా.. ఇంట్రెస్టింగ్‌గా చదవడానికి కారణం అనువాదపు స్కిల్లా... క్యారెక్టరైజేషనా?

స: నాటకీయత, పాత్ర పోషణ, రసానుభూతి, రసరమ్యవర్ణనతో కూడిన ప్రబంధ లక్షణాలు కలిగిన ఇతిహాసం అది! వంట కానికి మూల పదార్థాలు అన్నీ ఒకటే అయినా, కొందరు వంట చేస్తే బాగోదు. అనువాదాలు కూడా అంతే.

✦ **జయదేవ్,కార్టూనిస్ట్**

ప్ర: సంతోషం సగం బలం అంటారు. మీ కామెంట్?

స: సగం కాదు... పూర్తి బలం! మీ జీవితమే మాకు స్ఫూర్తి. యాభై ఏళ్ళ క్రితం మన ఢిల్లీ ప్రయాణం మర్చిపో(లే)ను. ఎప్పుడూ నవ్వుతూ ఉండే మీరే మా ఉదాహరణ జయదేవ్.

✦ **సరసి,కార్టూనిస్ట్**

ప్ర: ఒక ప్రముఖ పత్రిక నిర్వహించిన పోటీలో నా కథకి ఏ బహుమతీ రాలేదు. కనీసం సాధారణ ప్రచురణకు కూడా తీసుకోలేదు. కానీ అదే కథని యధాతథంగా పంపితే వేరే ఒక(ప్రముఖ)పత్రిక నిర్వహించిన పోటీలో మొదటి బహుమతి వచ్చింది. (రెండిటి నిబంధనలు యధాతథం). దీనిని బట్టి రచయితలు ఏం అర్థం చేసుకోవాలి?

స: రామాయణంలో ఒకరికి విషం కనబడింది. ఒకరికి కల్ప వృక్షం కనబడింది. మీరు కూడా రచయిత. కొడుకు అమెరికాలో, కూతురు ఆస్ట్రేలియాలో ఉన్న జడ్జి, 'ఒంటరి తండ్రి' అన్న కథకి బహుమతి ఇస్తాడు. మీరు ఊహించగలరుగా!

✦ **సుధామ, కాలమిస్టు**

ప్ర: క్షుద్ర సాహిత్య రచయిత అని మీ మీద పడిన ముద్రకు మీ స్పందన ఏమిటి?

స: క్షుద్ర జర్నలిస్టుల స్పందనలకు ముద్రలు ఎందుకు మిత్రమా!

'తన మీదకు పడే రాళ్ల నుంచి దూరంగా పారిపోతాడు సామాన్యుడు. వాటితోనే తన చుట్టూ దుర్గం నిర్మించుకుంటాడు మేధావి'.

✦ **డైమండ్ రత్నబాబు, రచయిత, దర్శకుడు**

ప్ర: రైటర్‌గా 100శాతం సక్సెస్ అయ్యారు... డైరెక్టర్‌గా ఎందుకు సక్సెస్ అవలేకపోయారు?

స: పాఠకులకు కావాల్సింది నా దగ్గర ఉంది. ప్రేక్షకులకు కావాల్సింది లేదు. అందుకు!

✦ **ఏవీఎమ్, కార్టూనిస్ట్**

ప్ర: అందరూ ఏ.ఐ.అని ఎగబడుతున్నారు. కొత్త కథలు సృష్టించ గలదా?

స: సొంతంగా సృష్టించలేదండి. మనమే పక్కనుండి ఫీడ్ చేయాలి. నా అనుభవంతో చెప్తున్నాను ఒక కథ రాయటానికి నాలుగు రోజులు పడితే, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా కథ సృష్టించడానికి 40 రోజులు పడుతుంది.(నేను చెప్పేది 'అదే స్థాయి' ఉన్న మంచి కథ సృష్టించటానికి).

✦ **బాచి,కార్టూనిస్ట్**

ప్ర: మీరు మీ కథలు నవలలలో అన్ని నవరసాలు ఎంచుకొని రాశారు కాని పూర్తి స్థాయిలో హాస్యం ఎంచుకొని రాయాలని మీకు ఎప్పుడు అనిపించలేదా?

స: ప్రయత్నించానండి. పాఠకులు భయపడ్డారు. ఆ పుస్తకం పేరు 'తులసీ దళం'.

✦ **కోనే నాగ ఆంజనేయులు, రచయిత**

ప్ర: నాకు తెలిసి మీరు రాసిన మొదటి కథ చందమామలోనే ప్రచురితం. కానీ బాలల సాహిత్యం వైపు కొనసాగకుండా మీరు యితర రచనలైన కథలూ, నవలల వైపు, సినిమాల వైపు మళ్ళడానికి సంభవించిన పరిస్థితులేమిటో కాస్త వివరిస్తారా?

స: మొదట్లో పిల్లల కోసం రాసేవాణ్ణి. ప్రస్తుతం పాఠకులలో ఉండే పిల్లల కోసం వ్రాస్తున్నాను. అంతే తేడా!

✦ **వాడ్రేవు శ్రీనివాస్, కార్టూనిస్ట్**

ప్ర: మీ తొలి నవలల్లో కథాగమనం, ఉత్కంఠ, వ్యవస్థపై తిరుగుబాటు లేదా ఆదర్శాలు ప్రధానంగా కనిపించేవి. కానీ కాలక్రమంలో మానవ సంబంధాలు, మనస్తత్వాల సంక్లిష్టత, జీవన తాత్త్వికత వైపు మీ దృష్టి మళ్లింది. మొదటి నవల రాసినప్పటి యండమూరికి, ఇటీవలి నవల రాసిన యండమూరికి జీవన దృక్పథంలో వచ్చిన అతిపెద్ద మార్పు ఏమిటి?

స: 30 ఏళ్ళ వయసులో 0.2 కళ్ళజోడు వాడే వాడు, 40 ఏళ్ల వయసులో 0.4 వాడతాడు. కాటరాక్ట్ ఆపరేషన్ తర్వాత కళ్ళజోడు మానేస్తాడు. దృక్పథంలో తేడా అదే!

✦ **కామేశ్వరరావు బుద్ధవరపు, రచయిత**

ప్ర: మీ రచనలను ఆదర్శంగా తీసుకుని ఈ తెలుగు నేల మీద ఎంతోమంది కథకులు తయారయ్యారు. మరి మీ కుటుంబం నుంచి మీ రచనా వారసత్వాన్ని ఎవరైనా కొనసాగిస్తున్నారా?

స: యువ రచయితలంతా నా కుటుంబమే.

✦ **సింహప్రసాద్, రచయిత**

ప్ర: మీరు హాస్యం కూడా ఎంతో చక్కగా పండించడం ఆశ్చర్యంగా ఉంది. అభినందనలు. గతంలో రాసిన హాస్య రచనలు ఏమిటి?

స: ఈ సంచికలోనే, నవ్వించటానికి చేసే కథల ప్రయత్నాలు ఉన్నాయి. చదవండి. నా తులసిదళం పై నా పేరడీ 'వేప మండలు' చదివి నవ్వుకోండి.

ఇమ్మెటీరియలిజం

"ఎందుకు నాయనా, అంతగా దుఃఖిస్తున్నావు?" అడిగాడు స్వామి.

"నా కూతురు ఎవడితోనో లేచిపోయింది స్వామీ!"

"ఆమెను ఇంట్లో బాగా తిడుతూ ఉండేవాడివా?"

"తిట్టేవాణ్ణి స్వామీ. కానీ ఆ విషయం మీకెలా తెలిసింది? మీరు దివ్యదృష్టి గల మహానుభావులు."

"ఇంట్లో నువ్వు తిట్టి ఉంటావు.బయట ఎవరో పొగిడేసరికి, వాడి వెంట పోయింది. ఇది తెలుసుకోవడానికి పెద్ద దివ్యదృష్టి అవసరం లేదు నాయనా!"

"తిట్టకుండా ఎలా ఉంటాను స్వామీ? పొద్దున తొమ్మిది గంటల వరకు లేవదు. లేవగానే ఫోన్ పట్టుకుంటుంది. కష్టపడి చదివిస్తుంటే ఒక్క సబ్జెక్టులోనూ పాస్ కాదు."

"నువ్వొక్కడివే తిట్టేవాడివా? మీ ఆవిడ కూడా తిట్టేదా?"

"తిట్టేది స్వామీ. సపరేట్ ఫోన్ కావాలని గొడవ... ఇచ్చేవరకు ఇల్లంతా నరకం చేసింది!"

"ఎప్పుడైనా కొట్టారా?"

"మొన్న స్నేహితులతో పార్టీ అని వెళ్లి డ్రింక్ చేసి వచ్చింది. సిగరెట్ వాసన. గంజాయి కూడా తాగిందని అనుమానం."

"ఇంటిని పెంటపెంట చేసింది అన్నమాట."

"అంతే స్వామీ!"

"ఆ పెంటను ఇంకెవడో తీసుకెళ్లి తన ఇంటిముందు కళాపి జల్లి ముగ్గుగా వేసుకున్నాడు. సంతోషించాలి గానీ, ఏడుస్తున్నావు ఎందుకు నాయనా?"

"అదేమిటి స్వామీ! సొంత కూతుర్ని కని, పెంచి పెద్ద చేసినవాళ్లం. బాధ ఉండదా?"

"నువ్వు పెంచి పెద్ద చేయలేదు నాయనా... నికృష్టంగా పెంచి దరిద్రంగా తయారు చేశావు. అందుకు సిగ్గుపడాలి! నీ ఇంటి చెత్తను మరొకడు తీసుకెళ్లినందుకు ఆనందపడాలి!"

"స్వామీ... మీరు సర్వసంగపరిత్యాగిలా లేరు. మూర్తీభవించిన మెటీరియలిస్టులా ఉన్నారు!"

"రెంటికీ తేడా లేదు నాయనా! ఒకడు అన్నీ వదులుకుంటాడు. మరొకడు... పనికిరానివి పట్టుకుని ఏడవడు!" నవ్వాడుస్వామి.

✦ **రామ్‌శేషు, కార్టూనిస్ట్**

ప్ర: సర్, మీరు 'తులసిదళం', 'వెన్నెల్లో ఆడపిల్ల' లాంటి నవలల్లో భయాన్ని, మనిషి మనసులోని చీకటి కోణాల్ని ఎంత బాగా రాశారు. మీరు జీవితంలో అత్యంత భయపడిన క్షణం ఏది, ఆ భయం నుంచి మీరు ఏం నేర్చుకున్నారు?

స: 'అత్యంత భయపడిన క్షణం?': చెప్తే మీ గుండె ఆగిపోతుంది. 'ఆ భయం నుంచి మీరు ఏం నేర్చుకున్నారు?' : దాన్ని ఎవరికీ చెప్పకూడదని.

✦ **వందన శ్రీనివాస్, కార్టూనిస్ట్**

ప్ర: 'నిజాయితీగా చెబుతున్నా కార్టూనిస్టులంటే నాకు ఎంతో గౌరవం, రచయితగా ఒక కార్టూనిస్ట్ పడిన కష్టంలో మేం సగం కూడా పడమనీ' మీరు 'కొంటెబొమ్మల బ్రహ్మలు' పుస్తక ముందుమాటలో రాశారు. అది చదివి ఒక కార్టూనిస్ట్‌గా ఉబ్బి తబ్బిబ్బయ్యాను...ఆ నాలుగు వాక్యాలు నన్ను చాలా ఉత్తేజపరిచాయి.. ఈ సందర్భంలో మీకు నా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ప్రస్తుత సమాజంలో ఎలాంటి అంశాలపై మేం కార్టూన్లు వేస్తే బావుంటుందో తెలుపగలరు.

స: మంచి కార్టూన్లు రెండు రకాలు. చూడగానే నవ్వు రావడం ఒక పద్ధతి. 'ప్రసిద్ధ' అనే కార్టూనిస్టు వేసే బొమ్మల్లాగా 'అబ్బ భలే ఉందే' అనుకోవటం మరొక పద్ధతి. నాకు రెండు ఇష్టమే.

✦ **వడ్డేపల్లి వెంకటేశ్, కార్టూనిస్ట్, బాలకథారచయిత**

ప్ర: నేను మీ రచనలకు అభిమానిని. నేటి తరం పూర్తిగా సామాజిక మాధ్యమాలకు బానిసలు అయి, పుస్తకాలు చదవడం మరిచిపోయారు.వారికి మళ్ళీ పుస్తక పఠనం అలవాటు చేయడం సాధ్యం అవుతుందా? అలాగే ఎవరైనా ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా నవలలు రాస్తే పాఠకుల నుండి ఆదరణ దక్కుతుందా?

స: మారుతున్న కాలంలో మార్పు సహజం. మనసుని సంతోషపరిచే ప్రక్రియలు బోలెడు మాధ్యమాలలో వస్తున్నప్పుడు, ప్రజలు మళ్లీ పుస్తక పఠనం వైపు వెళ్లడం కష్టమే. చేదు వాస్తవం ఇది.

✦ **చక్రవర్తి, కార్టూనిస్ట్**

ప్ర: ఈ రోజు ఏఐ ఒక కథను రాయగలదు, కవితను సృష్టించగలదు, ఒక రచయిత శైలిని కూడా అనుకరించగలదు. మీలాంటి అనుభవజ్ఞుడైన రచయిత దృష్టిలో ఏ ఐ ఎప్పటికీ

భర్తీ చేయలేని 'మానవ రచయిత ప్రత్యేకత' ఏమిటి?

స: మనసు!

✦ **జి.ఎస్.ఆర్, కార్టూనిస్ట్**

ప్ర: మీకు నచ్చిన ఒక కార్టూన్ చెప్పండి... ఏ భాషలోనైనా?

స: నేను తీసిన రెండు సినిమాలు.

✦ **సుధాకరరావు పెండేల, కార్టూనిస్ట్**

ప్ర: మీరు యిప్పుడు వ్రాయడం తగ్గించడానికి కారణం?

స: నేను రాయటం తగ్గించ లేదండి. మీరు చదవటం తగ్గించారు. ఏడాదికి రెండు వ్రాస్తూనే ఉన్నా.

✦ **వేలూరి ప్రమీలా శర్మ, రచయిత్రి**

ప్ర: "దెయ్యాలు శ్మశానంలో ఉండవు, మనిషి మనసులోనే ఉంటాయి, భయం అన్న పేరుతో..." మీ రచనా శైలిలో ఒదిగిన సత్యం ఇది. క్షుద్ర పూజలతో మానసిక స్థితి మీద ప్రభావితం చేసేలా సాగిన మీ 'తులసి దళం' నవలకు ప్రేరణ ఏమిటి సార్?

స: ఒక్కొక్క రచనకి ఒక బ్యాక్ డ్రాప్ తీసుకోవటం నా పద్ధతి... ప్రార్థనకి 'క్యాన్సర్'. పర్ణశాలకు 'రొయ్యలు'. వెన్నెల్లో ఆడపిల్లకి 'టెలిఫోన్స్'. అలాగే తులసిదళానికి 'దెయ్యాలు'. దానికి ప్రేరణ, చందమామ కథలు.

✦ **టి.ఆర్.బాబు, కార్టూనిస్ట్**

ప్ర: సార్ మీకు నచ్చిన హాస్య సంభాషణ లేక ఛలోక్తి ఒకటి చెప్పండి.

స: 'సంధికీ- సమాసానికి, అనుస్వరానికి- అలంకారానికి, గురువుకి- లఘువుకి తేడా తెలియని-తెలుగు సరిగ్గా రాని- భాష పరిపూర్ణం కాని నన్ను... రచయితను ఎలా చేశావు తల్లీ' అని అడిగాను. 'నువ్వో రచయితవని భ్రమపడే అజ్ఞానం కూడా ఇచ్చానుగా' అంది సరస్వతి. ఇదే ఈ మధ్య మా మధ్య జరిగిన హాస్య సంభాషణ.

✦ **వసుంధర, రచయి(త్రి)త**

ప్ర: అటు సామాజిక స్పృహనూ, ఇటు ఉత్కంఠనూ సమతూకం చేస్తూ- అట్టడుగు నుంచి అంతెత్తువారి దాకా అందర్నీ స్పృశించే వాస్తవిక అంశాల్ని- అనూహ్య సన్నివేశాలతో, అపూర్వ పాత్రచిత్రణతో-అద్భుత కథారూపంలో ఆవిష్కరించిన అసాధారణ రచయిత మీరు. మీ కథలకు మీరు ఎన్నుకునే పేర్లు కూడా అర్థవంతం, ఆకర్షణీయం. ప్రస్తుతం సమకాలీన వ్యవస్థలో మెరుగైన పాలన కోసం ఆక్రోశిస్తున్న అభిజీత్‌దీప్కే ఆరంభించిన ఉద్యమాన్ని కథాంశంగా తీసుకుంటే-అతడు స్థాపించిన పార్టీకి మీరైతే ఏ పేరు పెడతారు?

స: తెలియని విషయాల్లో వేలు పెట్టను గురువుగారూ!... రాక్షసుడు, ఇంకా చాలా నవలల్లో మెరుగైన పాలన గురించి వ్రాసాను. కానీ వాస్తవంగా అది ఏ దేశంలో ఉందో, ఎలా వస్తుందో తెలియదు. తెలియని విషయం గురించి, అప్రస్తుతమైనా ఒక విషయం. ఆ రోజుల్లో.... దేముడు-దేవుడులో ఏది కరెక్టో, ఏది ఎప్పుడు వాడాలో తెలియని రోజుల్లో... మీరే నన్ను సరిదిద్దారు. మీకు గుర్తుందా?

✦ **బీవీఎస్ ప్రసాద్, రచయిత, కార్టూనిస్ట్**

ప్ర: మనం చేసిన పని ఒకోసారి మనకే నవ్వు తెప్పిస్తుంది. మీలో మీరు ఇటీవల నవ్వుకొన్న ఒక ఘటన మాతో పంచుకోరూ!

స: మొన్న రవీంద్రభారతిలో ఒక ఫంక్షన్‌కి చీఫ్ గెస్ట్‌గా వెళ్లాను. గౌరవంగా తీసుకెళ్ళి స్టేజ్ మీద కూర్చోబెట్టారు. సగం మీటింగ్ అయ్యాక తెలిసింది-నేను వెళ్లాల్సింది పై అంతస్తులోని కాన్ఫరెన్సు హాల్లో మీటింగ్‌కి అని.

✦ **నాగ్రాజ్, కార్టూనిస్ట్**

ప్ర: కార్టూన్ అంటే చిత్రము, సాహిత్యం రెండింటి కలయిక... మరి కార్టూన్ పుస్తకాలకి సాహిత్య హోదా దక్కక పోవడానికి కారణం ఏమిటి?

స: సాహిత్య హోదా అంటే ఏమిటో నాకు అర్థం కావటం లేదండి. నా చేతిలో అధికారం ఉంటే కార్టూనిస్టులకు కూడా జ్ఞానపీఠ అవార్డు ఇవ్వాలని ప్రపోజ్ చేసే వాడిని. ఒక కథకుడు, నవలాకరుడూ కన్నా, ఆలోచనల్లో కార్టూనిస్టు ఏ మాత్రం తీసిపోడు అని మనస్ఫూర్తిగా నమ్మేవాడిని నేను.

✦ మొదటి రోజు సినిమా టికెట్ దొరికింది. సంతోషం. పిల్లలకు ఫస్ట్ ర్యాంకు వచ్చింది సంతోషం. ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. లేదా వ్యాపారంలో లాభం వచ్చింది. సంతోషం. కొత్తగా ఇల్లు కట్టడం జరిగింది. సంతోషం. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక సంతోషం కలుగుతూ ఉంటేదాన్ని 'ఆనందం' అంటారు.

✦ ఎదుటివాడు ఇల్లు కట్టుకున్నా సంతోషంగా... ఎదురింటావిడ ఖరీదైన నెక్లెస్ కొనుక్కున్నా సంతోషంగా ఉండగలిగితే దాన్ని 'ఆత్మానందం' అంటారు.

✦ **పి.వి.రామశర్మ, రచయిత, కార్టూనిస్ట్**

ప్ర: మాతృభాషా దినోత్సవం రోజునాడు తెలుగు భాషను రక్షించుకుందాం అంటూ అనేక సభలు, సమావేశాలు సంస్థల తరఫున, ప్రభుత్వాల తరఫున జరుగుతుంటాయి. కానీ తెలుగు నేర్పడం అన్నది ప్రభుత్వ పాఠశాలల్లో తప్ప కార్పోరేట్ పాఠశాలల్లో దాదాపు పోయింది. ఈ కాలం పిల్లలకు, తల్లిదండ్రులకు కూడా తెలుగు పట్ల మక్కువ ఆసక్తి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్ళీ తెలుగుకు పూర్ణ వైభవం వస్తుందంటారా?

స: భలే అమాయకులండి మీరు.

✦ **కన్నాజీరావు, కార్టూనిస్ట్**

ప్ర: 'తులసిదళం', 'వెన్నెల్లో ఆడపిల్ల' వ్రాసిన మీరు... 'విజయానికి ఐదు మెట్లు" లాంటి వ్యక్తిత్వ వికాస పుస్తకాలు కూడా వ్రాశారు. జీవితంలో విజయం సాధించడానికి 'హాస్యం' ఎంతవరకు దోహదపడుతుంది?

స: నాలుగు వందల పేజీల 'విజయానికి ఐదు మెట్లు' పుస్తకంలో నాకు అద్భుతంగా నచ్చిన వాక్యం: 'విజయం అంటే సదా నవ్వుతూ ఉండటం. రేపు కూడా ఇలా నవ్వగలననే నమ్మకం ఉండటం'.

✦ **నందు,కార్టూనిస్ట్**

ప్ర: మీ కాలంలో నవలలు చదివే సంస్కృతి ఎక్కువగా ఉండేది. నేడు డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ప్రభావంతో ఆ వాతావరణం మారింది కదా! నేటి యువత పుస్తక పఠనం వైపు మళ్లేలా చేయడానికి రచయితలు, ప్రచురణకర్తలు ఎలాంటి మార్పులు తీసుకోవాలి?

స: ఉద్యమంలా వెళ్ళి, పిడికిలి బిగించి, కొడవళ్ళు పట్టుకొని సెల్ ఫోన్లు, టీవీలు బద్దలు కొట్టాలి.

✦ **తెలికిచెర్ల విజయలక్ష్మి, రచయిత్రి**

ప్ర: మీ కలం నుంచి వెన్నెల్లోఆడపిల్ల లాంటి మధురమైన మరొక నవల వస్తే చదవాలని ఆశగా ఉంది. వచ్చే అవకాశం ఉందా గురువుగారూ??

స: అవకాశం లేదు తల్లి. అలా రాయాలంటే కాసింత అమాయకత్వం, బోలెడంత భావుకత్వం ఉండాలి

✦ **వడలి రాధాకృష్ణ, రచయిత**

ప్ర: ఈ తరంలో మీరు గొప్ప గర్వింపదగిన నవలా రచయిత మేమందరము కూడా మీ అభిమానులం ఇక్కడ ఒక ప్రశ్న యండమూరి వారి నవల సినిమాగా తీయాలంటే వేరే స్క్రీన్‌ప్లే అవసరం ఉండదు. ఆ నవలే ఒక స్క్రీన్‌ప్లే లాగా మాకు ఉపయోగపడుతూ ఉంటుంది అని ఒక గొప్ప సినీ డైరెక్టర్ గారు అంటుంటే నేను విని ఉన్నాను సార్! ప్రతి నవల కూడా సినిమాను దృష్టి పెట్టుకుని దానికి ఉపయోగ పడే రీతిలో ఒక స్క్రీన్‌ప్లే లాగా రాసుకుంటూ వెళ్తారా?

స: ఒక్కొక్క రచయితకి ఒక్కొక్క శైలి, శిల్పము ఉంటాయి సార్. వీలైనంత వరకూ దృశ్యాన్ని చూపించడం నా టెక్నిక్. నవల స్క్రీన్‌ప్లే లాగా ఉండటం వేరు. సినిమా కోసం రాయటం వేరు. ఇంతవరకు నేను రాసిన ఏ నవల కూడా అదే విధానంలో సినిమాగా తీయబడలేదు. చాలా మార్పులు జరుగుతాయి. మంచి ఉదాహరణలు: ఛాలెంజ్. రాక్షసుడు.

✦ **కంథ్లకుంట శరత్‌చంద్ర, రచయిత**

ప్ర: మీరు నవలల్లో విలన్లు, హీరోలకు కఠినమైన పొడుపు కథలు, పజిల్స్,ఛాలెంజులు ఇస్తుంటారు. నిజ జీవితంలో, మీకెప్పుడైనా అలాంటి 'ఛాలెంజ్' ఎదురైందా?

స: నాకే కాదు అందరికీ అవుతుంది. దాన్ని 'పెళ్లి' అంటారు.

✦ **సాయికృష్ణ, కార్టూనిస్ట్**

ప్ర: సార్! తులసిదళం, తులసి వంటి నవలలతో–మూఢ నమ్మకాలు వర్సెస్ యదార్థలతో ఎంతో విజ్ఞానం పాఠకులకు రుచి చూపించారు. మరి విశ్వాంతరాలలో–ప్రాణుల ఆచూకి వంటి సబ్జెక్ట్‌తో ఓ రుచి చూపించే ఆలోచన ఏమైనా వుందా?

స: 'చీకట్లో సూర్యుడు' అలాంటి నవలే కదా!

✦ **రాగతి రమ, రచయిత్రి**

ప్ర: ఇప్పటి వరకు మీరు ఎన్నో రచనలు చేసారు అందులో మీకు బాగా నచ్చిన కథ గాని నవల గాని ఏది రాసినపుడు మీకు థ్రిల్లింగ్‌గా అనిపించింది? ప్రస్తుతం మీ రచనలు విరివిగా రావడం లేదెందుకు?

స: ప్రతి రచన థ్రిల్లింగ్‌గానే ఉంటుందండి. ఈ ప్రశ్నకి సమాధానం ఇవ్వటం కూడా థ్రిల్లే. అలా లేకపోతే ఎందుకు వ్రాయటం? ఇక మీ రెండో ప్రశ్న. ఏడాదికి రెండు నవలలు రాస్తానండి. 40 సంవత్సరాల్లో 80 పుస్తకాలు వ్రాశాను. ఈ సంవత్సరం ఒకటి వ్రాశాను. ఇంకోటి రాస్తాను. లెక్క సరిపోయిందా?

✦ **పద్మ, కార్టూనిస్ట్**

ప్ర: ఒక నవల వ్రాయడానికి ఎక్కువ ఇష్టపడతారా?... ప్రసంగించడానికి ఇష్టపడతారా?

స: ఊళ్లు తిరుగుతూ ప్రసంగాలు ఇవ్వటం మొదటి నుంచీ అస్సలు ఇష్టం లేదండి. మొదట్లో బ్యాంకు ఉద్యోగం, ఆపై సినిమాలు, ఆ తర్వాత ప్రసంగాలు– కాసిన్ని డబ్బులు కోసం చేయక తప్పలేదు. నిజం చెప్పమంటారా? సినిమాల్లో ఒకరి కింద పని చేయడం కూడా ఇష్టం లేదు. లక్ష్మి కన్నా సరస్వతే ఇష్టం. కానీ... యుద్ధం ప్రారంభమయ్యే ముందు ధర్మరాజు భీష్ముని ఆశీర్వాదం తీసుకోవడానికి వచ్చిన సందర్భంలో భీష్మ పర్వంలో **'అర్థస్య పురుషో దాసో దాసస్త్వర్థో న కస్యచిత్'** (ధనం వల్లనే నేను కౌరవులకు బంధితుడ నయ్యాను) అంటాడు భీష్ముడు. తెలుగులో చెప్పాలంటే: మనసొప్పని పనైనా ఒక్కోసారి పొట్ట కోసం తప్పదు.

✦ **వడ్లమన్నాటి గంగాధర్, రచయిత**

ప్ర: మీరు వ్రాసిన కథల్లో, ఈ కథను నవలగా వ్రాస్తే బావుండేది అని అనిపించిన కథ ఏదైనా ఉన్నదా? ఉంటే అది ఏ కథ? ఎందుకో తెలియజేయగలరు.

స: లేదండి. అలాంటిదేమీ లేదు. పోతే ఇది వ్రాయకపోతే బాగుండేది అనిపించిన నవలలు కొన్ని ఉన్నాయి.

✦ **ఆర్.సి. కృష్ణస్వామి రాజు, రచయిత**

ప్ర: మూడు దశాబ్దాల ముందు మీరు ఒక రచనలో ఆడ వాళ్ళందరూ 'జెంటిల్' గా ఉంటారని రాసినట్లు గుర్తు... ఇప్పుడు కూడా ఆ స్టేట్‌మెంట్‌ని సమర్థిస్తారా?

స: ఎక్కడ వ్రాశాను? గుర్తు లేదండీ. ఒకవేళ వ్రాసి ఉంటే, ఇప్పుడు మారుస్తాను: 'మగవారు కూడా జెంటిల్మెన్ ముసుగు వేసుకుంటారు' ఓకేనా?

✦ **ప్రసిద్ధ, కార్టూనిస్ట్**

ప్ర: మీ నవలల టైటిల్స్, క్యారెక్టర్స్ చాలా విభిన్నంగా ఉంటాయి. ఉదాహరణకు 'అష్టావక్ర' (మచ్చుకి ఒకటి) నవలనే తీసు కుంటే...ఆ టైటిల్ వినగానే పాఠకుల్లో ఒక రకమైన క్యూరి యాసిటీ పెరుగుతుంది. అసలు కథ రాసేటప్పుడే ఇలాంటి విలక్షణమైన టైటిల్స్, క్యారెక్టర్స్ మీ మైండ్‌లోకి ఎలా వస్తాయి? నేటి తరం రచయితలు లేదా సినిమా దర్శకులు టైటిల్స్ విషయంలో అంతగా శ్రద్ధ పెట్టడం లేదనే విమర్శ ఉంది. ఒక కథకు లేదా నవలకు 'టైటిల్' ఎంత ముఖ్యం అని మీరు భావిస్తారు?

స: నవలకే కాదు. పాత్రలకి కూడా టైటిల్ చాలా ముఖ్యం! 'నిహారిక సన్నజాజులు కోస్తూ ఉండగా మనవరాలు వచ్చి– "నాయనమ్మ! తాతయ్య పిలుస్తున్నాడు" అంటే బాగోదు కదా! అది పక్కన పెడితే, మీ కార్టూన్లు చాలా ఆలోచింప చేస్తాయి. కంగ్రాట్స్!

✦ **శ్రీనివాస్(శ్రీ), కార్టూనిస్ట్**

ప్ర: సర్ మీ అంతర్ముఖం నవలకు ఇప్పుడు సుమారు 35 ఏళ్ళ వయసు... ఈ సుదీర్ఘ కాలంలో ప్రేమ పై అప్పటి మీ definition / openion లో ఏదైనా మార్పు వచ్చిందా?

స: లేదండి. రాదు. రాలేదు ! మనిషి బ్రతికే విధానం– బ్రతకా లను కునే విధానం వేర్వేరుగా ఉన్నంత కాలం... నా అంతర్ముఖంలో మార్పు ఉండదు.

✦ **కోలపల్లి ఈశ్వర్, రచయిత**

ప్ర: రచనలకోసం అవిశ్రాంతంగా పని చేసిన మీ మెదడు, మనసు, మీ చేతిలోని కలం–ఈ మూడు తృప్తి చెందాయా? మరచిపోయాను మీ జేబు కూడానండోయ్!

స: పదేళ్ల క్రితమే జేబు సంతృప్తి చెందటం మొదలైంది. అప్పటి నుంచే ఇవ్వటం మొదలు పెట్టాను. ఇక కలం అంటారా? వేళ్ళు కదిలే వరకు అది ఆగదు.

✦ **శేఖర్, కార్టూనిస్ట్**

ప్ర: మీరు స్థాపించిన సరస్వతి విద్యాపీఠం రెండు దశాబ్దాలు గడిచిపోయింది ఇన్నేళ్ల కాలంలో మీరు గర్వపడేలా ఉన్నత శిఖరాల అందుకున్న వ్యక్తులు ఎవరైనా మీరు సంతృప్తి పడేలా మీకు తారసపడ్డారా?

✦ మిన్ను విరిగి మీద పడుతున్నా చెదరని ధైర్యం రావాలంటే నువ్వు చేసిన పనిలో ఏ తప్పూ లేదన్న నమ్మకం నీకుండాలి.

✦ మనిషి జడుడైనంతకాలం ఎంత సుఖవంతమైన జీవితమయినా వ్యర్థం. మనిషిలో చైతన్యానికి పునాది 'ఆలోచన'. అది కేవలం మెదడులో నిక్షిప్తమై ఉంటే నిష్ప్రయో జనమే. భావాలను బంధించేకొద్దీ అవి అంతర్మధ నాలై బాధపెడతాయి. పదిమందితో పంచుకుంటే జ్ఞానం పెరిగి అమూల్య సంపద అవుతుంది.

✦ తప్పుని వెంటనే పట్టుకోవటానికి ఆత్రపడే జనం, ఒప్పుని అంత త్వరగా ఒప్పుకోరు.

✦ మనం ఒకోసారి ఓడిపోవచ్చు. మానసికంగా చాలా బాధపడవచ్చు. కానీ అక్కడి నుంచి తిరిగి జీవితాన్ని ప్రారంభించి మనం విజయం సాధించాలి. అలా సాధించిన వాళ్లే గొప్ప వాళ్లయ్యారు.

స: ఇది బడి కాదండి... గుడి! గిరిజన పిల్లలు వచ్చి నాతో కొంతసేపు ఉంటారు (ఉండేవారు). అంతే!

✦ **శేషగిరీ, కార్టూనిస్ట్**

ప్ర: ఒక యువ రచయిత 'రచనావ్యాసంగాన్ని' వృత్తిగా ఎన్ను కోవడం మంచిదేనా?

స: కష్టం! చాలా కష్టం!! హాబీగా ఉంచుకోవడం ఆరోగ్యకరం.

✦ **తోపల్లి ఆనంద్, కార్టూనిస్ట్**

ప్ర: మీరు కథలు, నవలల రూపంలో యెన్నో పాత్రలు సృష్టించి పాఠకులను రంజింపచేశారు కదా...వాటిల్లో ఏ పాత్రయినా మిమ్మల్ని బాగా ప్రభావితం చేసిందా?

స: లేదు...నేనే తోమి తోమి నాకు కావలసిన విధంగా వాటిని ప్రభావితం చేస్తాను.

✦ **నాగిశెట్టి,కార్టూనిస్ట్**

ప్ర: సార్, అప్పటిదాగా "ఎడమ చేతిలో సిగిరేట్, కుడి చేతిలో స్టీరింగ్, రింగు రింగులుగా పొగ వదులుతున్న' హీరోల చుట్టూ తిరుగుతున్న నవలల దిశ దశ మీ తులసీదళంతో గొప్ప మలుపు తిప్పిన మీరు 'విజయానికి 5 మెట్లు' వంటి అద్భుతమైన వ్యక్తిత్వ వికాస గ్రంథాల వైపు మీ రచనా ప్రయాణాన్ని విజయవంతంగా మళ్లించారు. సాహిత్య సృష్టి నుంచి ఈ దిశగా అడుగులు మార్చడానికి, యువతకు సరైన దారి చూపించాలనే ఆలోచన వైపు మిమ్మల్ని నడిపిం చిన ప్రేరణ ఏమిటి సార్?

స: పుస్తకాల్లో పల్ప్ మెటీరియల్ చదవటం కన్నా, వంట చేసు కుంటూ టీవీ చూడటం మరింత ఆహ్లాదకరమని పాఠకులు, (ముఖ్యంగా గృహిణులు) ఎప్పుడైతే నమ్మారో, అప్పుడే నా దారి మార్చుకున్నాను నాగిశెట్టిగారూ! మనసుకు ఆహ్లాదం ఇచ్చేదాని కన్నా మెదడుకు ఉపయోగపడేది వ్రాస్తే, ఎక్కువ మందికి చేరుతుందన్న అభిప్రాయంతో ఆ వైపు మళ్లాను.

✦ **హాస్యబ్రహ్మ శంకర నారాయణ**

ప్ర: యండమూరి వీరేంద్రనాథ్ గారూ! మీరు కొత్త నవల హాస్య దళం ఎప్పుడు రాస్తారు?

స: మీరు చూపుడువేలు పెడితే నేను బొటనవేలితో కలాన్ని పట్టుకుంటాను. ఇద్దరం కలిసి వ్రాద్దాం! మీకన్నా హాస్యబ్రహ్మ ఎవరు? హాస్యం కొమ్మ మీది... అంచున దళం నాది!

✦ **గోపాలకృష్ణ, కార్టూనిస్ట్**

ప్ర: మీ 'విజయం వైపు పయనం' పుస్తకం లక్షలాది మంది యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈనాటి డిజిటల్ యుగంలో సోషల్‌మీడియా, డిస్ట్రాక్షన్స్ (శ్రద్ధ భంగం) మధ్య నలిగిపోతున్న నేటితరం 'విజయం సాధించడానికి' మీరు ఇచ్చే అతిముఖ్యమైన సలహా ఏమిటి?

స: నలిగిపోతున్న పుస్తకం తరానికి చదివే సమయం ఎక్కడుం దండి?... వారి కోసం వ్రాయటం... సలహాలు ఇవ్వటం సమయం వృథా!... విజయం అంటే వాళ్ల దృష్టిలో అర్థం వేరే.

✦ **పోపూరి విశ్వనాథ్, రచయిత, విమర్శకుడు**

ప్ర: మీరు బాల్యం నుంచే కథలు / రచనలు మొదలుపెట్టారా? లేదా ఆ తరువాత, నవలలలే మొదలుపెట్టారా? మీ రచనా వ్యాసాంగానికి స్ఫూర్తి ఏమిటి / ఎవరు?

స: నేను కథారంగంలోకి ఎలా వచ్చాను, నాటకాలు ఎప్పుడు వ్రాశాను అన్న వివరాలన్నీ మరో రెండు నెలల్లో వెలువడ బోతున్న నా కొత్త పుస్తకం 'వెండి గడపకి పసుపు తోరణం'లో ఉంటాయండి.అవన్నీ ఇక్కడే చెప్తే రెండు పేజీలు తినేస్తాయి!

✦ **కృష్ణ వల్లూరి, కార్టూనిస్ట్**

ప్ర: యండమూరి గారూ, ఒక మనిషి జీవితాన్ని మార్చేది అతను చదివిన గొప్ప పుస్తకమా, అతను ఎదుర్కొన్న చేదు అను భవమా, లేక అతను తీసుకున్న ఒక కీలక నిర్ణయమా? మీ జీవితానుభవం ఏం చెబుతోంది?

స: నా జీవితంలో చేదు అనుభవాలేమీ లేవండి. నా జీవితాన్ని మార్చేసిన పుస్తకాలు కూడా నేనేమీ చదవలేదు. ఆనందంగా ఉండటానికి ఏం చేయాలో అవన్నీ చేస్తూ వచ్చాను. నా జీవితానుభవం నేర్పింది మూడు విషయాలు: సంతోషం కోసం నిరంతరం పని చేస్తూ ఉండటం; ఆర్థికంగా సింగిల్ బెడ్రూమ్ నుంచి స్విమ్మింగ్ పూల్ దాకా ఎదగటం; ఆపై తాపత్రయాన్ని వదులుకోవటం.

✦ **రాము, హాస్యానందం**

ప్ర: మీరు ఎంతగానో ఆనంద పడిన సందర్భాలు ఒకటి రెండు చెప్పండి. తొలి కమర్షియల్ సినిమా 'అభిలాష' సక్సెస్సా? సాహిత్య అకాడమీనా? పది లక్షల తెలంగాణా ప్రభుత్వ రఘుపతి వెంకయ్య అవార్డా?

స: ఇది కాస్త స్వాత్కోర్షలా కనపడినా, ట్యూషన్ లేకుండా నాలుగు సంవత్సరాల చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సు మూడు సంవత్సరాల్లో పూర్తి చేయడం. ఖమ్మంలో ఏడో క్లాస్ చదు వుతూ, నాలుగో క్లాస్ పిల్లలకు ట్యూషన్ చెప్పి సంపాదించిన మొదటి ఐదు రూపాయల నెలజీతం.

యండమూరి వీరేంద్రనాథ్ పుస్తకాలు

నాన్ ఫిక్షన్

1. రన్ దీప్తీ రన్
2. అమీబా అతడు ఆఫ్రికాని జయించాడు
3. జ్ఞానం చెక్కినశిల్పం
4. ఇంటి పెరట్లో లక్షీచెట్టు
5. పిల్లల పెంపకం ఒక కళ
6. వెలుగు వెన్నెలదీపాలు
7. సమస్యలు పరిష్కారాలు
8. ప్రేమ ఒక కళ
9. లోయ నుంచి శిఖరానికి
10. విజయానికి ఐదుమెట్లు
11. తప్పు చేద్దాం రండి!
12. విజయానికి ఆరోమెట్టు
13. మైండ్‌పవర్ నెం.1 అవటం ఎలా?
14. విజయంలో భాగస్వామ్యం
15. బేతాళ ప్రశ్నలు
16. విజయ రహస్యాలు
17. చదువు – ఏకాగ్రత
18. ఇడ్లీ – ఆర్కిడ్ –ఆకాశం
19. A man who swam the desert (English)
20. Developing right brain (English)
21. Secrets of Success (English)
22. The art of Studying (English)
23. The 5 steps to success (English)
24. విజయం వైపు పయనం
25. మిమ్మల్ని మీరు గెలవగలరు
26. మీరు మంచి అమ్మాయి కాదు
27. మిమ్మల్ని మీ పిల్లలు ప్రేమించాలంటే
28. గ్రాఫాలజీ
29. పడమటి కోయిలపల్లవి(Poetry)
30. మంచు పూలవర్షం(సుభాషితాలు)
31. మంచి ముత్యాలు
32. పాపులర్ రచనలు చేయటంఎలా?
33. పిల్లల పేర్ల ప్రపంచం

నవలలు

34. ఒక దెయ్యంతో నా ప్రేమ కథ
35. నిశ్శబ్ద విస్ఫోటనం
36. దిండు క్రిందనల్లత్రాచు
37. దేగ రెక్కల చప్పుడు
38. వీళ్ళనేం చేద్దాం?
39. బెస్ట్ ఆఫ్ యండమూరివీరేంద్రనాథ్ (కథలు)
40. ఒక వర్షాకాలపు సాయంత్రం
41. రెండు గుండెలచప్పుడు
42. వెన్నెల్లో ఆడపిల్ల
43. ఆనందో బ్రహ్మ
44. అంతర్ముఖం
45. డబ్బు టు ది పవరాఫ్ డబ్బు
46. కాసనోవా 99
47. డబ్బు మైనస్ డబ్బు
48. తులసీదళం
49. తులసి
50. అష్టావక్ర
51. ప్రియురాలు పిలిచె
52. ది డైరీ ఆఫ్ మిసెస్ శారద
53. మరణ మృదంగం
54. రాక్షసుడు
55. ప్రేమ
56. ధ్యేయం
57. అనైతికం
58. అతడే ఆమె సైన్యం
59. లేడీస్ హాస్టల్
60. చీకట్లో సూర్యుడు
61. థ్రిల్లర్
62. అతడు ఆమె ప్రియుడు
63. సిగ్గేస్తోంది
64. అంకితం
65. మరో హిరోషిమా
66. ప్రార్థన
67. పర్ణశాల
68. వెన్నెల్లో గోదారి
69. మంచు పర్వతం
70. 13–14–15
71. అభిలాష
72. నల్లంచు తెల్లచీర
73. చెంగల్వ పూదండ
74. అగ్ని ప్రవేశం
75. భార్యా గుణవతీ శత్రు
76. స్వరబేతాళం
77. దుప్పట్లో మిన్నాగు
78. యుగాంతం
79. ఋషి
80. క్షమించు సుప్రియా
81. నిశ్శబ్దం నీకు నాకుమధ్య
82. రాధ కుంతి
83. ఒక రాధ ఇద్దరుకృష్ణులు
84. రక్త సిందూరం
85. ఆఖరి పోరాటం
86. సంపూర్ణ ప్రేమాయణం
87. స్టూవర్టుపురం పోలీస్‌స్టేషన్
88. రుద్రనేత్ర
89. కొంగుచాటు కృష్ణుడు
90. 20 మంచి(తనం) కథలు

ప్రచురణ: నవసాహితి బుక్ హౌస్, విజయవాడ. ఫోన్: 0866–2432885

కొన్ని జ్ఞాపకాలు

యండమూరి వీరేంద్రనాథ్

రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు -
పీవీ నరసింహారావుగారి చేతుల మీదుగా

తెలంగాణ ప్రభుత్వం
ప్రతిష్ఠాత్మక చలన చిత్ర అవార్డుల
ప్రదానోత్సవం-2024

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పునస్వీకరించిన ఫిలిం అవార్డులలో భాగంగా రఘుపతి వెంకయ్య చలన చిత్ర అవార్డును సుప్రసిద్ధ నవలా రచయిత, దర్శకుడు, మోటివేషనల్ రైటర్ అండ్ స్పీకర్ శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ గారికి ప్రదానం చేస్తున్న సందర్భంగా అందిస్తున్న అక్షరాభినందన..

గౌరవనీయులైన యండమూరి వీరేంద్రనాథ్ గారూ..

తెలుగు చలన చిత్ర రంగ పితామహుడిగా కీర్తించబడే కీర్తిశేషులు శ్రీ రఘుపతి వెంకయ్య గారి అవార్డుతో మిమ్ములను సత్కరించడాన్ని సముచిత సత్కారంగా భావిస్తున్నాం... తెలుగు నవలా ప్రపంచంలో మీ స్థాన విశిష్టత గురించి ప్రత్యేకంగా పరిచయ వాక్యాలు పలకవలసిన అవసరం లేదు. దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగు నవలా ప్రపంచంలో ప్రకంపనలు సృష్టించిన అద్భుత రచనా శైలి మీ సొంతం. చదవటం ప్రారంభించడం వరకే పాఠకుడి చేతిలో ఉంటుంది.. ఒకసారి ప్రారంభించాక ఆఖరి పేజీ వరకు చదివి తీరాల్సిన ఉత్కంఠను రగిలించే మీ అసమాన రచనా చాతుర్యానికి పాఠక ప్రియులు మంత్రముగ్ధులు అవుతారు అనటంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. ముఖ్యంగా 80వ దశకంలో తెలుగు యువతను విపరీతంగా ప్రభావితం చేసిన అంశాలలో యండమూరి నవల ఒక ప్రధాన అంశం అన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. నవలగా, సీరియల్ గా, సినిమాగా మీ రచన అన్నది ఏ రూపంలో వస్తుందని తెలిసినా వెయ్యి కళ్లతో నిరీక్షించి మీ అక్షరాల వెంట పరుగులు పెడుతూ ఉత్కంఠ భరించలేక గోళ్లు కొరికేసుకున్న ఆ రోజులు తెలుగు నవలా ప్రియులకు తీపి జ్ఞాపకాలు. రచయిత్రుల తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్న రోజుల్లో "మీ రాక - మీ రాత" తెలుగు నవలా ప్రపంచపు తీరు తెన్నులను సమూలంగా మార్చి వేశాయి అన్నది ఎవరైనా అంగీకరించి తీరవలసిన వాస్తవం. సినీ, రాజకీయ, విద్యా, వ్యాపారాది సమస్త రంగాలలో అప్పుడప్పుడు కొందరు వ్యక్తులు గేమ్ ఛేంజర్స్ గా ఉద్భవిస్తుంటారు. అలాగే ఆనాటి నవలా ప్రపంచపు గేమ్ ఛేంజర్ గా అవతరించిన అసమాన ప్రతిభాశాలి, ప్రభావశీలి యండమూరి వీరేంద్రనాథ్ అనటంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.

సాధారణంగా రచయిత అంటే నవలలు ,కథల వరకే పరిమితం అవుతుంటారు. కానీ మీ రచనా వ్యాసంగానికి ఎల్లలు, పరిమితులు లేవు. నవలలు, కథలు, నాటికలు, నాటకాలు, సినిమా కథలు, సినిమా సంభాషణలు, స్క్రీన్ ప్లే రచన, వ్యక్తిత్వ వికాస రచనలు, దర్శకత్వం వంటి సమస్త సృజనాత్మక ప్రక్రియల్లో ప్రవేశ, ప్రావీణ్య, ప్రాముఖ్యాలను సాధించిన బహుముఖ ప్రజ్ఞాశాలి మీరు. ఇక ఈరోజున ఈ వేడుకకు వేదిక అయిన సినిమాతో మీ అనుబంధం విడదీయలేనిది. విశేష పాఠకాదరణ పొందిన మీ నవలలను సినిమాలుగా రూపొందించడానికి దర్శక, నిర్మాతలు హీరోలు పోటీపడిన సందర్భాలు ఎన్నెన్నో. సినిమా పుట్టినప్పటి నుండి ఎంతో మంది రచయితల, రచయిత్రుల నవలలు సినిమాలుగా వచ్చినప్పటికీ అత్యధిక సంఖ్యలో సినిమాలుగా వచ్చింది బహుశా మీ నవలలే కావచ్చు. అలాంటి అరుదైన ఘనతతో నవలా ప్రపంచాన్నే కాకుండా సినిమా రంగాన్ని కూడా విశేషంగా ప్రభావితం చేసిన మిమ్ములను ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య చలన చిత్ర అవార్డుకు ఎంపిక చేసిన మా జ్యూరీ సభ్యుల విజ్ఞతను అభినందిస్తూ...

శుభాభినందనలతో.. మీ

ఎ. రేవంత్ రెడ్డి
ముఖ్యమంత్రి - తెలంగాణ

తేది : 14-06-2025
వేదిక : హైటెక్స్ - హైదరాబాద్

రఘుపతి వెంకయ్య అవార్డు

సరస్వతి విద్యాపీఠం గుడి

జీవిత సహచరితో-40ఏళ్ళ క్రితం- 20ఏళ్ళ క్రితం

ఆళ్లగడ్డలో అనాథ పిల్లలతో

అభిలాష పాటల రికార్డింగ్. స్క్రీన్-ప్లే రచయిత సత్యమూర్తి, కోదండరామిరెడ్డి, జానకి, ఆత్రేయ, ఎస్పీ, నిర్మాత రామారావు, ఇళయరాజా, రికార్డిస్ట్ స్వామి గారు.

బాపుగారితో...

కె.ఎస్. రామారావుతో థార్ ఎడారిలో మరణమృదంగం షూటింగ్

కరోనా సందర్భంగా జమ్మలమడుగు ప్రైవేట్ స్కూల్ బోధన సిబ్బందికి నిత్యవసర సరుకుల పంపిణీ.

ఖమ్మం గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర అన్నదానం

కథ

కొండ మీద నక్షత్రాలు

యండమూరి వీరేంద్రనాథ్

మా పనిమనిషితో– "వాడిని వంటింట్లోకి తీసుకురావద్దని ఎన్నిసార్లు చెప్పాను? కళ్ళు సరీగ్గా కనబడవు... ఆవకాయ జాడీ బ్రద్దలు కొట్టాడు చూడు!" ప్రొద్దున్నే తిడుతోంది మా ఆవిడ.

ప్రతిరోజూ నా మీద పడాల్సిన వర్షపు జల్లు ఈ రోజు మా పనిమనిషి మీద పడింది. అలా అని నా కోటా కాన్సిల్ అవుతుందని రూల్ ఏమీ లేదు.

"వాడి బతుకు బండలు చేసాడమ్మా ఆ దేవుడు!" అంటోంది మా పనిమనిషి.

"నేను చెపుతోంది దేవుడి గురించి కాదు. వాడిని ఇక్కడకు తీసుకు రావద్దని..." రుసరుసలాడుతూ వంటింట్లోంచి బయటకు వచ్చింది నా భార్య. వెనుకే పనిమనిషి. ఆవిడ నవ్వటం నేను ఒక్కసారి కూడా చూడలేదు. పనిమనిషి కాదు. మా ఆవిడ.

పెళ్ళయిన ఈ నలభై ఏళ్లలో నా భార్య నవ్వగా నేను ఒక్కసారి కూడా చూడలేదు.

మా మామగారు త్రికాలజ్ఞాని. దేశం గర్వించదగ్గ జ్యోతిష్కుడు. కానీ కూతురి భవిష్యత్తు సరీగ్గా అంచనా వెయ్యలేదేమో... 'మందస్మిత' అని పెట్టాడు. ఆయన భవిష్యత్-దర్శనం ఇంత దారుణంగా ఎలా ఫెయిల్ అయిందని ఆయన్నే అడిగాను.

నన్నో పిచ్చివాడిని చూసినట్టు చూసి–"పెళ్ళవక ముందు తెగ నవ్వేది!" అన్నాడు క్లుప్తంగా.



ఇంకేం మాట్లాడను? ముక్కూ నోరూ మూసుకుని వచ్చేశాను.

చిత్రమేమిటంటే... హిరణ్యకశిపుడి కడుపున మహా భక్తుడయిన ప్రహ్లాదుడు పుట్టాడు. ఇక్కడ రివర్సు!... పరమ నిష్టా గరిష్ఠుడైన మా మామగారికి ఈవిడ పుట్టింది. నా విషయం కూడా అంతే! అపర భక్తుడనైన నా కూతురు కూడా అమ్మ టైపే. మా అల్లుడు నాలాగే నోట్లో నాలుక లేనివాడు. పాపం అతడిని ఒక ఆట ఆడిస్తుంది.

ఒకే ఒక అదృష్టం ఏమిటంటే నా కొడుకు నా వారసుడు. గతజన్మలో ఎంత పుణ్యం చేసుకున్నానో వాడు పుట్టాడు. భగవంతుడి దయ వల్ల ఇన్ఫోసిస్‌లో చాలా పెద్ద పోస్టులో ఉన్నాడు.

మా ఆవిడ నాతో చెడుగుడు ఆడటానికి కారణం నా గుండు. మీకు ఆశ్చర్యంగా ఉండొచ్చు. కానీ నిజం. కేదార్‌నాథ్ నుంచి కన్యా కుమారి వరకూ నేను చూడని క్షేత్రాలు లేవు. సంవత్సరానికి పదకొండు నెలలు గుండులో ఉంటాను. మొదట తిరుపతిలో, మళ్ళీ కాస్త జుత్తు పెరిగాక అన్నవరంలో... ఆపైన ... వద్దులెండి. చెప్పుకుంటూ పోతే ఆ లిస్టు ఆగదు. నా అనుమానం ఏమిటంటే... నాపై ఆవిడ చిన్న చూపుకి కారణం నా గుండే! (గుండె కాదు. 'గుండు' యే).

నా పట్ల ఆవిడ చులకనకి మరొక కారణం కూడా ఉన్నది. రిటైర్ అయిన తరువాత సుబ్బరాజుతో కలిసి వ్యాపారం పెట్టి, ఉద్యోగంలో సంపాదించినదంతా (రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో సహా) పోగొట్టటం.

నిజానికి ఇదే నిజమైన కారణం అని నా అనుమానం.

కానీ ఇందులో నా తప్పు లేదు. రాజుగారు మా భజన సమాజంలో సభ్యుడు. కోటీశ్వరుడు. "కొత్త రకం ప్లాస్టిక్ వచ్చింది. దాంతో దువ్వెనలు చేస్తే 'పైసాకి పది పైసలు లాభం!" అని చెప్తే ఇద్దరం తలో సగం వేసుకుని ఫ్యాక్టరీ పెట్టాం.

"గ్రహాలు అద్భుతంగా ఉన్నాయ్! గో ఎహేడ్!!" అన్నారు మా మామగారు.

సుబ్బరాజుగారి గురువుగారు హరిద్వార్ నుంచి జూమ్-మీటింగ్‌లో ముహూర్తం పెట్టారు. రెండు నెలల్లో నిర్మాణం పూర్తి అయింది. ఈస్ట్ ఫేసింగ్ ఫ్యాక్టరీ కట్టాము. ప్రారంభోత్సవానికి గురువుగారు అంత దూరం నుంచి నలుగురు శిష్యులతో కలిసి వచ్చారు. లక్ష ఖర్చయితేనేం, 'నభూతో న భవిష్యతి' అన్నట్టు యజ్ఞం చేశారు.

అప్పుడు జరిగిన ఒక అద్భుతం మీతో పంచుకుంటాను... ఆయన మంత్రాలు చదువుతూ ఉంటే ఆ వైబ్రేషన్స్‌కి హోమగుండంలో దానంతట అదే మంట వచ్చింది. ప్రజ్వలించిన ఆ మంటల్లో ఆయన హవిస్సులు సమర్పించటం ఒక మహోద్భుత దృశ్యం.

అప్పుడే కొత్తగా ఫేస్‌బుక్ వచ్చిన రోజులవి. అరణులతో రగించకుండానే కేవలం మంత్రాలతో మంట ప్రభవించటాన్ని వీడియో పెడితే ఆ రోజుల్లోనే కొన్ని వేల లైకులూ, ఎన్నెన్నో షేర్లూ

వచ్చినవి. నా కూతురు మాత్రం, "కింద భాస్వరం పెట్టి ఉంటారు" అని పెదివి విరిచింది. చెప్పానుగా. అమ్మ పోలిక.

అంత యజ్ఞం చేసినా ఫలితం దక్కక పోవటానికి కారణం మళ్ళీ నేనూ, సుబ్బరాజుగారూ, మేమిద్దరమే. అదో పెద్ద కథ.

మేము ఉండేది విజయవాడ. ఫ్యాక్టరీ తిరుపతిలో. అందుకని సుబ్బరాజుగారు తన (రెండో భార్య) కూతుర్ని ఆఫీసు సెక్రెటరీగా పెట్టాడు. ఇటువంటి విషయాల్లో నేను చాలా తెలివైనవాడిని. నామనిషి కూడా ఒకరు ఉండాలని... నా వివాహాత్పూర్వ స్నేహితురాలి కొడుకుని ట్రెజరర్‌గా పెట్టాను.

ఒకరిపై ఒకరు నిఘా ఉంటారని మా ఉద్దేశ్యం.

అయితే వారిద్దరూ ఒకరిపై ఒకరు నిఘా ఉండటం మానేసి, ఒకర్నొకరు ప్రేమించేసుకుని... ఈ ఏడాది కాలంలో చెరో పాతిక లక్షలూ తినేసి, ఆపై కొండమీద పెళ్లి చేసుకున్నారు. పుండు మీద కారం రాసినట్టూ వచ్చిన అతిథులకి తిరుపతికొండ మీద 'మా' దువ్వెనలు పంచారు. ఆ విధంగా ఏడాదిలో వ్యాపారం అటకెక్కింది.

డబ్బున్నోడు కాబట్టి ఆయనకేం పర్వాలేదు. నేను మునిగిపోయాను.

నిజమే. వ్యాపారంలో నష్టం వచ్చింది. వ్యాపారం అన్నాక లాభాలూ రావచ్చు, నష్టాలూ రావచ్చు. అనుభవం లేదు కాబట్టి ఓడిపోయాం. ఇంత చిన్నవిషయం నా కూతురూ, భార్యా అర్థం చేసుకోరేం? 'గెలుపుకి మొదటి మెట్టు ఓటమి' అని అన్ని రంగాల్లో ఓడిపోయి వ్యక్తిత్వ వికాసంలోకి వచ్చిన నిపుణుడు ఎవరో చెప్పాడు కదా. పోతే ఇక్కడ జరిగిందేమిటంటే, ఓటమి నా మొదటి మెట్టు కాదు. చివరి మెట్టు... ఎందుకంటే ఇకపై గెలవటానికి డబ్బూ లేదు. ఓపికా లేదు.

"ఇన్ని గుళ్ళూ గోపురాలూ తిరుగు తావు కదా. నిన్నే దేవుడూ రక్షించలేదేం?" అడిగింది నా భార్య.

"ఇన్ని దేవుళ్ళ దయ ఉంది కాబట్టే స్వంత ఇల్లు అమ్మకుండా, ఇంతటితో పోయింది." అన్నాను.

"మరి ఫ్యాక్టరీ ఎందుకు పోయింది?" అంది నా కూతురు.

దీన్ని 'మద్దెల శాపం' అంటారు.

గత జన్మలో నేను మద్దెలు వాయించేవాడినయి ఉంటాను. దాని శాపమే ఇది. రెండు వైపులా ఎడా పెడా కొట్టించుకోవటం.కానీ నాలో విశిష్ట గుణం ఏమిటంటే ఎప్పుడూ సంయమనం కోల్పోను.

"గ్రహాలు బావున్నాయని మీ నాన్నగారే చెప్పారు కదా!" అన్నాను ఆయన్ని కూడా నా వైపు కలుపుకుంటూ.

"గ్రహాలూ బావుంటే వాస్తు ఎందుకు?" అన్నది నా కూతురు.

"ఖర్మ అలా వ్రాసి పెట్టి ఉంది. కర్మని ఎవరూ తప్పించలేరు. ఏది వ్రాసి ఉంటే అది జరుగుతుంది!" తత్వ రహస్యం చెప్పాను.

"మరి అటువంటప్పుడు యజ్ఞం ఎందుకు?" అన్నది మా ఆవిడ.

"అది కూడా కర్మలో వ్రాసి ఉంది" అన్నాను.

అప్పుడావిడ నా వైపు చూసిన చూపు నేనిప్పటికీ మర్చిపోలేను.

"సర్లెండి. 'తివిరి ఇసుమున తైలమ్ము తీయవచ్చు' అన్నారు పెద్దలు. ఇప్పుడా గొడవంతా ఎందుకు గానీ నా సమస్య చెబుతాను.

ప్రవాసాంధ్రులు భారత దేశభక్తులకి... క్షమించండి. దేశభక్తులు





కాదు. భారతదేశంలో ఉండే దైవ భక్తులు. వారికి ఒక విన్నపం చేశారు. "వచ్చే నెల రాబోయే శ్రావణ పౌర్ణమి రాత్రి రాయలసీమలోని ఆకురాతి కొండ ఎక్కి, దేవుడికి మరింత 'దగ్గరగా' వెళ్లి అక్కడ లక్షదీపాలు వెలిగించి మనం మన భక్తిని ప్రదర్శించాలనీ,తమ ప్రెసిడెంటు వచ్చి అది చూస్తాడనీ..." ఒకప్రకటన ఇచ్చారు.

ఇంకేముంది. మా అందరి హృదయవనాల్లో వేలవేల దీపాలు ఒక్కసారిగా వెలిగాయి. ఇలాంటి అవకాశం ఎప్పుడో పుష్కరానికి ఒకసారి వస్తుంది. మా గ్రూపు పదిమందీ ఇప్పుడా కొండ దగ్గరకు వెళ్ళాలి. వెళ్ళటానికీ, అక్కడ ఉండటానికీ మనిషికి పాతికవేల దాకా ఖర్చవుతుంది.

అక్కడే మా ఆవిడ అడ్డుపడింది. "పెళ్ళయిన నలభై సంవత్సరాల్లో తీర్థయాత్రలకని లక్షలు ఖర్చు పెట్టావు. అప్పుడంటే కాస్త డబ్బు ఉండేది. ఇప్పుడు పైసా లేదు. ఈ పరిస్థితిలో నువ్వు అంత దూరం వెళ్ళి దీపం వెలిగించకపోతే నష్టం ఏమైనా ఉందా?" అని విరుచుకుపడింది.

నేను మాట్లాడలేదు. 'ఆరంభింపరు నీచ మానవులు' అన్నాడు భర్తృహరి. ఈ సందర్భంతో అది తప్పు. ఆరంభిస్తే ఆ చర్చ ఎక్కడి వరకూ వెళ్తుందో తెలుసు. అందుకే నేను ఇంట్లో ఎక్కువ మాట్లాడను.

ఇలా 'మాట్లాడకుండా' ఉండటం కోసం గతంలో 'ఏకాగ్రతా@నిశ్శబ్దం.కామ్' వారికి యాభై వేలు కట్టి బెంగళూరు వెళ్లాను. అక్కడ ఒంటరిగా, రోజంతా ఎవరితో మాట్లాడకుండా ఉండాలి. ఉప్పు కారం లేకుండా నెలరోజుల పాటూ అలా మౌనంగా ఉంటే ఏకాగ్రత పెరిగి సాంత్వన లభిస్తుంది.

వ్యాపారంలో వచ్చిన నష్టం తాలూకు బాధ పోవటం కోసం వెళ్ళాను. మా ఆవిడ అర్థం చేసుకోలేదు.

"ఎవరితో మాట్లాడకుండా ఉండటానికి యాభై వేలా? నీకేమైనా బుద్ధి ఉందా? ఇంట్లోనే ఎవరితోనూ మాట్లాడకుండా ఉండొచ్చుగా!" అన్నది.



వర్షం వచ్చినా, తుఫాను వచ్చినా ఆకాశవాణి ప్రోగ్రాం ప్రొద్దున్నే ప్రారంభం అవుతుంది.

"తిండీ, నివాసం... అన్నీ కలిపి..." అన్నాను సర్ది చెపుతున్నట్టూ.

"ఏదీ... ఆ ఆకులూ అలములకా?" అంది.

"శ్వాస మీద ధ్యాస" అన్నాను.

"శ్వాస మీద ధ్యాసకి బెంగుళూరు దేనికి? బాత్రూములో ఏం చేస్తావ్?అక్కడ పెట్టు ధ్యాస!" అంది.

ఈమె ఐక్యరాజసమితిలో వాదించి ఉంటే, కాశ్మీరు ఎప్పుడో మనదై ఉండేది.

మా ఆవిడకి ఇంగ్లీషు రాదు.అందుకే ఇంగ్లీషుతో కొట్టాలనుకున్నాను.

"మౌనం గొప్ప ధ్యానం. ఇంగ్లీషులో 'మెడిటేషన్' అంటారు. నీకు అర్థం కాదులే. అలా చెయ్యటం వలన ఏకాగ్రత పెరుగుతుంది."

ఆవిడా ఏం తగ్గలేదు... "నిజమే! కానీ నాకు అర్థం కాక అడుగుతానూ. ఏ పని చేస్తే ఆ పనిలో శ్రద్ధ పెట్టటమే కదా ధ్యానం అంటే. దానికి మాట్లాడటం మానెయ్యటం ఎందుకు?... ఆకులు తినటం ఎందుకు? ఈ మాత్రం 'ధ్యాస' ఆ తిరుపతి ఫ్యాక్టరీ వ్యవహారాల్లో పెట్టి ఉంటే అదే మెడిటేషన్ అయ్యుండేది కదా!"

లాభం లేదు. ఈ నిరంతర పోరాటంలో నేను ఎన్నటికీ గెలవలేను. లేదు... లేదు. ఒకసారి గెలిచాను. మా ఆవిడని వప్పించి ఒక పుణ్య ప్రవచన సభకి తీసుకువెళ్లాను. ఏ మూడ్‌లో ఉందో వప్పుకుంది.

జనం కిటకిటలాడుతున్నారు. స్వామీజీ ఒక కథతో ఉపన్యాసం ప్రారభించారు.

"ఒక గుజరాతీ కోటీశ్వరుల కుటుంబం పెళ్లి కూతురి అలంకరణ కోసం బొంబాయి నుంచి మనిషిని పిలిపించారు. అతడు ఆ రంగంలో నిష్ణాతుడు. మూడు గంటల మేకప్ కోసం ముప్పై లక్షలు తీసుకుంటాడు. అయినా సరే, అతడి సమయం దొరకడమే కష్టం" స్వామీజీ చెప్తున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే... నా భార్య శ్రద్ధగా వింటోంది! "పొద్దున్న పదింటికి పెళ్లి. ఆరుగంటలకి మేకప్ ప్రారంభించి తొమ్మిదింటికి పూర్తి చేసి, సహాయకులతో కలిసి కార్లో విమానాశ్రయానికి తిరిగి బయల్దేరాడు. ఎప్పుడూ సరదాగా హాస్యోక్తులతో నవ్వించే మనిషి ఆ రోజు ఎందుకో ఏదో సుదీర్ఘమైన ఆలోచనలో ఉండటం చూసి అసిస్టెంట్లకి అర్థం కాలేదు. పది నిమిషాల తర్వాత అ యువకుడు హఠాత్తుగా– "వాహనం వెనక్కి తిప్పండి" అన్నాడు.

అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకని అడిగాడు అసిస్టెంట్.

"ఎక్కడో తప్పు జరిగింది. ఏమిటా అని ఇంత సేపూ ఆలోచించాను. ఇప్పుడు తెలిసింది. పెళ్లి కూతురికి గడ్డం మీద చుక్క ఎడమవైపు పెట్టాను.ఆ అమ్మాయిది కోలామొహం. కుడి వైపు బాగుంటుంది. కారు వెనక్కి తిప్పండి' అన్నాడు ఆ బ్యూటీషియన్" ఆగి... స్వామీజీ కొనసాగించాడు. "అప్పుడా అసిస్టెంటు 'సార్! ఇది గుజరాతీ పెళ్లి. పెళ్లికూతురు మేలిముసుగులో ఉంటుంది... వచ్చిన వాళ్ళందరూ దూరంగా కూర్చుంటారు. గడ్డం కింద చుక్క ఎటు వైపు ఉందో ఎవరు చూస్తారు? చూసి, అది ఎడమవైపు ఉంటే బాగుండేదని ఎవరనుకుంటారు?" అన్నాడు.

"నేను అనుకుంటాను!" అన్నాడు ఆ కళాకారుడు."

స్వామీజీ ఇది చెప్పగానే జనం కరతాళ ధ్వనులుచేశారు.

నాకయితే ఒక్క ముక్క అర్థం కాలేదు. సభ నుంచి ఇంటికి వచ్చేస్తూ ఉంటే ఆ మాటే చెప్పాను. నా భార్య మాత్రం "బాగా చెప్పాడు పెద్దాయన" అన్నది.

"చూసావా మరి! అందుకే ఇలాంటి ప్రవచనాలు వినటానికి రమ్మంటాను."అన్నాను గర్వంగా.

"ఇప్పుడేగా ఏమీ అర్థం కాలేదన్నావ్!"

గతుక్కుమని... "వినటానికి బావుంది!" అన్నాను.

"అవును. విన్నా, పుస్తకాలు చదివినా బావుంటుంది. ఆచరిస్తే ఇంకా బావుంటుంది." అన్నది.

నలభై సంవత్సరాలనుంచీ భగవద్గీత చదువుతున్నాను. నేనేమి ఆచరిస్తే బావుంటుందో అర్థం కాలేదు. మొత్తానికి ఎలాగో అప్పుచేసి అప్పట్లో బెంగళూరు వెళ్ళాననుకోండి. అది వేరే సంగతి. కానీ ఇప్పుడు ఈ దీపాల సంగతి ఎలా?...

✦ భయం వల్ల భక్తి పుడుతుంది. భక్తి వల్ల ధైర్యం వస్తుంది. ధైర్యం వల్ల మనశ్శాంతి వస్తుంది.

✦ భగవంతుడికి పది చేతులు...! నీ దగ్గర నుంచి తీసుకోదల్చుకుంటే, రెండు చేతులతో నువ్వు ఏమి ఆపగలవు? అదే విధంగా ఆయన ఇవ్వదల్చుకుంటే రెండు చేతులతో ఎంత తీసుకోగలవు?

✦ దేని వల్ల నీ సుఖం రెట్టింపగునో, దేనివల్ల నీ దుఃఖం శూన్యమగునో అదే కృష్ణ చైతన్యం.

✦ ప్రార్థన అంటే ముక్కు మూసుకుని కూర్చోవటం మాత్రమే కాదు. బంధాల నుంచి దూరంగా నడవటం. ఎంత దూరంగా నడిస్తే భగవంతుడికి అంత దగ్గరగా వెళ్తావు. ఏది జరిగినా అది కృష్ణుడి ఆజ్ఞ ప్రకారమే. ఎప్పుడైతే నువ్వు ఈ వేదాంత ధోరణి అలవాటు చేసుకున్నావో అప్పుడు ఎవరి వీడ్కోలూ నీకు విషాదం కాదు.

✦ మానవ సేవే మాధవ సేవ. మానవ సేవ చేయాలంటే అన్నిటికన్నాశారీరక ఆరోగ్యం ముఖ్యం







ఎలా మా ఆవిడని కన్విన్స్ చెయ్యటం? చేతిలో డబ్బు ఉన్నప్పుడే నా మాట చెల్లలేదు. ఇప్పుడేం చెల్లుతుంది?... ఇంకో నెల మాత్రమే టైమ్ ఉన్నది. మా బృందానికి నేను లీడర్ లాంటి వాడిని. నేను మానేస్తానంటే అందరూ గోల చేస్తారు. దీనికి ఏది మార్గం? ఆ రాత్రి భగవం తుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించాను.

భక్తుడి కష్టాలు తీర్చెడివాడు భగవంతుడే కదా! తన దగ్గరగా వచ్చిన కొండమీద నక్షత్రం పెట్టటానికి నా కొడుకు రూపంలో ఆదు కున్నాడు. మరో పది రోజుల్లో శ్రావణ పౌర్ణమి అనగా నా కొడుకు యాభై వేలు పంపాడు.

ప్రయాణానికి మార్గం సుగమమైంది. చెప్పా నుగా... ఐ యామ్ ప్రౌడ్ ఆఫ్ మై సన్.

మరో వారంలో ప్రయాణం.

నా మనసు మేఘాల్లో తేలుతూ ఉంది.

✦✦✦

ఇలా మేఘాల్లో తేలుతూ వెళ్తూ ఉండగా మోటార్ సైకిల్ గుంటలో పడింది.

చిన్న శబ్దమూ, ఆపై నాలుగు రోజుల తర్వాత మెలకువా వచ్చింది. పెద్ద దెబ్బ తగ లేదు కానీ, రక్తం ఎక్కించవలసి వచ్చింది.

ఆపై రెండు రోజులకి కాస్త కోలుకున్నాను. బెడ్ పక్కన కూర్చొని బత్తాయి పండు వలుస్తూ,

"అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం జరగ లేదు!" అంది మా ఆవిడ.

"చూసావా!ఇష్ట దైవం మహిమ!" అన్నాను.

"మరి అంత ప్రేముంటే అసలు ఆక్సిడెంటు అవకుండానే చూడొచ్చుగా!" అన్నది.

"ఎడ్డెం అంటే తెలుసా?" అన్నాను.

"తెడ్డానికి అపోజిట్!" అంది.

ఎడ్డే అంటే వంకర, మూర్ఖుడు అని రెండు అర్థాలు. 'వంకర' అంటే 'టింకర' అనేవాడు మూర్ఖుడు. అదంతా చెప్పి నా తెలుగు పరి జ్ఞానాన్ని ఆవిడ ముందు ప్రదర్శించబోతూం డగా మా కూతురూ, అల్లుడు, కొడుకూ, కోడలూ వచ్చారు. 'రికవర్ సూన్ అంకుల్..' అంటూ నా అల్లుడు ఫ్లవర్ బొకే అందించాడు.

కూతురు ఆపిల్స్ ఇచ్చింది. నా కొడుకు ఒక ఫోటో ఇస్తూ, "దగ్గర పెట్టుకో నాన్నా! తొందరగా నయమవుతుంది!" అన్నాడు.

మధ్యలో మా ఆవిడ ఫోటో అందుకుని చూస్తూ... " కృష్ణుడు చాలా ముద్దుగా ఉన్నాడు కదా!" అన్నది.

'కృష్ణుడు నీకు నచ్చటం నాకు నచ్చింది!' అనుకున్నాను.

నిద్రబోయే ముందు ప్రతిరోజూ చదివి తల పక్కన పెట్టుకునే భగవద్గీత పుస్తకం మధ్యలో ఆ ఫోటో పెట్టుకుని, మా అబ్బాయితో "ఆకు రాతి ప్రోగ్రాం కాన్సిల్ అయింది కదరా! నీ యాభై వేలూ..." అని అనబోతూ ఉంటే నా భార్య చప్పున తలెత్తి... "యాభై వేలేమిటి?" అన్నది.

ఆపిల్ పండు విషయమై మొగాడి మీద కోపమొచ్చిన దేవుడు... భార్యలకి పాము చెవు



లిచ్చి మొగుళ్ళ మీద కక్ష తీర్చుకున్నాడు.

నేను ఏదో చెప్పబోయేటంతలో నన్ను రక్షించటానికా అన్నట్టు ఒకా యన మంచం దగ్గరకు వచ్చాడు. లాల్చీ పైజమాలో ఉన్నాడు. కళ్ళు నిర్మలంగా ఉన్నాయి. మొహం ప్రశాంతంగా ఉంది. చేతికి ఒక బెంగాలీ సంచి వేలాడుతోంది.

నా భార్య స్టూల్ మీద నుంచి లేస్తూ– “ఈయన పేరు మురారి. ఈయనే నీకు రక్తం ఇచ్చింది. ఆ సమయంలో ఈయన రాకపోయి ఉంటే..” అని ఆపింది. కళ్ళకి మంగళసూత్రం అద్దుకుందేమో అను కున్నాను గానీ అటువంటిదేమీ చెయ్యలేదు.

నిజమే. నా గ్రూపు రక్తం సాధారణంగా దొరకదు. చేతులు జోడించి, “అంతా భగవత్ లీల. మీలాంటి వాళ్ళు ఇంకా ఉండబట్టే ధర్మం నాలుగుపాదాలతో నడుస్తోంది. మురారి అంటే కృష్ణుడు. మిమ్మల్ని దేవుడు కాపాడతాడు!” అన్నాను.

ఆయన నవ్వి “అవును! నన్ను భగవంతుడు కాపాడతాడు. నేను భగవంతుడిని కాపాడతాను!” అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది.

దేవుడు ఉన్నాడనే ఆస్తికులూ, లేడనే నాస్తికులూ ఉంటారని తెలుసు గానీ ‘దేవుడితో నాకు సంబంధం లేద’నే వారెవరో నాకు అర్థం కాలేదు. నా అనుమానం అర్థం చేసుకున్నట్టు... “స్నేహం, ధ్యానం మొదలైనవి భగవంతుడితో ఏడు రకాల సంబంధాలు!” అన్నాడు.

పిల్లి అంటే మార్జాలమన్నట్టు ఉంది అందామనుకుని, ఎంతైనా రక్తం ఇచ్చిన వాడు కదా, మర్యాద కాదని మానేశాను. మరికొంచెం సేపు మాట్లాడి ఆయన వెళ్ళిపోయాడు.

అప్పటి వరకూ ముళ్ళ మీద కూర్చున్నట్టూ ఉన్న మేము ఒక్కసారిగా రిలాక్స్ అయ్యాం. వెళ్తున్నవాడి వైపు నా భార్య కొరకొరా చూస్తూ...

“ఇన్ని కబుర్లు చెప్తున్నాడా!...నీకు రక్తం ఇవ్వటానికి పదివేలు తీసు కున్నాడు!” అన్నది.

విస్తుబోవటం నా వంతు అయింది. అప్పుడు మా టాపిక్ రక్తం అమ్మకాలూ, కిడ్నీ మాఫియా మీదకు వెళ్ళింది.

✦ యుద్ధం జరుగుతున్నప్పుడు అర్జునుడికి కృష్ణుడు భగవద్గీత బోధించాడు. కృష్ణుడి ధ్యానంలో అర్జునుడు మునిగిపోయాడు. అలాగని యుద్ధం మానలేదు. యుద్ధమే ధ్యానంగా కొనసాగించాడు. మీ కర్తవ్యం వైపు నడుస్తూ ఉండటమే ధ్యానం. కర్తవ్యానికి మించిన ధ్యానం మరేముంటుంది?

✦ ఆశ - నిరాశ, గెలుపు - ఓటమి, ఆనందం-దుఃఖం మొదలైనవన్నీ మనసు ఆడే ఆటలు. వాటికి నికరమైన విలువ ఏదీ లేదు.

✦ జీవితంలో అత్యున్నత స్థానాన్ని చేరుకున్నవారందరూ నిరంతరం పరిస్థితులతో యుద్ధం చేసి గెలుస్తూ వచ్చినవాళ్ళే. ఎప్పుడైతే యుద్ధం ఆగిపోయిందో అప్పుడు జీవితంలో నిరాసక్తత ప్రారంభమవుతుంది.

✦ కొత్త దారులు వెతికేవారు ఎప్పుడూ ఒకరే ఉంటారు. మిగతావారు వారిని అనుసరిస్తూనో, విమర్శిస్తూనో ఉంటారు.

✦ ‘అనుభవం లేనివారితో చేతులు కలపకు’ అన్నది మొదటి పాఠం. ’నష్టం వచ్చే చోట మొహమాట పడకు’ అన్నది రెండో పాఠం.

ఇంతలో నర్సు వచ్చి “అదేంటి? మురారి బాబు వెళ్ళిపోయారా?” అని అడిగింది.

“ఆయన మీకు తెలుసా?” నా భార్య అన్నది.

“తెలియకపోవటమేమిటి? రేర్-గ్రూప్ రక్తం. డబ్బున్నవాళ్ళకి రక్తం అమ్మి... ఆ డబ్బుతో బీదవాళ్ళకి రక్తం కొనిస్తాడు... ఎప్పుడూ ఇక్కడే ఉంటాడు.” అని చెప్పింది.

నా భార్యా నేనూ మొహామొహాలు చూసుకున్నాం.

✦✦✦



ఆ రాత్రి నేను నిద్రపోలేదు.

‘నాలో ఎక్కడో ఏదో పటేలున పగిలింది’ అన్న పెద్ద మాటలు చెప్పను గానీ, ‘స్నేహం, ఆరాధన’ మొదలైన బంధాల గురించి మురారి చెప్పిన వివరణ మళ్ళీ మళ్ళీ (ఈ సారి కొత్తగా) మననం చేసుకున్నాను.

“భగవంతుడితో స్నేహం చెయ్యి. స్నేహంకన్నా గొప్పది మరేమి ఉన్నది? గోపబాలురు ఎవరు? తపశ్శక్తితో పునీతులైన ఋషులు. ఆ పుణ్య ఫలితంగానే కృష్ణుడితో జలకాలాడారు. వీపు మీద ఎక్కి చెరువుల్లో దూకారు. అంతెందుకు? కురుక్షేత్ర యుద్ధ సమయంలో కృష్ణుడు అర్జునుడి



రథసారథి. అశ్వాల రొదలో, ఏనుగుల ఘీళికారాల్లో అవతలివారి మాటలు వినిపించవు. భుజాన్ని వామపాదంతో కొడితే అటూ, కుడి కాలితో కొడితే ఇటూ తిప్పాలి. కృష్ణుడు నిజరూపం తెలిసే సరికి 'ఓ దేవదేవా! నువ్వు భగవంతుడివా? నిన్నా నేను కాలితో కొట్టింది?' అని అర్జునుడు వాపోతాడు.

కృష్ణుడు ఆప్యాయంగా నవ్వి... "కొట్టేటంత చనువు నీకు కాక ఇంకెవరికుంటుంది? స్నేహితుడివైన నీవు కాకపోతే నేను ఎటు వెళ్ళాలో ఎవరు చెపుతారు?" అంటాడు.

భగవంతుడితో స్నేహం అంటే అది. నీవు నిజమైన స్నేహితుడివైతే 'ఎవడబ్బ సొమ్మ'ని తిడితే బెదురుతూ వచ్చి నీ ఆభరణాలు నీకు అందజేస్తాడు. నీవు నిజమైన భక్తుడివైతే 'లావొక్కింత లేదు' అనగానే పెళ్ళాంతో సరసాలాపి పరుగెత్తుకు వస్తాడు.

పని చేయటానికి కావలసిన శక్తినిచ్చేది ధ్యానం. అంతే తప్ప ముక్కు మూసుకుని స్పృహ కోల్పోవటమూ, ఆ భ్రమలో దేవుణ్ణి చూడటమూ కాదు. చేసే పని మీద భక్తే ధ్యానం. చేస్తున్న పని తప్ప మరేమీ గుర్తు ఉండక పోవటం ఏకాగ్రత. అందమైన అమ్మాయి బొమ్మ వేసి, 'వదనం మీద చుక్క ఎక్కడ పెట్టాలి' అని తపించటం తన పని పట్ల చిత్రకారుడికి ఉన్న ప్రేమ. చేసే పని గురించి ఇరవై నాలుగ్గంటలూ ఆలోచించటమే ఆరాధన. రాధకి కృష్ణుడి పట్ల ఆరాధన అదే.

తాదాత్మ్యతకి గొప్ప ఉదాహరణ ప్రహ్లాదుడు. 'ఇందుగలడు... అందులేడని సందేహము వలదు' అంటాడు. నరసింహుడు మనిషి లోనూ ఉన్నాడు. రాతి స్థంభంలోనూ ఉన్నాడు. రాతికి పూజ చెయ్యటం నీ ఆనందం. నువ్వు సాటి మనిషికి సేవ చెయ్యటం దేవుడికి ఆనందం.

భగవంతుడిని నమ్ము! నమ్మకంతో పని చెయ్యి. అతడు ఎక్కడు న్నాడు? నీలోనే. నమ్మకానికి వారసుడు ఆంజనేయుడు. సంజీవని తెమ్మంటే హిమాలయాలనే తీసుకొస్తాడు.

"హనుమా..! నేను చెప్పగానే ఇది సాధ్యమా కాదా అని ఆలోచించ కుండా ఆ పనికి బయలుదేరతావు కదా. నీకేమీ అనుమానాలుండవా?" అని రాముడు అడుగుతాడు.

'రామా! నువ్వు నాకొక పని చెప్పావంటే... ఆ శక్తి కూడా నువ్వే ఇస్తావనే నమ్మకం నాకుంది' అంటాడు ఆంజనేయుడు. నీలో ఉన్న భగవంతుడి పై నమ్మకం లేకుండా ఎన్ని యజ్ఞాలు చేస్తే ఏమి లాభం? హుండీలో ఎన్ని డబ్బులు వేస్తే ఏం లాభం? హుండీ కేవలం నీ ఆనందం మాత్రమే.

భగవంతుడిని ప్రార్థించటం అంటే... నీతో పాటూ అతడు సృష్టించిన సకల చరాచారాలనీ ప్రేమించటం. అవన్నీ నీ తోబుట్టువులు... అందరూ నీ సహోదరులు. వారి పట్ల వాత్సల్యం చూపించు. ప్రకృతిని ప్రేమించు. తాదాత్మ్యత చెందు. నీ ప్రేమ విశ్వజనీయమైనది అయితే, ఆ ప్రేమ కోసం కోసం భగవంతుడు నీ ముందు చేయి సాచి నిలబడతాడు.

యశోదకి అంత వాత్సల్యం ఉండబట్టే నోరు చూపించమంటే విన యంగా చేతులు కట్టుకుని చూపించాడు.

'ఓయమ్మ నీ కుమారుడు' అని పొరుగింటివారు ఫిర్యాదు చేసినప్పుడు రోటికి కట్టేసినా ఆ దివ్య మంగళుడు కిమ్మనలేదు.

భగవంతుడు నీకు డబ్బు కాస్త ఎక్కువ ఇచ్చాడంటే... వాటిని నీ సహచరులకు పంచమని. నాకు ఖరీదైన రక్తం ఇచ్చాడంటే దాన్ని ఇతరులకి పంచమని. జ్ఞానం ఇచ్చాడంటే కాస్త ఆలోచించమని. ఇన్ని విధాలుగా భగవంతుడికి స్నేహితుడిగా, ఆరాధకుడిగా, సఖుడిగా, వాత్సల్యంతో ఉండగా నాకు భగవంతుడు కొత్తగా ఏమి ఇస్తాడనీ, చేస్తాడనీ మీ ఉద్దేశ్యం?" అని అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా అదే ఆలోచించాను.

✦✦✦

కొండ మీద దీపాలు పెట్టే కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. కోటి పైగా ఖర్చయిందట. చాలా పేపర్లూ, చానెళ్ళూ దానికి బహుళ ప్రాచుర్యం ఇచ్చాయి. నేను వెళ్ళలేదు.

భగవంతుడికి ఎలా దగ్గరవ్వాలో, మురారిబాబు చెప్పిన ఆ ఎనిమిది మార్గాలూ మా గ్రూపుకి కూడా చెప్పాను. వాళ్ళూ హేతువుతో ఆలో చించే వారే. తరువాత ఆ మాట మీద ఉంటారో లేదో గానీ, ప్రస్తుతానికి నేను చెప్పింది అర్థం చేసుకున్నారు.

నెల రోజులు పోయాక ఒక రోజు ప్రొద్దున్నే పనిమనిషి "మీరందరూ కలిసి నా కొడుకు కళ్ళు బాగుచేశారయ్యా! ఏమి చేస్తే మీ రుణం తీరుతుంది?" అంటూ కొడుకుతో దణ్ణం పెట్టించింది.

కుర్రాడు కృతజ్ఞతతో నావైపు చూస్తున్నాడు.

కొండ మీద లక్షల దీపాలు వెలుగుతున్నాయి.

నా ముందున్న రెండు నక్షత్రాలూ... మరింత ప్రకాశవంతంగా ఉన్నాయి.

కథ

ఈల-ఇల్లాలు

యండమూరి వీరేంద్రనాథ్

"తాయారూ!" అని గట్టిగా అరిచాడు పాపారావు.

జబ్బ మీద వున్న పురుగుని దులిపేసుకుంటూ... నిర్లక్ష్యంగా చూసింది తాయారు.

"నిన్నింట్లో ఈల వేసుకుంటూ తిరగొద్దన్నానా?" అన్నాడు కోపంగా.

"అంటే వీధిలో తిరగమనా దానర్థం?" అంటూ వీధిలోకి పోబోయింది తాయారు.



చెయ్యి పట్టుకొని ఆపు చేసి బాధగా– "తాయారూ! నన్నిలా ఎందుకు బాధ పెడుతున్నావో తెలియడం లేదు. నువ్వెందుకులే... నేనే వెడుతున్నాను!" అని బైటికి నడిచాడు పాపారావు.

దారిలో పాపారావుకి ఖాన్ ఎదురయ్యాడు.

"ఏరా, పాపారావ్! ఈ రోజు సెషన్స్‌కి రావా?... టూ ఫోర్లు ఆడదాం. రాఘవరావు కూడా వచ్చాడు" అని ఆహ్వానించాడు.

పాపారావు విషాదంగా... "సారీరా ఖానూ! ఈ రోజు నా మనస్సేం బాగా లేదు. నీవు వెళ్ళిరా!" అన్నాడు.

ఖాన్ వెంటనే ఆముదం తాగినవాడిలా తన మొహాన్ని మార్చేసుకొని– "అరెరే పాపం! నీ మనసు కేమయిందిరా?" అన్నాడు.

పాపారావుకి ఒళ్ళు మండింది. కోపంగా "ఒరేయ్ వెధవ్వేషాలు వెయ్యకు. నీ వెంత తైరు కొట్టినా నీకు నయాపైసా అప్పివ్వను. అందులోనూ పేకాటకి!" అన్నాడు.

ఖాన్ "ఛా! ఎత్తు పారలేదు!" అనుకుంటూ వెళ్ళిపోయాడు.

పాపారావు తిన్నగా నడిచి పార్కులోకి వెళ్ళాడు. పొగడచెట్టు కింద వున్న సిమెంటుబెంచీ మీద కూర్చొని ఆలోచించటం మొదలు పెట్టాడు.

తాయారు ఎందుకిలా చేస్తూంది? అసలీ అలవాటు తాయారుకెలా వచ్చింది... అని తర్కించుకున్నాడు.

ఇదేదో అంతుపట్టని సమస్యలా మిగిలిపోయింది.

సరే... ఆలోచనల్లో పాపారావుని వదిలిపెట్టేసి అతని గత చరిత్రలోకి వెళదాం.

✦✦✦

పాపారావు అసలు పేరు పాపారావే.

నాలుగయిదు సంవత్సరాలు కాపీకొట్టి చివరికి ఎలాగయితేనేం బి.ఏ. పాసయ్యాడు. ఉద్యోగాల కోసం చెడ తిరిగి వ్యవసాయమే మంచిదని వాళ్ళ వూరు కొత్తపల్లి పోయాడు. తీరా కాడి పట్టుకొనే సరికి 'స్టేట్ బ్యాంక్' నుంచి ఇంటర్వ్యూ వచ్చేసరికి 'కాడి' వదిలేసి కాకినాడ పరుగెత్తుకొచ్చాడు.

ఎలాగయితేనేం కాకినాడలో ఉద్యోగం సంపాదించగలిగాడు.

పాపారావు భూమికి ఓ అయిదు అడుగుల ఎత్తులో వుంటాడు. (అపార్థం చేసుకోకండి. పాపారావు దెయ్యమయిపోయాడని నా ఉద్దేశ్యం కాదు). నల్లగా వున్నా కనుముక్కుతీరూ అదీ బాగుంటుంది. పోతే కొంచెం పిరికి గుండె.

బ్యాంక్‌లో ఉద్యోగం అనగానే పెళ్ళికూతుళ్ళ తండ్రులు ఎగబడ్డారు. చివరికి నాలుగెకరాలు, పదివేల రూపాయలతో అలివేలు మంగ





తాయారుని పెళ్ళాడాడు.

తాయారు చిన్నతనం నుంచీ చాలా గారాబంగా పెరిగింది! ఒక్కతే కూతురు కావడం వల్ల 'ఆడింది ఆట, పాడింది పాట'గా సాగుతుండేది. అసలు తాయారుకి ఈల వేయడం అనే అలవాటు ఎలా వచ్చిందీ... అంటే అదో కథ.

చిన్నప్పుడు తాయారు వాళ్ళ స్కూల్లో అమ్మాయి లంతా డ్రామా వేద్దామనుకొన్నారు. ఆ డ్రామాలో తాయారు రౌడీ! ఒక చోట ఈల వేయాలి. ఎలా గయినా ఈల వేయడం నేర్చుకోవాలి అను కొంది. వాళ్ళ మాస్టారు మాత్రం "నీకెందుకమ్మా శ్రమ. నీవు ఈలవేసే సమయానికి తెర వెనుక నుండి వేయిస్తాను!" అన్నాడు.

"ఎందుకండీ? ఎలాగయినా నేర్చుకొనే పూచీ నాది!" అంటూ ఇంటికి వెళ్ళి వాళ్ళ అన్నయ్యను వేపుకు తింది. వాళ్ళ నాన్న రెండు వడ్డించినా ఏడవకుండా నిరాహారదీక్ష సాగించి పంతం నెగ్గించుకుంది.

ఎలాగైతేనేం తాయారు ఇంట్లో రెండు రోజుల పాటు ఈల ప్రాక్టీసు సాగింది.

అలా నేర్చుకొన్న ఈ విద్య ఇలా లోతుగా పాతుకుపోయి పాపారావు మనసులో కలతలు రేపుతోంది. దానికితోడు చిన్నతనం నుంచీ గారాబంగా పెరిగిందేమో మొండి మనిషై కూర్చుంది.

ఉన్నట్టుండి అంతవరకూ నిశ్శబ్దంగా వున్నదల్లా చటుక్కున విజిల్ వేస్తుంది తాయారు. ఉలిక్కిపడి చూస్తాడు పాపారావు... ఎంతో బాధ వేస్తుంది. కోపం కూడా వస్తుంది. కానీ ఏం చేస్తాడు? పదివేలకి అమ్ముడు పోయాడు. ఏమైనా అంటే "మీరు రమ్మంటే రావడానికి, పొమ్మంటే పోవడానికి పెళ్ళాడాననుకున్నారా? పదివేలిచ్చి పెళ్ళి చేశాడు మా నాన్న!" అని మొదలు పెడుతుంది. ఏమీ చేయలేని మగాళ్ళందరి లాగే పాపారావు కూడా భార్యకి 'వట్టి మూర్ఖపు మనిషి' అని బిరుదిచ్చు కుని ఇంకా వాదాలెందుకని సరిపెట్టుకున్నాడు.

అందరాడవాళ్ళూ ఏవో కీర్తనలో, లేకపోతే కనీసం సినిమా పాటలో పాడుకుంటూ పని చేసుకుంటూరు... కానీ, తాయారు మాత్రం వంటింట్లో అనే ఏమిటి, బయట వరండాలో కూడా అప్పుడప్పుడూ చేతులు వెనక్కి కట్టుకొని విజిల్ వేస్తూ పచార్లు చేస్తూ వుంటుంది.

పాపారావుకి మతిపోతూ వుంటుంది.

అంతెందుకు? ఎవరన్నా స్నేహితుడు వచ్చినప్పుడు చూడాలి. పాపా రావు అవస్థ చచ్చిన చావు అవుతుంది. మాట్లాడుతున్నవాడల్లా లోపలి నుంచి ఈల పాట ఏదయినా వినిపించగానే, తను మాట్లాడటం మానేసి పాపారావు ఈల వేయటం మొదలుపెడతాడు. అవతలి వాడు తలము నకలయ్యేంతగా ఆశ్చర్యపోయి...

✦ మన జీవిత గృహాల్లోకి ఎందరో వస్తూ ఉంటారు. పోతూ ఉంటారు. కొందరే మనకి ఆత్మీయంగా కనబడతారు. కొందరే మనని ప్రభావితం చేస్తారు.

✦ తెలివైనవాళ్ళు మూడు రకాలు. మొదటిరకం ఎప్పుడూ తొందరపడరు. అవకాశం కోసం చూస్తారు. రెండోరకంవారు అవకాశాన్ని తామే సృష్టించుకుంటారు. మూడోరకం వాడే నిజమైన తెలివైనవాడు. ఎప్పుడు ఎదురుచూడాలో, ఎప్పుడు అవకాశాన్ని సృష్టించుకోవాలో తెలిసినవాడు అతడు.

✦ నువ్వు నేర్చుకోవాలంటే అన్నిటికన్నా ముందు నేర్చుకోవలసింది 'వినయం'.

✦ మనిషి తనలో ఉండే శక్తిని పదో వంతు మాత్రమే వాడుకుంటాడు. అంతకన్నా ఎక్కువ వాడుకునే వ్యక్తే జీవితంలో పైకి వస్తాడు.

✦ తరచూ పొగిడేవాడు ఎప్పటికీ గురువు కాలేడు.

✦ నిన్న సాయంత్రం మనం ఎలా గడిపామో పునరాలోచించుకుంటే రేపు సాయంత్రం ఇంతకన్నా బాగా ఎలా గడపాచ్చో తెలుస్తుంది.

'ఇప్పటి వరకూ మాట్లాడాడు కదా! ఇంతలోనే ఏమొచ్చింది?" అనుకొని పాపారావువైపు భయంభయంగా చూస్తాడు.

స్నేహితుడి అవస్థ గమనించి పాపారావు మొహం ఆముదం తాగినట్లు అయిపోయినా, విజిల్ మాత్రం తాయారు లోపల ఆపు చేసేంత వరకూ ఆపడు. పోనీ తను గట్టిగా మాట్లాడి లోపల నుంచి విజిల్ వినిపించకుండా చెయ్యవచ్చు కదా అనే అనుమానం ఇక్కడ రాకూడదు. ఎందుకంటే రైలు కూత కూడా తాయారు విజిల్‌ని డామినేట్ చేయలేదు.

విజిల్ వేస్తున్నట్లు నటించటం అనేది పాపారావు ఒరిజనల్ ఐడియా కాదు. వాళ్ళ మామగారిది. ఆయన దాన్ని పాపారావు మీద ప్రయోగించి కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేశాడు.

పెళ్ళి చూపులకి వచ్చి కుర్చీలో కూర్చుని వున్న కుర్రాడిని చూసి సరదాగా విజిల్ వేసేది తాయారు (మనసులో ఇంకే ఉద్దేశ్యమూ లేదు సుమండీ). దానితో ఆ కుర్రాడూ, మిగతా పెద్దలూ బేజారెత్తి వెళ్ళిపోయేవారు. తాయారు నాన్నగారు నెత్తీ నోరూ కొట్టుకునేవారు. ఇలా రెండు మూడు సంబంధాలు తప్పిపోయాక తాయారు అన్నయ్యకి ఒక మంచి ఐడియా వచ్చింది.

తాయారు నాన్న దగ్గరకు వెళ్ళి "నాన్నా ఈ సారి వచ్చే సంబంధం మనకి సెటిల్ అయిపోయినట్టే... పెళ్ళి వాళ్ళని చూసుకోవడానికి రమ్మను!" అన్నాడు.

"ఎలారా?" అన్నాడు వాళ్ళ నాన్న.

"నేను చెబుతాగా" అని భరోసా ఇచ్చేశాడు.

ముందు పాపారావు తాలూకు పెద్దలు వచ్చి చూసుకున్నారు.

అదృష్టవశాత్తూ అప్పుడేమీ గొడవ చెయ్యలేదు మంగతాయారు. ఆ తరువాత కొద్ది రోజులకు పాపారావు కొంతమంది ఫ్రెండ్స్‌తో అంటే ఖాన్, రాఘవేంద్ర, సూర్యంలతో అమ్మాయిని చూసుకోవడానికి వచ్చాడు.

శుభ్రంగా కడుపునిండా టిఫిన్ తిన్న తరువాత బ్రేవ్ మని తేన్చి, అమ్మాయి కోసం ఎదురు చూడసాగాడు పాపారావు. అంతలో తాయారు వచ్చింది. పాపారావును చూడగానే సరదాగా విజిల్ వేసింది. అంతలోనే పక్కనున్న అన్నయ్య కూడా గట్టిగా విజిల్ వేశాడు. పాపారావు చతుష్టయం ఈ విషయాన్ని గమనించలేక పోయారు. "తాయారు అన్నయ్య ఇంత మానర్‌లెస్‌గా విజిల్స్ వేస్తాడేమిటా?" అని జాలిపడ్డారు కూడాను.

అలా పాపారావు 'విక్టిమ్' అయిపోయాడు. ఆ తరువాత ఈ సలహా చెప్పిస్నేహితుల బారినుంచి తప్పుకొనే మార్గం బోధించాడు మామగారు.



పాపారావుకి తన భార్య అలవాటు సంగతి ఎలా తెలిసిందంటే అదీ పెద్ద కథే.

మొదటి రోజు రాత్రి... పందిరి మంచం మీద పాపారావు కాలుమీద కాలేసుకుని జిలేబి తింటున్నాడు. కొంచెం భోజన ప్రియుడులెండి. అగరొత్తులూ, మల్లెపూల వాసనతో గది గుభాళిస్తుంది. పాపారావుకి బెదురుగానే వుంది. అంతకు కొద్దిరోజుల క్రితమే రాజు దగ్గర శిష్యరికం పొందాడు పాపారావు. 'సలహా రాజు' అని అందరూ అంటూ వుంటారు కూడా. చిన్న సలహా అయితే కాఫీ, టిఫిన్ పెద్ద సలహా అయితే ఒక్క 'హాల్లో'.....రాజు ఫీజు! రాజుకి ప్రతి విషయంలోనూ ప్రవేశ ముంది (అని తనసనుకుంటూ వుంటాడు.)



'రెండు హల్లోలు' సమర్పించి రాజు దగ్గర తను మొదటిరోజు చెప్ప వలసిన డైలాగులన్నీ పాఠంలా బట్టీపట్టి, ఎందుకైనా మంచిదని కాపీ రాసుకుని జేబులో పెట్టుకున్నాడు.

తాయారు లోపలికి వచ్చింది. బయటవున్న ఆడంగులతో "గడియ బయట పెట్టుకోండి. లోపల గడియ సరిగ్గా పడదు" అని చెప్పి తలుపు వేసింది. పాపారావుని చూసి నవ్వి చుట్టూ కిటికీలనీ, బొందుల్నీ పరీక్షించసాగింది. పాపారావు మూర్ఛపోబోయి తమాయించుకున్నాడు. సలహా(రాజు చెప్పిన పాఠంలో ఇంకోలా వుంది. ఆ అమ్మాయి గడప దగ్గరే బొటన వేలితో పిచ్చిగీతలు గీస్తూ నిలబడి వుంటుందని సలహా (రాజు చెప్పిన పాఠంలో మొదటి పేరా నుంచీ కంటిన్యూ చేద్దామను కున్నాడు పాపారావు.

జూలియెట్ లాగా తాయారు నిలబడి వుందనుకొని, ఆమె ముందు మోకాళ్ళ మీద కూర్చుని రెండు చేతులూ పూర్తిగా చాపి "తాయారూ నా జీవనరంగానికి సితారూ" అని, తరువాత డైలాగు మర్చిపోయి లేచి నిలబడి సీరియస్‌గా జేబులో కాగితం కోసం వెతుక్కోసాగాడు. దిండు క్రింద పరుపు, దుప్పటి దులిపి అన్నీ గాలించాడు. లాభం లేకపోయింది. తాయారు అతణ్ణి చూసి జాలిపడి నవ్వింది.

ఇంక ఆ కాగితంతో లాభం లేదనుకొని పాపారావు ఆమెని దగ్గరికి తీసుకున్నాడు. తాయారు అతని మెడ చుట్టూ రెండు చేతులూ వేసి చెవి దగ్గరగా నోరుపెట్టి ఆనందంగా ఈల వేసింది. పాపారావు అదిరిపోయాడు. దయ్యమేమో అని క్షణం బెంగపడ్డాడు. ధైర్యం చేసి అదే అడిగాడు.

తాయారు కోపగించుకొని బయటికి పోబోయింది. పాపారావుకి తొలిరాత్రి ఆ విధంగా పాడవటం ఇష్టంలేక, రాజు చెప్పిన చివరిదీ – ఆఖరుదీ అయిన సలహా జ్ఞాపకం వచ్చి తాయారుని లాలించాడు.

శోభనం గది బయట వున్న పేరంటాళ్ళకి మాత్రం గదిలోంచి ఈల పాటలు వినిపించాయి. తాయారు సంగతి తెలియని పేరంటాళ్ళు మాత్రం.

"పెళ్ళికొడుకు చాలా హుషారుగా వున్నాడు" అనుకున్నారు–ఇలా మొదలయింది పాపారావు ఈల బాధ.

పొగడ చెట్టుక్రింద విరాగిలా కూర్చుని వున్న పాపారావు దిగులుగా వున్నాడు. మొన్న సినిమాలో జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చి అతడికి ఉబికి ఉబికి దుఃఖం రాబోతోంది. అసలేం జరిగిందంటే–

ఉద్యోగం రానిక్రితం పాపారావు ఎప్పుడూ సినిమాకి బెంచీకే వెళ్ళేవాడు. పెళ్లయ్యేక భార్యను తీసుకొని సినిమాకి వెళ్ళడం అదే ప్రథమం. 'కల్పనా'లో ఒక తెలుగు సినిమా ఆడుతూంది. ఆ సినిమా కాకినాడ ఏ పదోసారో రావడం. తాయారుకు స్టంటు సినిమాలంటే మహాఇష్టం. పాత సినిమా అయినా దానికే వెళదామంది. పాపం పాపారావుకేమి తెలుసు? ఎప్పుడూ శ్రీరామపట్టాభిషేకం లాంటివి చూస్తుం టాడు. "సరే" అంటూ సినిమాకి బయలుదేర దీశాడు భార్యని.



రిక్షా దిగి అలవాటు ప్రకారం ఎనభై పైసల టిక్కెట్టువైపు దారితీయబోయి ప్రక్కనే భార్య వుందని గ్రహించి, కుర్చీ టిక్కెట్టు తీసుకుంటే భార్య దృష్టిలో చులకన అయిపోతానని అభి మానపడి, రెండు రిజర్వుడు టిక్కెట్లు తీసు

కున్నాడు. తాయారు, పాపారావు కంటే నాలుగంగుళాలు పొడవు. ఇద్దరూ హాల్లోకి ప్రవేశించగానే అందరికళ్ళూ వాళ్ళ మీదే నిలిచాయి. రిజర్వుడు క్లాసులో అమ్మాయిలూ, అబ్బాయిలూ చాలా మంది వున్నారు. పాత స్టంటు సినిమాలంటే ఈ మధ్య అబ్బాయిలూ, అమ్మాయిలూ ఎందుకో తెగ ఇష్టపడుతున్నారు. అబ్బాయిల అల్లరి మామూలేగా. పాపారావుకి క్లాసులో ఎక్కడా రెండు సీట్లు పక్కపక్కగా కనిపించలేదు. తాయారుకి అమ్మాయిల మధ్య ఓ సీటు ఖాళీగా దొరికితే అందులో వెళ్ళి కూర్చుంది. ఆ వెనక వరసలో తాయారు సీటు వెనక కుర్చీలో పాపారావు కూలబడ్డాడు.

సినిమా మొదలయింది... ఒకచోట హీరో, కొండదొంగ ఒకడూ తీవ్రంగా దెబ్బలాడుకుంటున్నారు. అబ్బాయిలలోంచి (రిజర్వుడు క్లాసుల్లోంచి) ఎవరో గట్టిగా ఈలవేశారు. వెంటనే ఆ ఈలకి మంచి 'రెస్పాన్స్' వచ్చింది. హాలంతా విజిల్స్‌తో నిండిపోయింది.

అమ్మాయిలిదంతా చూస్తున్నారు. అందులో ఒక అమ్మాయి వుండబట్టలేక అనేసింది. "మనం మగవాళ్ళతో సమానమే కాని, ఈల మాత్రం వేయలేకపోతున్నాం" అని. అంతా చాలా సీరియస్‌గా బాధపడ్డారు.

అంతలో హాలంతా నిశ్శబ్దం అయిపోయింది. కొండచివర హీరో, విలన్‌లు పోరాడుతున్నారు. విలన్ క్రింద పడిపోయాడు. అంతే! నోట్లో వేలుపెట్టి నాలుక మడతేసి హాలు దద్దరిల్లేలా ఈల కొట్టింది తాయారు.

చాలా సీరియస్‌గా సినిమా చూస్తున్న పాపారావు పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపోయాడు. అమ్మాయిలంతా తాయారువైపూ, తమలో తామూ చూసుకున్నారు. చప్పట్లు కొట్టి తాయారుకి 'కంగ్రాట్స్' చెప్పారు. అమాంతం సినిమా ఆగిపోయింది. లైట్లు వెలిగాయి. తాయారు విజయ గర్వంతో అమ్మాయిలవైపు చూసింది.

పాపారావు అదఃపాతాళం ఎక్కడున్నా కనబడుతుందేమోనని వెతుక్కుంటూ ఉన్నాడు.

"మీ ఇల్లెక్కడండి?" ఒక అమ్మాయి అడిగింది.

"రామారావుపేట-ఈశ్వరా లైబ్రరీ దగ్గర!" అని చెబుతోంది తాయారు. పాపారావు తాయారు చెప్పేవన్నీ వింటున్నాడు. వాళ్ళంతా ఈల నేర్చుకోవడానికి ఇంటికి వస్తారట. అలాగే రమ్మంటూంది తాయారు. అంతలో రీలు తెగిపోయిన సినిమా మళ్ళీ మొదలయింది. మళ్ళీ యుద్ధం సీను వచ్చేసరికి తాయారు ఈల వెంబడి ఈల వేయటం మొదలుపెట్టింది. దానికి అమ్మాయిలంతా సపోర్టు.

హాల్లో పొగ త్రాగిన వారిని శిక్షించే నిమిత్తం వారిని హాలు బయటకు తీసుకుపోయి, వారి దగ్గర కొద్దో గొప్పో స్వీకరించి వదిలేసే పోలీసులిద్దరికీ అబ్బాయి ఎవరైనా అమ్మాయిల మధ్యలో ఈల కొడుతూ పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నాడేమోనని అనుమానం వచ్చింది.

తాయారు దగ్గరికి వచ్చి పరిశీలనగా చూడసాగారు... పాపారావు ఇంక సహించలేకపోయాడు. వెంటనే చివాల్న కుర్చీలోంచి లేచి, "తాయారూ! తల నొప్పిగా వుంది నేను వెళుతున్నాను" అంటూ బయలుదేరాడు.

✦ అవతలివారిలో నీకు నచ్చనది వారు అడిగితేనే చెప్పు. అడిగినప్పుడే చెప్పు. నువ్వు వారికి శ్రేయోభిలాషివి, గైడ్ వీ అయితే సముచిత సమయం చూసుకుని చెప్పు... అంతే తప్ప వారు ఆనందంగా ఉన్నప్పుడూ, అందర్లోనూ ఉన్నప్పుడూ చెప్పకు.

✦ మానవ సంబంధాలన్నీ ఉల్లిపాయలాంటివి. బంగారు రంగులో మెరిసే తొక్క పైనుంటేనే అది బాగుంటుంది. లేకపోతే వలిచే కొద్దీ కన్నీరు వస్తుంది.

✦ కోరిక తీరితే ఆనందం, తీరకపోతే విషాదం. మనిషి వీటికి ప్రాముఖ్యత ఇవ్వనవసరం లేదు. ఎందుకంటే ఇవన్నీ మనసు మనిషిపై ఆడే ఆటలు.

✦ గొప్ప విజయం సాధించినవాడికి తనకు ఇంతకు ముందున్న వ్యక్తిగత సమస్యలన్నీ చాలా చిన్నవిగా కనబడతాయి. జీవితం పట్ల అప్పటివరకూ ఉన్న అపోహలన్నీ సూక్ష్మంగా గోచరిస్తాయి. విజయం మిరుమిట్లు గొలిపే వెలుగు ముందు ఇవన్నీ మిణుగురుల్లాగా తొలగిపోతాయి.

✦ ఈ పనికి చేసే శక్తి నాకు లేదని నువ్వు ఎప్పుడైతే తరచూ అనుకోవటం ప్రారంభించావో, అప్పటి నుంచీ నీవు నిదురించాల్సింది ఏనుగుల మధ్య కాదు. దోమల మధ్య.



తాయారు తన కుర్చీలోంచి లేచి, పతిననుసరించింది. విషయం అర్థమయిన పోలీసులిద్దరూ బీడీలు వెలిగించి దమ్ములాగి అక్కడే సర్దుకున్నారు.

పాపారావు తాయరుతో సహా రిక్షా ఎక్కి ఇంటికి చేరాడు.

తాయారు లోపలికి రాగానే... "తాయారూ!... నువ్వలా ఈల వేయచ్చా?" అంటూ సన్నగా చివాట్లు వేశాడు.

"మీ మగవాళ్ళు వేయవచ్చా!" అంటూ మళ్ళీ వేయబోయింది.

"నాకు కోపం తెప్పించకు" అన్నాడు భయపడుతూనే. ఎందుకంటే, తాయారు బరువూ, ఎత్తూ పాపారావు కంటే ఎక్కువే.

✦✦✦

పాపారావు బాధపడుతూ సిమ్మెంటు బెంచీ మీద నించి లేచి పార్కులోంచి ఇంటికి బయలుదేరాడు.

భోజనం చేసి పడకగదిలో తీరికగా కూర్చుని ఉండగా... ఇంటి ముందు రెండు రిక్షాలు ఆగి, నాలుగు సీతాకోక చిలుకలు దిగినాయి. పాపారావు కిటికీలోంచి చూస్తూండగానే, తాయారుగారి ఇల్లు యిదేనా, అని వాళ్ళు అడగడం, తాయారు లోపల నుంచి వచ్చి ఎవరు కావాలండీ అని అడగడం జరిగినాయి. పాపారావు ఆశ్చర్యపడుతూ ఉండగానే వాళ్ళలో ఒక అమ్మాయి "మీరే కావాలండీ! ఆ రోజు సినిమా హాల్లో సంగతి మరిచిపోయినట్టున్నారు." అని అంది.

తాయారు హుషారుగా ఒక్కసారి ఈల వేసి– "రండి రండి. మరిచి పోయాను సుమండీ" అంటూ ఆహ్వానించింది.

హాల్లో అమ్మాయిలు గుసగుసగా మాట్లాడుకుంటున్నారు.

"సమయానికి మావారు ఇంట్లో లేరు. ఉంటే ఎంతో సంతోషిద్దురు" అని పడక గది దగ్గరకు వెళ్ళి బయట గొళ్ళెం పెట్టేసింది.

"బయటికొచ్చుడా పోనివ్వకుండా ఏమిటి బందిఖానా!" అని తాయారు మీద బోలెడు కోప్పడిపోయి... బయటవాళ్ళ మాటలు వినసాగాడు.

"మేమంతా ఉమెన్స్ కాలేజీలో బి.యస్.సి. చదువుతున్నాం."

"నా పేరు తాయారు. అదిగో ఆ ఫోటోయే మావారు. పేరు నేను చెప్పకూడదులెండి. ఆయన స్టేట్‌బ్యాంక్‌లో కాషియర్."

"మీ వారెప్పుడు వస్తారండీ?" అంటూంది ఓ అన్నుల మిన్న.

"సాయంత్రం దాకా రారండి– వూరెళ్ళారు" అంది తాయారు.

ఒక క్షణం నిశ్శబ్దం.

"మీరంత గట్టిగా ఎలా ఈల వేస్తారండీ? అసలు మీరిలా ఈల వేయడం మీ వారికి ఇష్టమేనా?" అని పత్రికా విలేఖరుల్లాగ ప్రశ్నలు గుప్పించారు. తాయారు అన్నిటికీ ఓపిగ్గా సమాధానాలు ఇస్తూంది.

"మా వారు, నేనూ కలిసి, మెలిసి ఉంటామండి... ఎప్పుడూ నన్ను ఈల వేయమని ఆయనే ప్రోత్సహిస్తూంటారు. తన జీవన రాగానికి నా ఈలే పల్లవి అని కవిత్వం చెబుతూ వుంటారు కూడా."

ఒళ్ళు మండిపోతూంది పాపారావుకి.

"సరే ఇక పాఠం మొదలు పెడదామా" అని ఒక అమ్మాయి అనేసరికి అంతా ఘొల్లున నవ్వారు.

నవ్వులు తగ్గిన తరువాత "ఇదిగో ఈల అంటే ఇలా వేయాలి!" అని నోట్లో వేలుపెట్టి, నాలుక మడత వేసి విజిల్ వేసింది.

అంతా చప్పట్లు చరిచారు.

ఆ తరువాత ఒకరి తరువాత ఒకరు ప్రయత్నిం చారు. కానీ, ఎవరూ చేయలేకపోయారు.

"మీరు ప్రయత్నించి చూడండి. నేను పొయ్యి మీద ఎసరు పడేసి వస్తాను." అంటూ తాయారు వంటింట్లోకి వెళ్ళింది.

హాలంతా ప్రాక్టీసు మొదలయింది. ఇలాగే ఇంకెంత మందిని ఈల కత్తెలుగా తయారుచేసి వాళ్ళ మొగుళ్ళని బాధపెట్టనుందో...అని అను కుంటూ తల పట్టుకున్నాడు పాపారావు.

బయట ఇష్టారాజ్యంగా ఈల ప్రాక్టీసు సాగు తోంది. అంతలో ఒక అమ్మాయి తన ప్రయ త్నంలో సఫలీకృతురాలై గట్టిగా ఈల వేసింది. ఈల వెంట ఈల.

తెలుగు నవలా ప్రపంచంలో యండమూరి వీరేంద్రనాథ్ సృష్టించిన ప్రభంజనం అపూర్వమైనది. 1970,80 మరియు 90లలో పాఠకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా, తెలుగు పాపులర్ సాహిత్యంలో శైలీపరమైన, వస్తుగతమైన విప్లవాన్ని తీసుకువచ్చారు.

యండమూరి రచనల్లో ప్రధాన బలం ఆయన గ్రిప్పింగ్ నేరేషన్ (సస్పెన్స్ నడిపించే తీరు). ప్రతి పేజీలోనూ పాఠకుడికి ఉత్కంఠ కలిగిస్తూ, కథనాన్ని వేగంగా ముందుకు నడిపించే శైలి ఆయన సొంతం. సైకాలజీ, సైన్స్, ఫిలాసఫీ మరియు సమాజంలోని సమస్యలను మిళితం చేసి సస్పెన్స్ థ్రిల్లర్లుగా మలచడంలో ఆయన దిట్ట.

విలక్షణమైన పాత్రలు, ఆయన నవలల్లోని నాయకులు సాధారణంగా పర్ఫెక్ట్‌గా ఉండరు. అహంకారం, తెలివితేటలు, పట్టుదల కలిగిన యాంటీ-హీరో శైలి పాత్రలకు (ఉదాహరణకు 'తులసిదళం'లో తులసి, 'వెన్నెల్లో ఆడపిల్ల'లో) ప్రాణం పోశారు. ఏ అంశంపై రాసినా దానిపై లోతైన అధ్యయనం చేయడం ఆయన ప్రత్యేకత.

సస్పెన్స్, సైన్స్ థ్రిల్లర్స్, వైద్య పరిశోధనలు, మానసిక సంఘర్షణ, మేధోపరమైన సంభాషణలు, మనస్తత్వ విశ్లేషణ, వ్యక్తిత్వ వికాసం మొదలయిన అంశాలను పాఠకులను మెప్పించే విధంగా రచించటం ఆయన ప్రత్యేకత.

ఆయన రచనలు తెలుగు కథా సాహిత్యంలో సీరియల్ సంస్కృతికి కొత్త జీవం పోసి, ఒక తరం పాఠకులను పుస్తకాలు చదివేలా ఉత్తేజపరిచాయి.

అందరికీ వచ్చేసినట్టే గది అంతా విజిల్స్‌తో నిండి పోయింది.

పాపారావుకి భూమి గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. హాలులో గోల ఎక్కువైంది. ఆ ఇంట్లో ఏమయినా గొడవ అవుతోందేమోనని పక్కింటివాళ్ళు ఒకరిద్దరు తొంగిచూసి వెళ్ళిపోయారు.

పాపారావు వున్న గది కిటికీ వీధి వేపున వుంది. హాల్లో తొంగిచూసి వెళ్ళిపోతూ వాళ్ళలో వాళ్ళు అనుకున్న మాటలు పాపారావు చెవిలో పడ్డాయి.

“మొగుడు ఆడారివాడయితే పెళ్ళాలు మొగుళ్ళవుతారు. ఈ అమ్మాయిని ఈ ఇంట్లో కొచ్చిన దగ్గర్నుంచి చూస్తున్నాను – ఇంత పిసరు లెక్క లేదు సరికదా, పైగా మొగుడే ఈ అమ్మాయికి భయపడతాడు.” ఈ మాటలు తాయారు వేసిన ఈలకంటే ఎక్కువ బాధ పెట్టినాయి.

“నేను ఒన్, టూ, త్రీ అనగానే అంతా ఒకసారి ఈల వెయ్యండి చూద్దాం” అని ఆఖరి పాఠం చెబుతోంది తాయారు.

“సరే, సరే!” అన్నారందరూ.

“ఒన్....టూ....”

“తాయారూ? తలుపు తియ్యి!” అని ఒక్కసారి గర్జించాడు పాపారావు. అమ్మాయిలకి ఏమీ అర్థం కాలేదు. పడకగదివైపు, తాయారు వైపు చూశారు. తాయారు అంతలో సర్దుకొని.....

“కూర్చుందురూ... హాల్లో ఆడవాళ్ళున్నారు!” అంది.

“తలుపు తీస్తావా? తన్నమన్నావా!” బెడ్‌రూమ్‌లో నుంచి కేక వినిపించింది.

“ఎంత ధైర్యం? రండి! ఎలా తంతారో చూస్తాను!” అని నడుం బిగించింది తాయారు.

అమ్మాయిలంతా విస్తుపోయి, ఈల సంగతెలా వున్నా ఇక్కడేదో ఘోరావమానం జరుగుతుందేమోనని భయపడటం మొదలు పెట్టారు.

“మీకేం భయంలేదు” అని వాళ్ళకో అభయహస్తం చూపించి వెళ్ళి గొళ్ళెం తీసింది.

పాపారావు ఆవేశంతో రొప్పుతూ హాల్లోకి వచ్చి పడ్డాడు.

అమ్మాయిలవైపు తిరిగి...... “మీకు సిగ్గూ–ఎగ్గూ లేదా? ఈల నేర్చుకొంటే ఫలితం ఏమిటో ఇప్పుడు చూద్దురు గానీ...” అన్నాడు.

“ఏమిటండీ చూసేది? పరాయి వాళ్ళ ముందు ఎప్పుడూ లేంది – ఇలా అవమానిస్తారా?” అంటూ ఆడపులిలా దూకబోయింది తాయారు.

పాపారావు వంటింట్లోకి పరిగెట్టాడు. హాల్లో అమ్మాయిలకి ఇదంతా సినిమాలా వుంది. అంతలో పాపారావు బయట కొచ్చాడు.

ఈసారి చేతిలో కత్తిపీట వుంది. పాపారావు అవతారం చూసి తాయారే భయపడింది. పాపారావు విజ్రుంభించాడు. ఇకముందేం జరుగుతుందోనన్న ఆలోచన లేకుండా, ఏదో సినిమాలో రాకుమారుడు మంత్రగత్తె జుట్టు కోసేసినట్టు తాయారు మెడవంచి జుట్టు కోసేశాడు.

నలుగురమ్మాయిలూ అది చూసి పరిగెత్తి వెళ్ళిపోయారు బయటికి.

తాయారు ఏమి జరిగిందో తెలుసుకునే లోపున చేతిలో కొచ్చిన జడను విసిరేసి, “నువ్వేసిన వేషాలకి అసలు చంపేద్దును. వట్టి మనిషివి కావని ఇంతటితో వదిలాను. ఇప్పుడు పోవే! పుట్టింటికి పోతావో... ఉప్పుటేర్లో దూకుతావో!” అంటూ వీధి తలుపు గడియవేసి మళ్ళీ తాయారు దగ్గర కొచ్చాడు.

మోకాళ్ళ మీద తల పెట్టుకుని తాయారు ఏడుస్తూంది. పాపారావుకి జాలివేసింది. “తాయారూ! ఎందుకు చెప్పు... నన్ను బాధపెట్టడం... నువ్వు బాధ పడటం” అన్నాడు బాధపడుతూ.

తాయారు తల ఎత్తి– “క్షమించండి ఇంకెప్పుడూ ఈల వేయనుగా!” అంది.

కత్తిపీట వదిలేశాడు పాపారావు.

“ధన్” మని చప్పుడయింది. మెలకువ వచ్చింది పాపారావుకి.

వంటింట్లో డబ్బా ఏదో క్రిందపడినట్టుంది. పక్కకి తిరిగి చూశాడు.

తాయారు లేదు. తెల్లవారిపోయిందన్న మాట అనుకున్నాడు.

అంతలో తాయారు స్నానాల గదిలోంచి బయటికొచ్చి పక్కగదిలోకి వెళ్ళిపోయింది. తలారా స్నానం చేసిందేమో, అందంగా జుట్టు భుజాల మీదనుంచి క్రిందికి జారుతోంది. పాపారావు తలగడలో తలదాచుకొని గుండెలనిండా గాలి పీల్చుకొన్నాడు.

పక్క రూములోంచి సన్నగా ఈల వినిపించడం మొదలెట్టింది... సుప్రభాతం ట్యూన్‌లా.

(జంధ్యాల సినిమాలో వచ్చిన కథ.)

✦ లోకంలో కొందరు ఎప్పుడూ ఆనందంగా ఉండరు. వారి చుట్టూ నిరాశ పేరుకుని ఉంటుంది. భవిష్యత్తు మీద ఎప్పుడూ బెంగే. అలాంటివారితో ఉంటే మనకూ జీవితం నిస్పృహగా అనిపిస్తుంది. జీవితంలో గెలవాలంటే అన్నిటి కన్నా ప్రథమంగా వీరి నుంచి వీలైనంత వరకూ దూరంగా ఉండాలి.

✦ ఈ రోజే పని చెయ్యి. మనిషి తన జీవితకాలంలో ఎంత శ్రమపడినా రెండు రోజుల పాటు ఏ పనీ చేయ లేడు. నిన్న, రేపు! నిరాశావాది నిన్నటి గురించి విచారిస్తూ పని చెయ్యడు. బద్ధకస్తుడు రేపు చేద్దాంలే అనుకుంటాడు.

✦ అదృష్టాన్నీ, జాతకాన్నీ నమ్ముకోకుండా స్వశక్తిని నమ్ముకున్నవారికి జీవితమంతా గొప్ప సంతృప్తి.

✦ ఐశ్వర్యవంతుడంటే బాగా డబ్బున్నవాడు కాదు, ధనాన్ని ఎలా వాడుకోవాలో తెలిసినవాడు.

✦ జీవితం వాహనమైతే, ‘అలవాట్లు’ దాని చక్రాలు. గమ్యంచేరుకోవటం అన్నది, నడిపించేచక్రాల మీద ఆధారపడి ఉంటుంది.

✦ అమాయకత్వంలో స్వార్థం ఉండదు. అజ్ఞానంలో తనకి అన్నీ తెలుసన్న అహం, కావాలన్న స్వార్థం ఉంటాయి.

యండమూరితో చంద్ర

(ముప్పై సంవత్సరాల క్రితం ఇంటర్వ్యూ)

ఇంపాలా కారులో షికారు కొడుతున్న తెలుగు నవలని, మరుక్షణం ఏమౌతుందోననే'సస్పెన్స్'లో ముంచి 'వచ్చేవారం కలుస్తానోచ్' అంటూ ఉడాయించేసి, పాఠకుల్ని ఎదురుచూసేలా నిలేసి, తను మాత్రం వెయ్యి కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయిన రచయిత 'యండమూరి వీరేంద్రనాథ్'. (ఒకప్పుడీ రచయిత 'స్లో మూవీ ఆర్ట్ ఫిల్మ్'దర్శకుడు మృణాల్సేన్ 'ఒక ఊరి కథ'కు డైలాగ్ రైటర్). ఇంత వేగం ఉన్న రచయితను అంతే వేగంగా విజువలైజ్ చేశాడు ఆర్టిస్ట్ చంద్ర. ఇద్దరూ మంచి మిత్రులు. 'ఇమేజినేషన్'కూ, 'విజువలైజేషన్కూ మధ్య అవగాహన ఏరేంజ్లో ఉండాలో తెలిసిన ఈ మిత్రులు పిచ్చాపాటీ మాట్లాడుకున్నవి ఇక్కడ యథాతథంగా ఇస్తున్నాం.

చంద్ర: ఏ రకమైన ఇన్హిబిషన్స్ లేకుండా...నేటి సాహిత్యం గురించి ఓపెన్‌గా డిస్కస్ చేద్దామని వచ్చాను. కావాలంటే ఈ ఇంటర్వ్యూని ప్రింట్‌కి ఇచ్చేముందు నీకోసారి చూపిస్తాను.

వీరేం: నాకు చూపించక్కర్లేదు. చెండాడు.

చంద్ర: రైట్. మొదటి ప్రశ్న. దశాబ్దంగా కథలు, నాటకాలు, నవలలు వ్రాసి ఈ రోజు ఒక స్థాయికి చేరుకున్నావు కదా! ఇవ్వాళ నీ 'స్థాయి' పట్ల నీకు ఎలాంటి తృప్తి ఉంది?

వీరేం: తృప్తి అనేది రిలేటివ్ టర్మ్. నాటకాలు వ్రాసే రోజుల్లో కాకా హోటల్లో అర్థరాత్రి ఒంటిగంట వరకూ టీ తాగుతూ సాహిత్యం గురించి మాట్లాడుకుంటూ, సాహిత్యానికి పెద్ద సేవ చేస్తున్నామని అనుకునే స్థాయిలో కొంతకాలం ఉన్నాను. అది ఒక రకమైన తృప్తి. పెద్ద పెద్ద సినిమా ఫంక్షన్స్‌లో షీల్డ్స్ అందుకోవటం కూడా ఒక తృప్తే. అందుకే తృప్తి ఒక రిలేటివ్ టర్మ్.

చంద్ర: కానీ ఇందులో చిన్న లొసుగు ఉంది.

వీరేం: ఏమిటి?

చంద్ర: యండమూరి ముందు, వెనుక చాలామంది రచయితలు వచ్చారు. పోయారు. నీకన్నా ముందు నుంచీ రాస్తున్నవాళ్ళూ ఉన్నారు. డబ్బులో, పేరులో నువ్వే నెంబర్ వన్. సరే!... అయితే సాహిత్యపరంగా ఇదంతా నీకు నిజంగా తృప్తినిస్తోందా అని?

వీరేం: డబ్బున్నోడికి రాత్రిళ్ళు నిద్ర పట్టదన్న అభిప్రాయం సామాన్యుడికి తృప్తినిస్తుంది.

చంద్ర: సమాధానం దాటవేస్తున్నావు.

వీరేం: తృప్తి కోసం ఋషి, ఆనందోబ్రహ్మ, థ్రిలర్‌లాంటి నవలలు వ్రాశాను. రాబోతున్న 'చీకట్లో సూర్యుడు' కూడా అలాంటిదే. కానీ వ్రాయకూడదు. ఎందుకంటే ఇలాంటివి ఇంకో అయిదారు వ్రాస్తే, గన్‌షాట్‌గా పాఠకుల ఎక్స్‌పెక్టేషన్, తద్వారా పాపులారిటీ తగ్గిపోతుంది. పాఠకుల కోసం/ఎడిటర్ల కోసం పాపులర్ నవలలు వ్రాయాలి. నీకో విషయం తెలుసా? ఆనందో బ్రహ్మ సీరియల్ అయిదు వారాల తరువాత ఎడిటర్ ఆపెయ్యమన్నాడు.

చంద్ర: ఇది మంచి నవల, ఇది పాపులర్... అని రచయితకి ముందే తెలుస్తుందా?

వీరేం: నాకు తెలుస్తుంది.

చంద్ర: మరేం చేస్తావ్?

వీరేం: 'ప్లీజ్... ప్లీజ్' అని ఎడిటర్లని బ్రతిమాలుకుంటాను. ప్రార్థన, ఆనందోబ్రహ్మ ఆపొద్దని అలానే బ్రతిమాలాను.

చంద్ర: 'గుండె క్రింద తడిని తాకటం లేదా కదిలించటం' ఇవ్వాల్టి రచయితలు చాలామందికి తెలీదు. చేతకావటం లేదు కూడా.

వెన్నెల్లో ఆడపిల్ల, ప్రార్థన, నల్లంచు తెల్లచీర, వెన్నెల్లో గోదారి... వీటిల్లో, చివరికి 'తులసిదళం' నవల తీసుకున్నా, చాలా సందర్భాల్లో ఈ 'గుండె కింద తడి', అంటే పాఠకుల మనసు లోతుల్ని తట్టే సెన్సిటివ్ ఫీలింగ్స్‌ని చాలా చక్కగా, కొండొకచో అద్భుతంగా కూడా వ్రాసావు.

వీరేం: వీపు గోకకు. ప్రశ్నలు అడుగు.

చంద్ర: (నవ్వు) కారం జల్లే ముందు గోకాలిగా! వస్తున్నా... జీవితం పట్ల ఇంత అవగాహన, పరిశీలనా ఉన్న నువ్వు, ఇలా థ్రిల్లర్స్ కాకుండా సాహిత్యంలో నిలిచిపోయే సామాజిక రచనల్నీ, సీరియస్ నవలల్నీ ఎందుకు ఎక్కువ వ్రాయవు?

వీరేం: నా మొదటి రచన 'గులకరాళ్ళు-గులాబిముళ్ళు' వ్రాసిన రోజు నుండీ నేన్నీకు తెలుసు.

చంద్ర: ఆ రోజూ... ఈ రోజూ పాఠకుల స్థాయి అదే!

వీరేం: వారి స్థాయి కాదు. నా స్థాయి మారిందంటున్నాను. నాలుగు సినిమాలు, అయిదు షూటింగులూ, మూడు నవలలూ, ఇంటర్వ్యూలు ఈ హడావుడిలో నేను ఆ 'తడి' ఆస్పెక్ట్‌లో ఇన్ని రాయలేను. ఈ ఆర్ద్రత, స్పందన అన్నవి రచయిత పెట్టుకుంటే –హి విల్ బికం ఎ గుడ్ రైటర్! బట్ నాట్ ఎ కమర్షియల్ రైటర్!

చంద్ర: అంటే...రచయిత పాఠకులని 'డ్రైవ్' చెయ్యటం అంటూ ఏమీ ఉండదు.

వీరేం: ఎవరైనా రచయిత 'నేను పాఠకులని పైకి తీసుకు రావటం కోసం వ్రాస్తున్నాను' అనుకుంటే, అంత కంటే ఆత్మవంచన మరోటి లేదు.

చంద్ర: ఇలా ఒక మంచి నవల, ఒక చెడు నవల...

వీరేం: చెడు నవల ఏమిటీ? కమర్షియల్ నవల అను.

చంద్ర: ఐ.క్యూ. ఎక్కువ ఉన్న పాఠకులకి చెడు నవలే కదా!

వీరేం: రైటర్స్ రెండు రకాలుగా ఉంటారు. రీడర్స్ రైటర్స్, రైటర్స్ రైటర్స్. ఈ రెండో రకం రచయితలు మేధావులుగా పరిగణింప బడతారు.

చంద్ర: కరెక్ట్‌గా నా దారికి వచ్చావు. చాలా సందర్భాలలో నువ్వు శ్రీశ్రీ నో, కృష్ణశాస్త్రినో, తిలక్‌నో, కరుణశ్రీనో, కుటుంబ రావునో, చలాన్నో... వాళ్ళ పేరాల్నిగానీ, కవిత్వాన్నిగానీ నీ నవలల్లో కోట్ చేశావు... అలాంటప్పుడు నువ్వు రాస్తున్న సాహిత్యం నీ తర్వాత రచయితలు కూడా కోట్ చేసే స్థాయిలో ఉండాలని నువ్వు అనుకోవటంలేదా?

వీరేం: నేను పోయాక కోట్ చేస్తారేమో.

చంద్ర: నీ మీద క్రిటిసిజం ఏమిటంటే, అసలు ఈ వీరేంద్రనాథ్‌కి సైన్సు ఎలా తెలుసు?... ఏ అధికారంతో 'చీకట్లో సూర్యుడు' వ్రాస్తున్నాడు?' అని.

వీరేం: ఏ స్థాయి సైన్స్ స్టూడెంట్‌నయినా రమ్మను. అతన్ని నేను ఓ పది ప్రశ్నలూ, నన్ను అతను ఒక పది ప్రశ్నలు వేసుకుంటాం. ఎవరెన్నింటికి జవాబు చెబుతారో చూద్దా గాని.

చంద్ర: నువ్వు నీ రచనల ద్వారా సంఘానికి చేసిన మంచీ, మేలూ ఏమీ లేదని నీ విమర్శకులు అంటారు.

వీరేం: గీతా కేఫ్‌లో ఇడ్లీ బావుంటుంది. వెళ్దామా? హానీ చేయ్యదూ! మేలూ చెయ్యదు! బావుంటుంది!!

చంద్ర: టాపిక్ మార్చకు.

వీరేం: మార్చలేదు. నా సంధానం మళ్ళీ చదువు. నా ఉద్దేశ్యంలో ఏ రచయితయినా సంఘాన్ని మార్చటానికి రచనలు చేయ కూడదు. వ్యక్తుల్ని మార్చటానికి రచనలు చేయాలి.

చంద్ర: భవిష్యత్తులో పాపులర్ సాహిత్యం ఎలా ఉండబోతుంది?

వీరేం: ఏమీ ఉండదు!

చంద్ర: ఏమి మాట్లాడుతున్నావు నువ్వు?

వీరేం: స్వతంత్రం వచ్చిన కొత్తలో... సామాన్యుడి జీవితం గురించి ఆనాటి రచయితలు అసాధారణ రచనలు చేశారు. ఆ తర్వాత రచయిత్రుల కాల్పనిక ఆకర్షిత సాహిత్యం వచ్చింది. ఆపై మనోవికాసంతో కూడిన మరో రకం పాపులర్ రచన వచ్చింది. ఇక్కడితో ఇది ఆగిపోయింది. మరో రచయిత గానీ రచయిత్రి గానీ వచ్చి ట్రెండ్ సెట్ చేస్తే పాపులర్ నవల ఇంకో తరం పాటు నిలబడుతుంది. లేదంటే భవిష్యత్తులోవారపత్రికలు గానీ, మాస పత్రికలు గాని ఉండవు. 'మా పుస్తకం చదవండి. మా కథ చదవండి ప్లీజ్' అని రచయితలు రచయిత్రులు ఫ్రీగా వదలాల్సిందే. పది రూపాయలు పెట్టి పుస్తకం కొంటే దానికి సరిపడా సంతృప్తి రావాలి కదా!

చంద్ర: అలాంటి మరో రచయిత భవిష్యత్తులో వస్తారని ఆశిస్తూ... సెలవు!

కథ

ఉత్తిపుణ్యంతు

యండమూరి వీరేంద్రనాథ్

ముళ్ళపూడి వెంకట్రమణ కథల్రాయటం మానేసాక... ఆ తరం వెళ్ళిపోయి రామకృష్ణాబీచ్ వెలవెలబోతూంది.

వైజాగ్‌లోఅబ్బాయిలూ అమ్మాయిలూ సుబ్బరంగా చదువు కుంటున్నారు. రాధలు ముగ్గులేయటం మానేసారు. బామ్మలు బాబాయిలకి డబ్బులివ్వటం ఆపుచేశారు. తెలుగుతనం పారి పోయి... ప్లిమత్ కార్లూ యమా సస్పెన్సులూ వచ్చేశాయి.

అటువంటి సాయంత్రం జరిగిందీ సంఘటన.

అసలు శ్రీధరం బాగానే వుంటాడు. కొనదేలినముక్కు, రెండ్రోజులకో సారి గీసే గడ్డం, పొడుగ్గా చువ్వలా వుంటాడు.

శార్వాణి ఆఫీసులో చేరేముందే బామ్మ చెప్పింది.

“ఒసే పిల్లా! కాలేజిలో చదువుకున్నట్టు కాదు. ఆఫీసులో జాగ్రత్తగా వుండు. అల్లరి చేయకు” అని. శార్వాణి బుద్ధిగా తలూపింది.

ఇప్పుడు ఆఫీసు కూడా అదే ఏరియా. అందువల్ల ఆఫీసు కొత్తగాఏమీ లేదు. అందులోనూ సూపర్నింటెండెంటు మంచాయన. ఇద్దరు ముగ్గురు అమ్మాయిలుకూడా వున్నారు. అన్నింటికన్నా చిత్రమేమిటంటే ఆఫీసులో అందరూ దాదాపు చిరునవ్వుతో సంతోషంగా వున్నారు. ఒక కుటుం బంలా వున్నారు.

శార్వాణికి ఆఫీసు బాగా నచ్చింది.

ఇంటి దగ్గర బయల్దేరితే బీచ్ ప్రక్కనుంచే పదినిముషాల నడక.

దూరంగా యూనివర్సిటీ క్వార్టర్సు.

ఆఫీసంటే పెద్దహాలు కాదు. ఏదో ప్రైవేటుబిల్డింగు అద్దెకి తీసు కున్నారు.మధ్యలో హాలుంది. అందులో సూపర్నింటెండెంటు కూర్చుం టాడు. మరో ఆరుగురు వుంటారు. మిగతావి గదులు. ఒక గదిలో శార్వాణి టేబులుంది. పక్క టేబులు శ్రీధరానిది. అతడు శలవులో వున్నాడు.

ఆఫీసులో వున్న మిగతా ముగ్గురమ్మాయిల్లో జయంతి బాగా నచ్చింది శార్వాణికి. ఆఫీసు విశేషాలన్నీ ఆ అమ్మాయే శార్వాణికి చెప్పింది.

అదే ఆఫీసులో వున్న కమలకి ఈ శ్రీధరం, బీరకాయ పీచు వరసలో అన్నయ్య అవుతాడు. ఇంకో విషయం ఏమిటంటే ఈ సదరు శ్రీధరాన్ని ఆఫీసులో అందరూ ప్రేమిస్తారు. అలా అన్చెప్పి అతడేం రచయిత కాడు. క్రికెటు ప్లేయరూ కాదు. కనీసం నాటకాలు కూడా వెయ్యడు. కానీ అందరి తలలో నాలుకలా వుంటాడు.

“ప్చ్!అతడు లేకపోయేసరికి ఆఫీసంతా డల్‌గా వుందోయ్!” అని జయంతే చాలాసార్లు అంది. అటువంటి శ్రీధరం అంటే శార్వాణికి ప్రస్తుతం పీకల్దాకా కోపం వుండటానికి కారణం కనుక్కోవాలంటే నాల్రోజులు వెనక్కి వెళ్ళాలి.

టేబుల్ ముందు కూర్చొని పని చేసుకుంటూంది ఆమె.లంచ్ అవర్ దగ్గర పడటంతో బైట నిశ్శబ్దంగా వుంది.ఆ గదిలో పక్క టేబిల్ మీద ఫైళ్ళు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. ఆ టేబిలు శ్రీధరానిది.

“వచ్చాక ఇంత వర్కు ఎలా పూర్తి చేస్తాడోఏమో?” అంది జయంతి వాటికేసి చూస్తూ.

“మనలాగా ఆపసోపాలు పడుతూ మాత్రం చేయడ్లే!”అంది కమల తన కజిన్ బ్రదర్ని వెనకేసుకొస్తూ.

ఆఫీసుకు రాగానే ఒకసారి ఆ టేబుల్‌కేసి చూసి... తన పనిలో కూర్చోవటం అలవాటయింది శార్వాణికి.

ఆ రోజూ అలాగే చేసింది.

లంచ్ అవర్‌కి ఇంకో అయిదు నిమిషాలుందనగా అతడు ప్రవేశిం చాడు. ఆమె తలెత్తి “ఏం కావాలి?” అంది.

అతడు క్షణం దెబ్బతిన్నాడు. తడబడి “కోళ్ళు”అన్నాడు.

ఉలిక్కిపడి “కోళ్ళా?” అంది. ఆమె పనిచేసేది ఎరువుల ఆఫీసు.



“కాదు, ఫీడ్!” అన్నాడు.

ఆమె అతడివైపు జాలిగా చూసింది.

చదువుకున్నవాడిలాగే కనబడుతున్నాడు. బహుశ వ్యవసాయంలో దిగాక చదువు మర్చి పోయి వుంటాడు.

“ఇది పౌల్ట్రీఫీడ్ (కోళ్ళకి వేసే ఆహారం) అమ్మే ఆఫీసు కాదు. మెన్యూర్స్ డిస్ట్రిబ్యూషన్ – అంటే ఎరువుల పంపిణీ ఆఫీసు” అంది ఒక గ్రామీణ వ్యవసాయ విస్తరణాధికారిలా వివరిస్తూ.

“అలాగా!” అన్నాడు అతడు తలపైకెత్తి పైన ఫానుకేసి, పక్కనున్న బీరువాలకేసి చూస్తూ.

“మీకు కోళ్ళఫీడ్ కావాలంటే... జగదంబా టాకీస్ దగ్గరికి వెళ్ళండి. అక్కడుంది!”

"మరిక్కడేమి అమ్ముతారు?"

"ఇది ఎరువుల ఆఫీసు!"

"నాకు బీరకాయలకి వేసే ఎరువు కావాలి. అలాగే వంకాయల క్కూడా!" అన్నాడు అమాయకంగా.

"ఇది అమ్మేషాపు కాదు. కేవలం డిస్ట్రిబ్యూషన్ ఆఫీసు. మీకు బీర కాయల ఎరువులు కావాలంటే యూనివర్సిటీ సైకాలజీ డిపార్టుమెంటు పక్కసందులోకి వెళ్ళండి. దొరుకుతుంది." అంది.

"మరి వంకాయలకి?" అన్నాడు.

"మీకెంత పొలముంది?" అని అడిగింది.

"ఓ ఇరవై ఎకరాలు. సముద్రం పక్కనే!" అన్నాడు.

"వంకాయలకీ బీరకాయలకీ ఒకటే" అంది ఓపిగ్గా.

"బంగాళాదుంపలకి?" అన్నాడు.

కొంచెం విసుగేసింది.

"ఆ! వాటిక్కూడా" అంది.

"భూమిలోపల వుండే వాటికి, భూమి బయట వుండేవాటికి ఒకే ఎరువులు ఎలా ఉపయోగపడ తాయి? ఫార్మర్ రిక్వైర్స్ నైట్రోజన్ అండ్ పొటాషియం" అన్నాడతను.

ఆమె అదిరిపడింది.

ఇంతలో కమల లోపలికి వస్తూ...

"హాయ్! అన్నయ్యా, ఎప్పుడొచ్చా వురా?" అని అడిగింది.

దాదాపు అయిదునిమిషాల్లో ఈ సంగతి ఆఫీసు అంతా పాకి పోయింది. తను శ్రీధరాన్ని మోతుబరి అని అనుకోవటం, బంగాళాదుంపలకీ, వంకాయ లకీ ఒకే ఎరువు వేయమని సలహా ఇవ్వటం కథలు కథలుగా అందరూ చెప్పుకుని నవ్వుకుంటున్నారని శార్వాణి గ్రహించింది.

ఇంతకు ముందు ఆ అమ్మాయిని ఎవరూ పట్టించుకునేవారుకాదు. కొత్తగా వచ్చిన అమ్మాయి కదా అని మొహ మాటంగా, గౌరవంగా వుండేవారు. కానీ ఇప్పుడు తను క్యాంటిన్‌లోకి ప్రవేశించ గానే అందరూ ముసిముసిగా నవ్వటం ఆమె కళ్ళబడుతూంది. ఈ కోపమంతా శ్రీధరం మీదికి తిరిగింది. అతడు మాత్రం ఏవీ పట్టనట్టు తన పని చూసుకుంటున్నాడు.

ఈ గొడవ ఇక్కడితో ఆగేదే – రెండ్రోజుల తరువాత అది జరగక పోతే... ఆ రోజు అయిదింటికి సీటు కట్టేసి లేచింది. పక్కసీట్లో శ్రీధరం ఇంకా పనిచేసుకుంటున్నాడు. అతడు ప్రతిరోజూ ఆరూ, ఆరున్నర వరకూ వుంటాడు. ఉన్నంతసేపూ సిన్సియర్‌గా చేస్తాడు. ఆ విషయం మాత్రం వొప్పుకుని తీరాలి.

ఆమె వెళ్ళబోతుంటే... "ఏమండీ! కాస్త ఈ ఉత్తరం పోస్టుచేస్తారా?" అంటూ ఓ కార్డు యిచ్చాడు.

"మీరు వెళ్తూ వేసుకోవచ్చుగా... ఇంత సాయంత్రప్పూట ఎవరు తీస్తారు పోస్టు?" అందామనుకుని బావోదని తీసుకుంది.

బీచ్ ప్రక్కనే నడుస్తూ దూరంగా ఐస్‌క్రీమ్ షాప్ ప్రక్కన పోస్టుబాక్స్‌ని చూసింది. అటు నడుస్తూ యథాలాపంగా కార్డు కేసి చూసి ఉలిక్కి పడింది.



అడ్రస్ అని వున్నచోట–వెంకటేశ్వర్రావ్, కేరాఫ్ అలివేలు మంగతాయారు, ఏడు కొండలు, తిరుపతి. అని వుంది. శార్వాణికి మతిపోయింది.

కార్డు మీద ఏముందా అనుకుంటూ, సంస్కారాన్ని కాస్త అవతలపెట్టి చదివింది.

అదిగో అప్పుడే ఆమె మొహం ఎర్ర బడింది. ముక్కుపుటాలు అదురుతూ వుండగా– "డామిట్!" అనుకుంది.

మొదట చేతిలో కార్డు చింపేద్దామా అనుకుంది కానీ దూరం నుంచి అతడు చూస్తున్నాడేమో అని భయంవేసింది.

ఒక భయంకరమైన క్రిమిని వేళ్ళతో పట్టుకున్నట్టు పట్టుకుని దాన్ని బాక్సులో వేసింది. ఆ కార్డులో వ్రాసింది తల్చుకున్నకొద్దీ ఉక్రోషం పెరిగిపోయింది ఆమెకి. అందులో ఎక్కువ వాక్యాలుకూడా లేవు.

"వెంకటేశ్వరస్వామీ. మా ఆఫీసులో ఒక అమ్మాయి చేరింది. ఆమెను చూస్తున్న కొద్దీ ఉత్థిష్టంతే అనుకో..." అని వుంది అంతే.

ఆ మరుసటిరోజే ఆఫీసుకు వెళ్ళినప్పుడు తన మొహంలో ఎలాంటి భావమూ కనిపించకుండా వుండటానికి (అంటే తనా ఉత్తరం చదివినట్టు అతనికి తెలియకుండావుండాలన్నట్టు) ఆమె చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆ కష్టపడే తాపత్రయంలోనే దొరికిపోయింది.

"నిన్న వుత్తరం పోస్టుచేశారా?" అని అడిగాడు చాలా క్యాజువల్‌గా.

"వే... వేశాను. ఎందుకు వెయ్యను?"

"ఆహాఁ!"

"ఉత్తరం ఏమిటి?" జయంతి అడిగింది.

"ఏం లేదు!... ఏంలేదు..." అని ఏదో పని వున్నట్టు అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది శార్వాణి.

ఆ సాయంత్రం ఆమె సీటు కట్టేసి వెళ్ళబోతుంటే వెనుక నుంచి నెమ్మదిగా "ఉత్థిష్టంతు" అని వినిపించింది.

చివుక్కున వెనుదిరిగి చూసింది.

శ్రీధరంఫైల్లో సీరియస్‌గా చూసుకుంటున్నాడు.

విసురుగా దగ్గరకి వెళ్ళి– "ఏమన్నారు మీరు?" అంది.

"ఏమన్నాను?"

"ఇప్పుడేదో అన్నారు!"

"అప్పుడప్పుడు నాలో నేను అలా మాట్లాడుకోవటం అలవాటు."

"అంతే కానీ నన్ను ఏమి అన్లేదంటారు."

"మెగాడ్! కొంపదీసి 'ఉత్థిష్టంతు' అన్నానా ఏమిటి?" అన్నాడు.

ఆమె గతుక్కుమని "అదంటే నన్నన్నట్టా" అంది నిలదీస్తున్నట్టు.

"సారీ అండీ, మీరు వింటున్నారు అనుకోలేదు"అన్నాడు మరింత అమాయకంగా మొహంపెట్టి.

ఇదంతా తనని ఏడిపించటం కోసం అని అర్థమై... అక్కణ్ణుంచి విసవిసా నడిచి వెళ్ళి పోయింది.



శార్వాణి తమ్ముడు లిటరేచర్ బి.యే. వాణ్ణి "ఉత్థిష్టంతు అంటే ఏమిటిరా?" అని అడిగింది.

"ఉత్థిష్టంటా?" అన్నాడు వాడు.

"ఉత్థిష్టంటు కాదురా. ఉత్థిష్టంతు"

"డిక్షనరీ చూడు. ఉత్థిష్టంటు అయుంటుంది. నువ్వు సరిగా విని వుండవు."

"వెధవా! ఆ మాత్రం నాకు తెలీదా?... నిన్ను అడగటం దేనికి?"

"ఇంగ్లీషయితే అడుగు. టకామని చెప్పేస్తాను!" అన్నాడు.

నిఘంటువు వెతికింది.కానీ తనకి కావల్సింది దొరకలేదు. విసుగ్గా డిక్షనరీ పక్కన పడేసింది.

ఆ మరుసటిరోజు యథాలాపంగా కమల్తో

"ఉత్థిష్టంతు అంటే ఏమిటి?" అని అడిగింది.

కమల ఉలిక్కిపడి ఆమెవైపు చూసి... కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

అకస్మాత్తుగా ఆమెలో ఆ మార్పు చూసి శార్వాణి కంగారుపడి "ఏం జరిగింది?" అంది.

"క్షమించు!నేనెప్పుడూ ఆ మాట నీ గురించి అన్లేదు!" అంది కమల.

"అంటే మిగతా వాళ్ళందరూ నా గురించి అనుకుంటున్నారనేగా! ఆ శ్రీధరాన్ని, ఆ రాక్షసుడిని ముక్కలు ముక్కలుగా కోసినా పాపంలేదు!" అంది కసిగా. తన అన్నయ్యని అన్ని మాటలన్నందుకు కమలకి బాగా కోపం వచ్చింది.

"నువ్వు నిజంగా ఉత్థిష్టంతువే!" అందికోపంగా.

శార్వాణి చప్పున తన కోపం మర్చిపోయి... "అయితే నీకు తెలుసా దాని అర్థం?" అని నిలదీసింది.

"ఉహూ! నాకు తెలీదు. ఎందుకో నిన్ను చూస్తుంటే అలా అనిపించింది." అంది కమల.

ఆ విధంగా ఆ రోజు నుంచీ శార్వాణికి ఆఫీసు నరకమయింది. అప్పటి వరకూ ఆఫీసంటే ఎంతో ఉత్సాహంగా వుండేది. ఇప్పుడు వెళ్ళాలంటే భయంగా వుంది. ఏ నలుగురు చేరినా తన గురించే అనుకుంటున్నారు అనిపించేది. రకరకాల కంఠాల్లో చూట్టూ ఒక స్వరం (నిశ్చయంగా శ్రీధర్‌దే) ఉత్థిష్టంతు-ఉత్థిష్టంతు - అని వినిపించేది.

ఈ బాధ భరించలేక ఒకరోజు శ్రీధరాన్నే నిలదీసింది. ఇది న్యాయం కాదు అని తిట్టిపోసింది.

శ్రీధర్ చలించలేదు. "ఇంతకీ మీకేం కావాలి మేడమ్?" అని అన్నాడు తాపీగా.

"ఉత్థిష్టంతుకి అర్థం"

"మైగాడ్! అది భార్యలగ్గానీ చెప్పకూడదే... అదీ రహస్యంగా చెవిలో..." చిలిపిగా నవ్వుతూ అన్నాడు.

అప్పటికే శార్వాణి మొహం కందిపోయింది.

అంతకు ముందే సూపర్నెంటు ఇంకో యుడి.సితో "ఆ ఫైలు ఉత్థిష్టంతుగారి దగ్గర వుందేమో చూడవోయ్!" అని అనటం వినిపించి, తన పేరు ఎంత సర్వసామాన్యమై పోయిందో తెలుసుకున్న శార్వాణి ఇక దుఃఖం పట్టలేకపోయింది.

ఇంటి కెళ్ళగానే తండ్రితో "నేను ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తున్నా నాన్నా!" అంది.

"ఇస్తే ఇచ్చావ్ గానీ అమ్మాయ్! అదేమిటి శ్రీధరాన్ని ఉత్థిష్టంతుకి అర్థం చెప్పమని అడిగావట. తప్పుకదూ! నీకు ఉద్యోగం మానేసి పిల్లల్ని కనాలి అని వుంటే మాకు చెప్పాలి గానీ అలా అడిగెయ్యటమే!" అన్నాడు గంభీరంగా.

శార్వాణి తెల్లబోయి "దాని అర్థం నీకు తెలుసా నాన్నా?" అంది.

"నాకు తెలీదమ్మాయ్! ఇప్పుడే శ్రీధర్‌బామ్మగారు వచ్చివెళ్ళారు. గుంటూరులో మనింటిపక్కే వుండేవాళ్లే. నువ్వు ఇలా అడిగావనీ, ఇంక ఆగితే లాభం లేదని తాంబూలాలు పుచ్చేసుకుందామని అన్నారు... శ్రీధర్ కేం చక్కటి కుర్రాడు. నాకేమీ అభ్యంతరం లేదన్నాను!" అని తల తిప్పేసరికి కూతురు అక్కడలేదు.

✦ పోలిక తెలియనంత కాలం ఫరవాలేదు. తెలిసిన తర్వాత లభ్యమైన దానికంటే అలభ్యమైనదే బాగుంటుంది. మనిషి విషాదానికి అదే మొదటి మెట్టు.

✦ మనిషి నిరంతరం తనని తాను ప్రశ్నించుకుంటూ ఉండాలి. వర్తమానాన్ని సమర్థించుకోకుండా, గత జీవితపు తప్పుల గురించి నిష్పక్షపాతంగా అన్వేషించాలి. మనిషికీ, మృగానికీ తేడా అక్కడే. మనిషి తనని తాను ప్రశ్నించుకోగలడు. ఆ సత్యాన్వేషణే అతడిని మిగతా జంతువులకన్నా పై మెట్టుమీద నిలిపింది.

✦ ప్రపంచాన్ని జయించిన ప్రతి ధీరుడూ కూడా ఒకప్పుడు కేరుమని ఏడ్చిన బాలుడే. ప్రపంచ ప్రసిద్ధి చెందిన భవంతులు కూడా మ్యాపులతోనే మొదలయ్యాయి.

ఆపై నెల్రోజులకి వాళ్ళ పెళ్ళి జరిగిపోయింది.

మంగళసూత్రం కడుతూ ఉంటే జయంతి వంగి చెవిలో- "నీ ఉత్థిష్టంతుకి కృతజ్ఞత చెప్పుకోవే. కన్నెపిల్లలందరూ పటం కట్టించి పెట్టుకోవలసిన పదం అది. కాణీ కట్నం లేకుండా పెళ్ళి చేయించి పెడుతుంది." అంది.

ఆ రాత్రి మల్లెల మధ్యన -దగ్గరికి తీసుకోబోతున్న శ్రీధరాన్ని ఆపి "ముందిది చెప్పండి! ఉత్థిష్టంతుకి అర్థం ఏమిటి?" అంది.

అతడో క్షణం తెల్లబోయి సర్దుకుని, అదా!ఇప్పుడా? అన్నాడు తేలిగ్గా.

"ఉహూ, అది చెప్తే గాని నేను మాట్లాడను!"

"డిక్షనరీ చూడలేక పోయావా?"

"చూశాను. లేదు!"

"ఉత్తిష్టంతు చూసి వుంటావు. లేకపోతే ఉత్తిస్టంతు చూసి వుంటావు."

"మరేం చూడాలి?"

"ఉత్థిష్టంతు" అని ఆమె బయల్దేర బోతుంటే కంగారు పడి- "అరెరె, అదేమిటి ఇప్పుడే వెళ్తావా? బైట గొళ్ళెం పెట్టి వుంటారు!" అన్నాడు.

"అది తెలుసుకోకపోతే నా మనసు మనసులో వుండదు!"

"అంతా అయ్యాక చెప్తానేం!"

"ఉహూ"

ఇక లాభంలేదన్నట్టు శ్రీధర్ ఆమెని దగ్గరికి తీసుకుని చెవిలో నెమ్మదిగా- "ఉత్థిష్టంతు అంటే..." అంటూ అర్థం చెప్పాడు.

ఆమె మొహం ఎర్రమందారం అయింది.

కళ్ళు సిగ్గుతో వాలి పోయాయి.

భుజం దగ్గర రక్తం వచ్చేలా గిల్లుతూ-"ఛీ" అంది.

(స్రవంతి-1988)

ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందం కోసం వే(గీ)సే కార్టూన్లు!

ఇక నుండి 'నెల నెలా నవ్వుల వెన్నెల' శీర్షికలో ప్రచురించబడిన ఒక కార్టూన్‌కి లాటరీ ద్వారా ఎంపిక చేసి **200 రూపాయలు** పారితోషికం ఇవ్వబడుతుంది.

అక్టోబర్ 2026 సంచిక విజేత **శ్రీవర్చస్వీ గారు**

బహుమతి ఇచ్చిన వారు- **శ్రీ సుందరం!**

ఈ నెల అంశం- డీజే సౌండ్స్

నిర్వహణ: **లాల్**














మీ అమ్మాయి ప్రేమించింది మంచి సౌండ్ పార్టీ అన్నావ్!! బాగా డబ్బులున్నాయ్ అనుకున్నా! DJ sound. బ్యాండు మేళం అంటగా!!
RAVISHANKAR AVADHANAM.


ఈ DJ సౌండ్ ల పుణ్యమాని నా ప్రాక్టీస్ బాగుందిరా..
! ?
Sunil


చెవులు చిల్లులు పడే డిజె సౌండు విని వింటారేం మనుషులు.. కానీ మన పాటలు ఎందుకు వినలేరు పిన్నీ!!


డీజే సౌండ్స్ ఆపేసినా చెవుల్లో ఏదో రింగుమంటుంటే... అలా స్టెప్స్ వేయబుద్ధవుతుందట డాక్టర్!!
భయంగా ఉంది!!
డా॥ కర్ణన్
Vandanam


మస్తు సౌండు చేస్తూ గురక పెడతావంటే నమ్మవుగా.. రేపు నీకే వినిపిస్తా!!
గుర్ర్‌ర్ర్!
డీ.జే. సౌండ్ సిస్టమ్
భీమేశ్


టైం 3.00 AM అయ్యింది.. డిజే సౌండ్ కంటే పెద్దగా ఉండే నా ఏడుపు స్టార్ట్ చేస్తా!
3:00 AM
z z Z
z z Z
ప్రసిద్ధ


"వివాహ మహోత్సవం"
ఏముందీ, డి.జె సౌండ్స్‌కు గుండాగి పెళ్ళికొడుకు చస్తే.. పెళ్ళిబాజా, కాస్తా చావుబాజా అయింది అంతే...
పి.వి.నాయుడు


కనీసం సండే పూటైనా డిజే సౌండ్‌ని ఆస్వాదించని మమ్మీ!!
DJ
ప్రదీ కజ

యండమూరి వీరేంద్రనాథ్
మహా (ప) దానందం

కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111

డా. యండమూరి వీరేంద్రనాథ్ గారి సాహితీ ప్రస్థానం ఆధారంగా తయారు చేసిన ఈ 'పదానందం' కరెక్ట్‌గా జవాబు రాసి పంపిన వారిలో ముగ్గురికి (డ్రా తీసి) **యండమూరి నవల 'అంతర్ముఖం'** బహుమతిగా ఇవ్వబడుతుంది. మీ జవాబు ఈ వాట్సాప్ నెంబరుకి పంపండి- 9502630637

ఆధారాలు

అడ్డం:

1. యండమూరి దర్శకత్వంలో ఒక సినిమా (8)
6. ఆయన నవల ....ఆమె సైన్యం (3)
8. ఊపిరి ఆగిపోయేంత ఉత్కంఠతో ఉండే కథా సంకలనం 'దుప్పట్లో.......' (3)
9. '..........రాజారాం' అనే నాటకానికి సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది (7)
11. దీని వర్గం ఇదే, దీని మైనస్ కూడా ఇదే! రెండూ గొప్ప నవలలు (2)
12. యండమూరి తండ్రిగారి పేరు లోని మధ్య రెండక్షరాలు (2)
13. హాలీవుడ్ సినిమాకి ఎంపికైన నవల (5)
15. మనిషిలోని మరో మనిషి గురించి విశ్లేషించే అద్భుత నవలలో సున్నా లోపించింది (4)
19. మరోగొప్ప నవల 'వెన్నెల్లో.....'(అటునుంచి) (4)
20. ఇంకో అద్భుత నవల 'చెంగల్వ.......' (3)
21. ఒక విలక్షణ నవల 'కృష్ణుని ప్రియురాలు', 'పాండవుల తల్లి' (4)
23. యండమూరి రచించిన ఒక నాటిక (2)
24. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో సినిమాగా సూపర్ హిట్ అయిన నవల (4)
25. యండమూరి దర్శకత్వంలోనే సినిమాగా వచ్చిన ఆయన నవల (5)

నిలువు:

1. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకి యండమూరి స్క్రీన్‌ప్లే రాసారు (4)
2. యండమూరి పదేళ్ళపాటు 'శూన్యం లోపించిన' ఈ బ్యాంకులో పనిచేశారు. (2)
3. కోదండరామిరెడ్డి దర్శకత్వంలోని '........రాగాలు' సినిమాకు యండమూరి స్క్రీన్‌ప్లే రాశారు. (2)
4. చిరంజీవి హీరోగా బంపర్ హిట్ అయిన యండమూరి నవల(పైకి) (4)
5. వ్యక్తిత్వ వికాస రచన '........చేద్దాం రండి' (పైకి) (2)
6. ఎనిమిది రకాల అవకారాల పేరుతో ఒక ప్రముఖ నవల (4)
7. ఒక గొప్ప నవల '........రెక్కల చప్పుడు' (2)
10. మరో వ్యక్తిత్వ వికాస రచన 'విజయంవైపు......' (3)
13. సినిమాగా వచ్చిన ఈ అద్భుత నవలకు అంతు లేదు! (5)
14. నోరూరించే వంటకాలున్న ఒక నవల (7)
16. 'థ్రిల్లర్' నవలను 'ముద్దు' లేకుండా తీసిన సినిమా!(పైకి) (4)
17. మరొక గొప్ప రచన '......వర్షం' (4)
18. 'విలేజ్‌లో...' హాస్యచిత్రంలో యండమూరి కీలకపాత్ర పోషించారు (5)
22. బ్రిటన్‌లో న్యాయవాదిగా స్థిరపడ్డ ఒక భారత స్త్రీపై రాసిన నవల పైకొచ్చి....చివర లోపించింది! (3)



Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

అక్షజ్ఞ పబ్లికేషన్స్

ప్రచురణలు అభిరుచికి దర్పణాలు

Akshagna Publications

12-11-1364, Parasara Apartments, 2nd Floor,
Bouddha Nagar, Warasiguda, Secunderabad 500061
Ph: 8712729057, 8341450673, Email: akshagna.kruti@gmail.com

ముళ్ళపూడి వెంకటరమణ రచనలు

















Scan the code for Akshagna Books

ఇంకొన్ని ప్రచురణలు...

ముళ్లపూడి శ్రీదేవి:
రమణీయ శ్రీ భాగవతం.
బ్నిం: బాపుగారితో నేను,
మిస్సస్ అండర్ స్టాండింగ్,
మరపురాని మాణిక్యాలు.
తనికెళ్ల భరణి: శివ చిలుకలు, భరణీయం.
ఎమ్వీయల్: అధిక ప్రసంగం
చేంబోలు శ్రీరామ శాస్త్రి:
సిరివెన్నెల తొలిగురువు, మనిషికి మరమ్మత్తు.



Hasyanandam November-2026 RNI No. APTEL 08387/01/1/2003-TC

Sambamurty Enterprises
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548